www.navatelangana.com
అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
మంగళవారం 27-08-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 192
Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam
12 పేజీలు వెల : 6.50

ఏడాదికే కూలిన శివాజీ విగ్రహం



మహారాష్ట్రలో ఎడతెరిపి లేని వర్షంతో 35 అడుగుల స్టాచ్యూ నేలమట్టం

నాణ్యతా లోపమే కారణం : ప్రతిపక్షాల మండిపాటు 11లో..

త్వరలో 35 వేల ఉద్యోగాలు భర్తీ



సివిల్స్‌లో సత్తా చాటండి..తెలంగాణ కీర్తి పతాకాన్ని ఎగరేయండి

విద్యకు అధిక ప్రాధాన్యత

రూ.ఐదు వేల కోట్లతో సమీకృత గురుకులాల ఏర్పాటు

స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఏటా 20వేల మందికి నైపుణ్యాల్లో శిక్షణ

15 రోజుల్లో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వీసీ పోస్టులతో పాటు ఇతర ఖాళీల భర్తీ : 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి



సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన విద్యార్థులకు రూ.లక్ష ఆర్థికసాయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"సివిల్స్‌లో తెలంగాణ కీర్తి పతాకాన్ని ఎగరేయండి. ఈ ప్రభుత్వం మీది. అన్ని వేళలా మీకు అండగా ఉంటుంది. సివిల్స్‌లో బీహార్, యూపీ తదితర రాష్ట్రాల నుంచే ఎక్కువగా అభ్యర్థులు ఎంపికవుతున్నారు. ఈ సారి రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున విజేతలు కండి. మీ తల్లిదండ్రులకు, మీ ఊరికి, తద్వారా రాష్ట్రానికి మంచి పేరు తీసుకురండి" అని సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులకు ఉద్బోధిం చారు. సివిల్స్‌లో రాష్ట్రం నుంచి మెయిన్స్‌కు అర్హత సాధించిన 135 మంది అభ్యర్థులకు సింగరేణి సహకారంతో 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పేరిట రూ.లక్ష ఆర్థిక సాయాన్ని సోమవారం హైదరాబాద్‌లోని సచివాయంలో డిప్యూటీ సీఎం భట్టితో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచి అత్యధికంగా సివిల్స్‌లో ఉత్తీర్ణులవడం ద్వారా తెలంగాణ ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా రూ. లక్ష ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. నిరుద్యోగులు, విద్యార్థుల ఉద్యమాలతోనే తెలంగాణ కల సాకారమైందని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నట్టు చెప్పారు. "సర్టిఫికెట్ కోర్సులకే విద్య పరిమితమవుతోంది. నైపుణ్యం లేకపోవడంతో ...2లో

బీజేపీ బలంగా లేకుంటే బంగ్లాదేశ్ పరిస్థితులే

రైతుల ఆందోళనలపై కంగనా వివాదాస్పద వ్యాఖ్యలు

ఏఐకేఎస్ ఖండన



న్యూఢిల్లీ : రైతుల ఆందోళనలపై బాలీవుడ్ నటి, మండి ఎంపీ కంగనా రనౌత్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అగ్రనాయకత్వం (బీజేపీ) బలంగా లేకుంటే రైతుల ఆందోళనలతో దేశంలో బంగ్లాదేశ్ పరిస్థితులే తలెత్తి ఉండేవని తెలిపారు. కంగనా మాట్లాడుతూ "బంగ్లాదేశ్‌లో అరాచకం జరిగినట్టే భారతదేశంలోనూ జరిగి ఉండేది. విదేశీ శక్తులు రైతుల సాయంతో మనల్ని నాశనం చేయాలని కుట్ర పన్నాయి. మన నాయకత్వానికి దూరదృష్టి లేకుంటే వారు విజయం సాధించి ఉండేవారు" అని అన్నారు.మూడు వ్యవసాయ చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేస్తుందని రైతులు ఊహించి ...11లో



మాట్లాడుతున్న తమ్మినేని

సామాజిక మాధ్యమాల్లోనూ బీజేపీ దుష్ప్రచారం

మతోన్మాద చర్యలతో ప్రజల్ని పక్కదోవ పట్టిస్తోంది

సమస్యల వెలికితీతలో సోషల్‌మీడియా కీలకం

ప్రజాస్వామ్య శక్తులు వాస్తవాలను ప్రజలకు చేరవేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్రస్థాయి సోషల్‌మీడియా శిక్షణాతరగతుల్లో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ఖమ్మం

సామాజిక మాధ్యమాల్లోనూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దుష్ప్రచారం సాగిస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ప్రజాహితం కోరే వామపక్షాలు వీటిని తిప్పికొట్టడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రధాన మీడియా కార్పొరేట్ కనుసన్నల్లో మెలుగుతున్న దశలో స్థానిక సమస్యలపై పార్టీ సోషల్‌మీడియా నిర్వాహకులు దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ...11లో



కుదిరిన పొత్తు 11లో..

జమ్మూ కాశ్మీర్‌లో 51 స్థానాల్లో ఎన్‌సీ, 32 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ

సీపీఐ(ఎం), పాంథర్ పార్టీకి చెరోటి

ఐదు స్థానాల్లో స్నేహపూర్వక పోరుకు అంగీకారం



లద్దాక్‌లో ఐదు కొత్త జిల్లాలు

ప్రకటించిన కేంద్ర హోం శాఖ


న్యూఢిల్లీ : కేంద్రపాలిత ప్రాంతం లధక్‌లో ఐదు కొత్త జిల్లాలను కేంద్రం ఏర్పాటు చేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. జంస్కర్, ద్రాస్, షామ్, నుబ్రా, ఛాంఘంగ్ జిల్లాలను ఏర్పాటు చేసిననట్టు తెలిపారు. ఈ విషయాన్ని ఎక్స్ పోస్టు ద్వారా మంత్రి వెల్లడించారు. అభివృద్ధి చెందిన, సంపన్నమైన లద్దాక్‌ను ...11లో



తొలి జాబితాతోనే బీజేపీలో చిచ్చు

శ్రీనగర : జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ సోమవారం తన తొలి జాబితాను విడుదల చేసింది. ఈ తొలిజాబితాతోనే బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు, లుకలుకలు బయటపడ్డాయి. సోమవారం ఉదయం ముందుగా 44 మంది అభ్యర్థులతో బీజేపీ జాబితాను విడుదల చేసింది. అయితే ఈ అభ్యర్థులపై కొంత మంది కార్యకర్తలు, నాయకులు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేయడంతో తరువాత ఈ సంఖ్యను 16కు బీజేపీ తగ్గించింది. ఈ 16 మందిలో ...11లో

సీజనల్ జ్వరాల విజృంభణ



వైరల్ ఫీవర్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ఐదుగురు మృతి

నవతెలంగాణ-విలేకరులు



రాష్ట్రవ్యాప్తంగా సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. వైరల్, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా. వంటి జ్వరాలతో ఆరోగ్యం పడకేసింది. దాంతో రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడు తున్నాయి. సరైన వైద్యం అందక ఐదుగురు మృతి చెందిన ఘటనలు పలు జిల్లాల్లో వెలుగులోకి వచ్చాయి. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగాదేవిపాడులో ఈడుపుగంటి సామ్రాజ్యం(67)కు వారం క్రితం జ్వరం రావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఇదే మండలం బ్రహ్మళకుంటకు చెందిన బానోతు కృష్ణ(50)కు వారం కింద ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో కల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొంది రెండు రోజుల కింద ఇంటికి వచ్చాడు. కాగా, సోమవారం పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలోనే కుప్పకూలి చనిపోయాడు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలానికి చెందిన నరేష్ (29) డెంగ్యూతో మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన నేరెళ్ల ప్రశాంత్(26)కు జ్వరం రావడంతో స్థానికంగా చికిత్స తీసుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో.. ధర్మారంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుంటుండగానే.. పరిస్థితి ...11లో

విషజ్వరాలపై చర్యలు తీసుకోవాలి 11లో..

సంచార వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

మందులు,పరికరాలు,డాక్టర్లు,ఇతర సిబ్బంది ఉండాలి : మంత్రి దామోదర రాజనర్సింహకు తమ్మినేని లేఖ



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి

అంబేద్కర్ అభయహస్తం కోసం విధివిధానాలు రూపొందించాలి

సంక్షేమ హాస్టళ్ల మెస్ చార్జీల పెంపునకు 2న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు : కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొత్త ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు పూర్తవుతున్నా చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ఎందుకు అమలు చేయటం లేదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి స్కైలాబ్‌బాబు ప్రశ్నించారు. అంబేద్కర్ అభయ హస్తం కోసం విధివిధానాలు తక్షణమే రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్ల మెస్ చార్జీలు పెంచాలంటూ వచ్చే నెల 2న కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు ముందు దళిత గిరిజనుల కోసం కాంగ్రెస్ చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను విడుదల చేసిందనీ, ఇది జరిగి ఏడాది గడిచిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెల్లు గడిచిందని తెలిపారు. అంబేద్కర్ అభయహస్తం కోసం ప్రభుత్వం రూ. 2000 కోట్లు బడ్జెట్‌లో ప్రకటించిందనీ, ఆ పథకం అమలుకు మార్గదర్శకాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. దళితుల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సాంఘిక సంక్షేమ శాఖకు ...2లో



డ్రైవర్ లేకుండానే.. కారు నడవడం అద్భుతం

ఐఐటీ హైదరాబాద్ సందర్శనలో ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-కంది

డ్రైవర్ లేకుండా వాహనాలు నడవడం ఓ అద్భుతమని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని ఐఐటీ హైదరాబాద్‌ను సోమవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో కలిసి మంత్రి సందర్శించారు. తిహాన్ వేదికగా జపాన్‌కు చెందిన సుజుకీ కంపెనీ సహకారంతో నూతనంగా తయారు చేసిన డ్రైవర్ లేని కారును పరిశీలించారు. జగ్గారెడ్డితో కలిసి క్యాంపస్‌లో డ్రైవర్ లేకుండా నడిచే వాహనంలో మంత్రి ప్రయాణించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్యను అధిగమించేలా అనేక పరిశోధనలు చేస్తున్నట్టు తెలిపారు. మూడేండ్ల సుదీర్ఘ పరిశోధనల తర్వాత డ్రైవర్ లేకుండా నడిచే వాహనాన్ని దిగ్విజయంగా ముందుకు తీసుకురావడం గొప్ప విషయమన్నారు. ఇందుకు కృషి చేసిన ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్‌తో పాటు పరిశోధకుల బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన ప్రత్యేకంగా ...11లో

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "ఒకవైపు రాష్ట్రంలో డెంగ్యూ మరణాలే లేవని ప్రభుత్వం చెబుతున్నది. మరోవైపు పత్రికల్లో ఆ వ్యాధితో ప్రజలు చనిపోతున్నారని రోజు వార్తలొస్తున్నాయి. రెండు రోజుల క్రితమే డెంగ్యూ ...11లో


యూపీఎస్ వద్దు..ఓపీఎస్ ముద్దు

కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన ఏకీకృత పెన్షన్ పథకాన్ని (యూపీఎస్) పలు కార్మిక సంఘాలు తిరస్కరించాయి. రెండు దశాబ్దాల క్రితం రద్దు చేసిన పాత పెన్షన్ పథకాన్నే (ఓపీఎస్) తిరిగి చేపట్టాలని డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం యూపీఎస్‌ను తెర పైకి తెచ్చి ఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తోందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంస్థ 'ది నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్' విమర్శించింది.

ఏకీకృత పెన్షన్ పథకాన్ని తిరస్కరిస్తున్న కార్మిక సంఘాలు

- ఉద్యోగుల భాగస్వామ్య వాటా ఎందుకని నిలదీత
- సమస్యలు తప్పవని హెచ్చరిక
- అనేక అంశాలపై స్పష్టత లేదని పెదవి విరుపు





న్యూఢిల్లీ : 'ఓపీఎస్ కింద 20 సంవత్సరాల సర్వీసు ఉంటే పూర్తి పెన్షన్ వచ్చేది. యూపీఎస్‌లో దానిని పాతిక సంవత్సరాలు ఎందుకు చేశారు? మేము ఓపీఎస్ కోసం పోరాటాన్ని కొనసాగిస్తాం' అని మూవ్‌మెంట్ అధ్యక్షుడు విజయ్ కుమార్ బంధు స్పష్టం చేశారు.

షేర్ మార్కెట్‌లో పెన్షన్ నిధులు : సీఐటీయూ

ఎన్‌పీఎస్ కంటే యూపీఎస్ మెరుగైనది కావచ్చునని, కానీ అది కూడా భాగస్వామ్య పథకమేనని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ తెలిపారు. తాము ఓపీఎస్‌ను మాత్రమే డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. 'మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన నయా ఉదారవాద ముసుగులో క్రోనీ క్యాపిటల్ ప్రయోజనాలను పరిరక్షిస్తోంది. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం తన వాటాను మరో నాలుగున్నర శాతం పెంచింది. జూలై 31 నాటికి ఎన్‌పీఎస్ కింద ఉన్న 99,77,165 మంది ఉద్యోగులకు చెందిన రూ.10,53,850 కోట్ల పెన్షన్ నిధులను షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడానికే ఇలా చేస్తోంది' అని ఆయన మండిపడ్డారు. యూపీఎస్‌లో ప్రభుత్వ, ఉద్యోగుల భాగస్వామ్య వాటాల మొత్తాన్ని వివిధ సంస్థల్లో పెట్టుబడి ...11లో

నవతెలంగాణ

నేడు కోటగుళ్లలో గవర్నర్ పర్యటన

- 150 మంది పోలీసులతో భద్రత కట్టుదిట్టం
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ, డీఎల్‌పీఓలు



నవతెలంగాణ-గణపురం

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని శ్రీ భవానీ సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళను నేడు (మంగళవారం) తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సందర్శించనున్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకు ములుగు జిల్లా రామప్ప, జయశంకర్ జిల్లా గణపురం మండలం కోటగుళ్లలో గవర్నర్ పర్యటన కొనసాగనుంది. గవర్నర్ పర్యటనను పురస్కరించుకొని అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గవర్నర్ రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం భూపాలపల్లి డీఎస్పీ అవిరినేని సంపత్‌రావు ఆధ్వర్యంలో చిట్యాల సీఐ డి. మల్లేష్, గణపురం ఎస్ఐ రేఖ అశోక్ కోటగుళ్ళను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గవర్నర్ కోటగుళ్ల పర్యటన సందర్భంగా ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 10మంది ఎస్ఐలతో సుమారు 150మంది సివిల్ స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని వివరించారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద ఇతర వాహనాలను నిలిపివేయడం జరుగుతుందని గవర్నర్ పర్యటన ప్రొటోకాల్ ప్రకారం కొనసాగుతుందని గర్భాలయంలోకి ఎవరికీ అనుమతి ఉండదని, మీడియాకు అనుమతి లేదని తెలిపారు. గవర్నర్ పర్యటన సందర్భంగా ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కోటగుళ్లలో పారిశుధ్య పనులు 3 రోజులుగా కొనసాగుతున్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయడంతో పాటు ట్రాన్స్‌కో ఏఈ వెంకటరమణ ఆధ్వర్యంలో చెట్లను తొలగిస్తున్నారు. డీఎల్‌పీఓ వీరభద్రం ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్‌రావు, ఎంపీడీఓ భాస్కర్, కార్యదర్శులు హరిచంద్ర రెడ్డి, విజేందర్, హేమంత్, రాకేష్, ఏపీవో రాజు, టీఏలు నవ్య, రాజశ్రీ శ్రావణ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ దూలం శ్రీదేవి, చెన్నూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డీ - 40 కాలువకు నీటిని విడుదల చేయాలి

- కాలువ వద్ద రైతుల నిరసన



నవతెలంగాణ-మాడుగులపల్లి

నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం డీ-40 కాలువ ద్వారా వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. పానగల్లు చెరువు కింద ఉన్న డిస్ట్రిబ్యూటర్ కాలువలైన డీ-25, డీ-37, డీ-39, డీ-40 కాలువలకు నీటిని అందిస్తారని తెలిపారు. ఖరీఫ్ పంటలు మొదలు కావడంతో డీ-40 కాలువకు కూడా నీటిని విడుదల చేస్తారని.. నార్లు పోసుకుని నాట్లు వేశామని చెప్పారు. కానీ, వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు అధికారులు డీ-40 కాలువకు నీటిని విడుదల చేయలేదన్నారు. దీంతో వరి పైరు, నారుమడులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డీ-25, డీ-37, డీ-39 కాలువలకు నీటిని వదిలి.. తమ గ్రామానికొచ్చే డీ-40 కాలువకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటిని విడుదల చేసి చెరువును నింపితే దాదాపు 3000 ఎకరాలకు నీరు పారుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అధికారులకు తగు సూచనలిచ్చి డీ-40 కాలువ ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే కలెక్టర్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కూడా కలిసి తమ బాధలు చెప్పుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కోడూరు శ్రీను, కొడదల వెంకట నరసయ్య, కొడదల నాగేష్, తండు సైదులు, చింతపల్లి శ్రీను, కొడదల యాదయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను అధికారులు సోమవారం కూల్చివేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈ కూల్చివేతలు చేపట్టారు. లిడ్ క్యాప్‌కు చెందిన రాయదుర్గం సర్వేనెంబర్ 2, 3, 4, 5లో ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను అధికారులు గుర్తించారు. లిడ్ క్యాప్ స్థలంలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. స్థానికులు మాట్లాడుతూ.. తాము 40 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నామని తెలిపారు. కూల్చివేతలు సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

జిబ్రానిక్స్ నుంచి కొత్త స్మార్ట్ ఎల్ఇడి ప్రొజెక్టర్



చెన్నయ్ : ఎలక్ట్రానిక్స్ కన్స్యూమర్ బ్రాండ్ జిబ్రానిక్స్ కొత్తగా జెబ్ పిక్సీప్లే 54 స్మార్ట్ ఎల్ఇడి ప్రొజెక్టర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. 3800 లుమెన్స్ బ్రైట్‌నెస్ కలిగిన దీనితో ఇష్టమైన సినిమాలు, షోలు, గేమ్‌లను ఉత్సాహంగా తిలకించొచ్చని పేర్కొంది. ఇది 1080పి ఫుల్ హెచ్‌డికి మద్దతును ఇస్తుందని.. 356 సెంటీమీటర్ల వరకు దృశ్యాన్ని పొందవచ్చని తెలిపింది. దీని ధరను రూ.10,999గా నిర్ణయించినట్లు ఆ కంపెనీ డైరెక్టర్ ప్రదీప్ దోషి తెలిపారు. క్వాడ్-కోర్ ప్రాసెసర్‌తో ఆధారితమైన ఈ ప్రొజెక్టర్ జెబ్ ఫిక్సా ప్లే 54 మదువైన పనితీరును కనబర్చుతుందని.. దీన్ని అందుబాటులోకి తేవడం గర్వంగా ఉందన్నారు.

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులకు గాయాలు



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పై హాజీపూర్ గ్రామ సమీపంలో కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి మీదుగా నిజాంసాగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి చెట్టును ఢీ కొన్న ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉండగా ఈ ప్రమాదంలో సుమారు 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో క్షతగాత్రులని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అదే సమయంలో ఎల్లారెడ్డి పట్టణంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు ప్రమాద సమాచారం తెలియడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్‌లో చీటింగ్..!

వైద్యం చేయకుండానే నిధులు మాయం

- నకిలీ బిల్లులతో హాస్పిటల్స్ దందా
- రాష్ట్రవ్యాప్తంగా 28 దవాఖానాలపై కేసు
- ఖమ్మంలోనే అధికం.. పది ఆస్పత్రుల్లో గల్లంతు
- కొనసాగుతున్న సీఐడీ విచారణ



నకిలీ బిల్లులతో నిధులు డ్రా...

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

నిరుపేద రోగుల సహాయార్థం ఉద్దేశించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) సొమ్ము దుర్వినియోగం అయింది. రాష్ట్రవ్యాప్తంగా 28 ఆస్పత్రుల్లో వైద్యం చేయకుండానే నకిలీ బిల్లులతో నిధులు డ్రా చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. వీటిలో 10 హాస్పిటల్స్ ఖమ్మం నగరానికి చెందినవే కావడం చర్చనీయాంశంగా మారింది. సంబంధిత హాస్పిటల్స్‌పై సీఐడీ అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ ఆస్పతులన్నీ ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, మహబూబాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాకు చెందినవిగా గుర్తించారు. వాటిపై విచారణ కొనసాగుతోంది. కొన్ని ఆస్పత్రుల్లో అయిన బిల్లుల కంటే అదనంగా రశీదులు సమర్పించి నిధులు నొక్కేసినట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ నిధుల దుర్వినియోగం జరిగిన నేపథ్యంలో నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకత కోసం సీఎంఆర్ఎఫ్ స్కీమ్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించేలా కొద్దిరోజుల క్రితం మార్పులు చేసింది.

రాష్ట్ర సచివాలయంలో సీఎంఆర్ఎఫ్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డీఎస్ఎన్ మూర్తి ఫిర్యాదు మేరకు ఈ విచారణ కొనసాగుతోంది. నకిలీ బిల్లులతో నిధులు డ్రా చేసిన వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉంది? ఆ హాస్పిటల్‌లో పనిచేసే సిబ్బంది పేరుతో ఏమైనా డ్రా చేశారా? లేదంటే హాస్పిటల్ యాజమాన్యం కండ్లు గప్పి సిబ్బందే ఏమైనా నకిలీ బిల్లులు సృష్టించారా? బయటి వ్యక్తులను ఇందు కోసం వినియోగించుకున్నారా? ఇందుకోసం ప్రత్యేకంగా దళారులు ఏమైనా ఉన్నారా? లేదంటే గత ప్రభుత్వంలోని నాయకులే హాస్పిటల్స్ యాజమాన్యంతో కుమ్మక్కై ఈ దందాకు పాల్పడ్డారా? ఈ దందా కోసం ఏమైనా ప్రత్యేకంగా ముఠాలు పనిచేశాయా..? అనే కోణంలో సీఐడీ దర్యాప్తు చేస్తోంది. ఆరోపణలు వచ్చిన ఈ 28 ఆస్పత్రుల యజమానులతో పాటు సిబ్బందిని కూడా విచారించేందుకు సీఐడీ రంగంలోకి దిగింది. అయితే ఈ వ్యవహారంపై తెలంగాణ సీఐడీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

ఏడాది క్రితం మంచిర్యాల జిల్లాలోనూ..

ఏడాదిన్నర క్రితం మంచిర్యాల జిల్లాలోనూ ఇలాంటి కుంభకోణం వెలుగు చూసింది. దీనిపై అక్కడి సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఎంఆర్ఎఫ్ నిధులు డ్రా చేసేందుకు లేని దవాఖానలను కూడా నిందితులు సృష్టించారు. ఆ జిల్లాలో ఓ మహిళ పేరుతో చెక్ మంజూరైంది. దానిని తీసి తనకు ఇవ్వాలని ఓ ప్రజాప్రతినిధి ఆమెపై ఒత్తిడి చేశారు. దీనిపై ఆమె ఆరా తీయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. దీనిపై అప్పటి నుంచే సీఐడీ దృష్టి సారించింది. ఆస్పత్రి సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వారి అనుచరుల ప్రమేయంతోనే రూ.కోట్లలో ఈ స్కామ్ జరిగినట్టు తెలుస్తోంది. అయితే సీఐడీ అధికారికంగా దీన్ని ధ్రువీకరించాల్సి ఉంది.

ఫిర్యాదులోని హాస్పిటల్స్ ఇవే..

సీఐడీకి అందిన ఫిర్యాదు ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 28 హాస్పిటల్స్‌పై వచ్చిన అనేక దరఖాస్తులపై అనుమానాలు నెలకొన్నాయి. ఖమ్మంలోని శ్రీకర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, డాక్టర్ జేఆర్ ప్రసాద్ హాస్పిటల్, శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీ సాయి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, వైష్ణవి హాస్పిటల్, సుజాత హాస్పిటల్, న్యూ అమృత హాస్పిటల్, ఆరెంజ్, మేఘశ్రీ హాస్పిటల్స్ ఉన్నాయి. వీటితో పాటు రంగారెడ్డి జిల్లాకు చెందిన మీర్‌పేటలోని హిరణ్య హాస్పిటల్, బీఎన్‌రెడ్డి నగర్‌లోని శ్రీ రక్ష హాస్పిటల్, హస్తినాపురంలోని డెల్టా హాస్పిటల్, సాగర్ రింగ్‌రోడ్డులోని ఎంఎంఎస్ హాస్పిటల్, రామంతాపూర్‌లోని ఏడీఆర్ఎం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్త పేటలోని ఎంఎస్‌వీ ఇందిరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, బైరామల్‌గూడలోని శ్రీసాయి తిరుమల హాస్పిటల్, హైదరాబాద్ ఐఎస్ సదన్‌లోని అరుణశ్రీ మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్, సైదాబాద్‌లోని శ్రీ కృష్ణ హాస్పిటల్, జనని హాస్పిటల్, నల్లగొండ జిల్లా మిర్యాల గూడలోని నవీన మల్టీ స్పెషాలిటీ, మహేశ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, నల్లగొండ రైల్వేస్టేషన్ రోడ్డులోని అమ్మ హాస్పిటల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని సప్తగిరి హాస్పిటల్, పెద్ద పల్లిలోని శ్రీసాయి హాస్పిటల్, ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండలోని రోహిణి మెడికల్ ప్రయివేట్ లిమిటెడ్, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ సంజీవని, సిద్ధార్థ హాస్పిటల్స్ ఫిర్యాదులో ఉన్నాయి.

వాగ్దానాలు నెరవేర్చకపోతే ప్రజా ఉద్యమాలే

- విద్యా, వైద రంగాలు కార్పొరేట్లకు ధారాదత్తం : మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇండ్లు కట్టివ్వాలి : అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

> ప్రజలపై మరిన్ని భారాలు మోపే పనిలో మోడీ సర్కారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోతే పేదలను సమీకరించి ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య ప్రారంభ సూచికంగా జెండాను ఎగురవేశారు. అనంతరం సీతారాములు మాట్లాడుతూ..కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ సర్కారు ప్రజలపై మరిన్ని భారాలు మోపడానికి ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. విద్యా, వైద్య రంగాలను కార్పొరేట్లకు కట్టబెడుతూ వారికి ఊడిగం చేస్తున్నదన్నారు. పేదలకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో ఏటేటా నిధులను మోడీ సర్కారు తగ్గిస్తూ పోతున్నదని విమర్శించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న తీరును ఎండగట్టారు. పేదలకిచ్చే సబ్సిడీలను ఎత్తేస్తూ బడా కార్పొరేట్లకు ఇస్తున్నదని విమర్శించారు. దేశంలో నేటికీ 70 శాతం మందికి సెంటు భూమి కూడా లేదనీ, మిగులు భూములను వెంటనే పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు, మతోన్మాదులకు దోచిపెడుతున్నదని విమర్శించారు. గ్రామీణ పేదల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన మోడీ సర్కారు నిధులను మాత్రం కార్పొరేట్లకు ఇస్తూ మేలు చేస్తున్న తీరును ఎండగట్టారు. ఇల్లు లేని పేదలకు వెంటనే ఇండ్ల స్థలాలివ్వాలని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఒక్కొక్క లబ్దిదారునికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదలు ఆర్థికంగా ఎదగాలన్నా, ఆత్మగౌరవంతో జీవించాలన్నా భూమి, కూలి, ఉపాధి పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఏఐఏడబ్ల్యూయూ కేంద్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, మచ్చా వెంకటేశ్వర్లు, నారి అయిలయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, బొప్పని పద్మ, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు కొండమడుగు నర్సింహ్మ, ములకలపల్లి రాములు, కందుకూరి జగన్, శశిధర్, ఎం.ఆంజనేయులు, ఎం.నర్సింహులు, లంక రాఘవులు, బి.సాంబశివ, బి.సమ్మయ్య, అల్వాల వీరయ్య, పెద్ది వెంకట్రాములు, యు.గోపాల్, సింగారపు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

- ఎల్‌ఆర్‌ఎస్ స్కీం ఉచితంగా అమలు చేయాలి
- టార్గెట్లతో ప్రజలను వేధించొద్దు : సీఎంకు మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను ఉచితంగా అమలు చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. అధికారులకు టార్గెట్లు నిర్దేశించి ప్రజలను వేధించొద్దని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. భూముల క్రమబద్ధీకరణ పథకాన్ని పూర్తి ఉచితంగా అమలు చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. అందుకు భిన్నంగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల రూపేణా రూ.15 వేల కోట్లు వసూళ్ళ చేయలంటూ కలెక్టర్ స్థాయి నుంచి పంచాయతీ సెక్రెటరీ వరకు టార్గెట్లు పెట్టి ప్రజలను వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై రేవంత్ రెడ్డితో సహా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు గతంలో విమర్శలు చేశారని తెలిపారు. ఎన్నికలు పూర్తి కాగానే రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ప్రజాపాలన అంటున్న పాలకులకు 25.44 లక్షల దరఖాస్తుదారుల కుటుంబాల ఆవేదన కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. మాట తప్పిన ప్రభుత్వానికి చెంప పెట్టుగా ఏ ఒక్కరూ ఒక్క రూపాయి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించవద్దని హరీశ్ రావు ప్రజలకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయించే బాధ్యత బీఆర్ఎస్ తీసుకుంటుందని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ అంటేనే మొండిచెయ్యి

- మాజీమంత్రి కేటీఆర్ విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ అంటేనే మొండిచెయ్యి అని మరోసారి రుజువైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కే తారకరామారావు (కేటీఆర్) విమర్శించారు. ఈ మేరకు మంగళవారంనాడాయన 'ఎక్స్' లో పోస్టు పెట్టారు. రుణమాఫీ అయిన రైతులకన్నా కంటతడిపెట్టిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. అన్ని విధాల అర్హత ఉన్నా, ఎందుకు రుణమాఫీ కాలేదో చెప్పేటోడు లేడని రాసుకొచ్చారు. రెండు సీజన్లు అయినా రైతు భరోసా ఇంకా షురూ చెయ్యలేదనీ, జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా, ఆగస్టు దాటుతున్నా రైతుల ఖాతాలో వెయ్యలేదని తెలిపారు. కౌలు రైతుకు ఇస్తానన్న రూ.15 వేలు, రైతు కూలీలకు ఇస్తానన్న రూ.12 వేలు ఇంకా అమలు చేయలేదని పేర్కొన్నారు.

దళితులను ఆలయంలోకి రానివ్వని బీసీ కులస్తులు

- శివారు వెంకటాపూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి..
- గ్రామాన్ని సందర్శించిన సీఐ, ఎస్ఐ
- తమకు న్యాయం చేయాలని పోలీసులతో బాధితుల మొర



నవతెలంగాణ-మర్కుక్

కాలం మారుతోంది.. అభివృద్ధిలో దేశం ముందుకు సాగుతోంది.. అయినా దళితుల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ కొన్ని చోట్ల దళితుల ఆలయ ప్రవేశాలను అడ్డుకుంటున్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఉల్లంఘిస్తూ వివక్ష చూపిస్తున్నారు. ఇలాంటి ఘటనే సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని శివారు వెంకటాపూర్ గ్రామంలో వెలుగులోకి వచ్చింది. దుర్గమ్మకు, గ్రామ దేవతలకు బోనాలు సమర్పించేందుకు దళితులు ఆలయానికి వచ్చారు. వారిని ఆలయంలోకి వెళ్లనివ్వ కుండా బీసీ కులస్తులు అడ్డుకున్నారు.

శివారు వెంకటాపూర్ గ్రామంలో దుర్గమ్మ గుడిని నూతనంగా నిర్మించారు. ఈ సందర్భంగా శనివారం గ్రామంలోని దళితులు దుర్గమ్మకు బోనాలు సమర్పించేందుకు రాగా, కొంత మంది బీసీ కులస్తులు అడ్డుకున్నారు. దుర్గమ్మ బోనాలు తీయొద్దని,గుళ్ళోకి ప్రవేశం లేదని రావొద్దని అన్నారు. దాంతో వారు మర్కుక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, మర్కుక్ ఎస్ఐ దామోదర్ సోమవారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని అన్ని కులస్తుల ప్రజలు సమన్వయంతో ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామ దేవతలకు కులాలతో సంబంధం లేకుండా అందరూ బోనాలు తీయొచ్చని, ఎవరైనా అడ్డుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదని, అంటరానితనం పాటిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని, అందరూ శాంతియుతంగా, అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. గ్రామస్తులకు మంగళవారం మరోసారి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు.. తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు.

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. తక్షణమే పెండింగ్ ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడు సుప్రీం ముందుకు కవిత బెయిల్ పిటిషన్

- ఢిల్లీలోనే కేటీఆర్, హరీశ్‌రావు, ముఖ్య నేతలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై నేడు (మంగళవారం) సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. లిక్కర్ స్కాంలో ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను రౌస్ ఎవెన్యూ కోర్టు(ట్రయల్), ఢిల్లీ హైకోర్టులు తిరస్కరించాయి. దీంతో ఈ కేసుల్లో మధ్యంతర బెయిల్ కోరుతూ ఈ నెల 8న ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో రెండుసార్లు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం కవితకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐలు కౌంటర్ దాఖలు చేసిన తర్వాతే మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం తీసుకుంటా మని పేర్కొన్నాయి. కాగా, గత వారం విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ... ఈడీని కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కవిత తరపు అడ్వొకేట్‌కు రిజాయిండర్ వేసేందుకు అనుమతించింది. తదుపరి విచారణ నేటికి (ఈనెల 27)కి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది.

ఢిల్లీలో కేటీఆర్, హరీశ్‌రావు

కవిత బెయిల్ పిటిషన్ నేడు సుప్రీం ముందుకు రానున్న నేపథ్యంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు ఆదివారం ఉదయమే ఢిల్లీ చేరుకున్నారు. కవిత తరపు వాదనలు వినిపిస్తోన్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి, విక్రమ్ చౌదరిలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కవితకు మధ్యంతర బెయిల్ తీసుకురావడానికి కోర్టు ముందుకు తీసుకురావాల్సిన అంశాలు, దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన కౌంటర్‌పై అనుసరించాల్సిన వాదనలపై చర్చించారు. అలాగే లిక్కర్ కేసులో తాజా అప్‌డేట్స్, సహ నిందితులకు సంబంధించి సుప్రీంకోర్టు తాజా బెయిల్ తీర్పులు(మనీష్ సిసోడియా, అరవింద్ కేజ్రీవాల్, ఇతరులకు) ఇతర అంశాలపై డిస్కస్ చేశారు. అవసరమైతే కవిత గైనిక్, ఇతర సమస్యలతో బాధపడుతోన్న విషయాన్ని కోర్టు ముందుకు వినిపించాలనే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ఆమె ఆరోగ్య సమస్యలు, ఇటీవల తీహార్ జైలు అధికారులు ఏయిమ్స్‌లో చేయించిన వైద్య పరీక్షలను ప్రస్తావించి... అనారోగ్య రీత్యా మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరనున్నట్టు తెలిసింది. ఇప్పటికే భర్త అనిల్ ఢిల్లీలో ఉండగా, ఆ పార్టీ ఎంపీ వద్ది రాజు రవిచంద్ర, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతోనే ఉంటున్నారు. వీరే కాకుండా సోమవారం సాయంత్రం పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు ఢిల్లీకి చేరుకున్నారు.

త్వరలో 35 వేల ఉద్యోగాలు భర్తీ

(మొదటిపేజీ తరువాయి)

నిరుద్యోగ సమస్య పెరుగుతోంది. చదువుకు తగిన శిక్షణ లేకపోవడంతో యువత ఉద్యోగావకాశాలను కోల్పోతున్నది. అందుకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించుకున్నాం. కొంతమంది విజ్ఞుల సూచనతో దాని నిర్వహణకు ఇండస్ట్రీ డ్రివెన్ విధానం తీసుకున్నాం. అందుకే ఆనంద్ మహీంద్రాను చైర్మెన్‌గా నియమించాం. ప్రస్తుత విద్యా సంవత్సరంలో యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2వేల మందికి శిక్షణ ఇస్తున్నాం. వచ్చే ఏడాది నుంచి 20 వేల మందికి శిక్షణ ఇస్తాం" అని సీఎం పేర్కొన్నారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసింది. గతేడాది రెసిడెన్షియల్ స్కూళ్లకు కేవలం రూ.3 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఫలితంగా వసతి గృహాల్లో సరైన మౌలిక వసతులు లేవు. అందుకే అన్ని రకాల మౌలిక వసతులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలను ఒకే గొడుగు కిందికి తీసుకొస్తున్నాం. రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయబోతున్నాం. జాతీయ స్థాయి ప్రమాణాలతో వసతులు కల్పించ బోతున్నాం. ఇందుకోసం ఈ ఏడాది రూ.5 వేల కోట్లను కేటాయిస్తున్నాం" అని సీఎం ఈ సందర్భంగా ప్రకటించారు. 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశం ఒలంపిక్స్‌లో పతకాలు సాధించడంలో పూర్తిగా విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచి అత్యధిక పతకాలే లక్ష్యంగా క్రీడా పాలసీని తీసుకొస్తున్నామన్నారు. అదే క్రమంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం వర్సిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. 15 రోజుల్లో అన్ని వర్సిటీలకు నూతన వైస్ ఛాన్సలర్లను నియమించడంతో పాటు ఇతర ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. "కొంతమంది విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. గతంలో కూడా విద్యార్థులను రెచ్చగొట్టి వాళ్లు లబ్ధి పొందారు. వాళ్ల ఉద్యోగాలు పోతే తప్ప వారికి విద్యార్థులు, నిరుద్యోగులు గుర్తుకు రాలేదు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నిరసనలు, ధర్నాలు అన్నింటికీ పరిష్కారం కావు. కొంతమంది కుట్రలకు పావులుగా మారకుండా విద్యపై దృష్టి పెట్టండి" అని సీఎం వారికి విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలోని మేధో సంపత్తిని పెద్ద ఎత్తున ప్రోత్సహించి దేశానికి ఉపయోగపడేలా చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గత సర్కార్‌లా కాకుండా తమ ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఖమ్మం ఎంపీ రఘు రామ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సింగరేణి సీఎమ్‌డీ బలరాం, సిగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

మొత్తం 135 మంది....


సివిల్స్ మెయిన్స్‌లో అర్హత సాధించిన 135 మంది అభ్యర్థులు లక్ష ఆర్థిక సాయానికి ఎంపికయ్యారు. ఇందులో 113మంది పురుషులుండగా 22మంది మహిళలున్నారు. వీరిలో 21 మంది జనరల్ కేటగిరీకి చెందినవారు కాగా, 62 మంది ఓబీసీ, 19 మంది ఎస్సీ, 33 మంది ఎస్టీ కేటగిరీకి చెందిన వారున్నారు. జిల్లాల వారీగా... ఆదిలాబాద్ 2, ఆసిఫాబాద్ కొమ్రం భీమ్ 1, భద్రాద్రి 5, హైదరాబాద్ 3, జగిత్యాల 4, జనగామ 3, జైశంకర్ -భూపాలపల్లి 1, జోగులాంబ గద్వాల్ 1, కరీంనగర్ 8, ఖమ్మం 9, మహబూబ్‌నగర్ 4, మహబూబాబాద్ 7, మంచిర్యాల్ 7, మెదక్ 1, మేడ్చల్ -మల్కాజ్‌గిరి 11, నాగర్‌కర్నూలు 4, నల్గొండ 10, నారాయణపేట్ 1, నిర్మల్ 2, నిజామాబాద్ 5, పెద్దపల్లి 3, రంగారెడ్డి 14, సంగారెడ్డి 3, సిద్ది పేట 4, సూర్యాపేట 4, వికారాబాద్ 1, వనపర్తి 1, వరంగల్ రూరల్ 4, వరంగల్ అర్బన్ నుంచి 12 మంది ఎంపికయ్యారు.

కింకర్తవ్యం?

- కాషాయ పార్టీలో అయోమయం, గందరగోళం

హిందీ బెల్ట్‌లో మసకబారుతున్న ప్రాభవం

- కులగణనపై పిల్లిమొగ్గలు
- తేనెతుట్టెలా మారిన 'పునర్విభజన'



న్యూఢిల్లీ : గత పది సంవత్సరాల కాలంలో మోడీ ప్రభుత్వం అనేక సర్వే నివేదికలను అటకెక్కించింది. కొన్నింటిని కోల్డ్ స్టోరేజీలో పెట్టింది. అలా వాయిదా పడిన వాటిలో జనగణన ఒకటి. చిట్టచివరిసారిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. సంప్రదాయం ప్రకారం ఆ తర్వాత పది సంవత్సరాలకు అంటే 2021లో జనగణన జరపాల్సి ఉంది. అయితే ఇది వివిధ కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. ఇప్పుడు ఎట్టకేలకు మోడీ ప్రభుత్వం జనగణనకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అదాలా ఉంటే కులం, సంకీర్ణం, రాజ్యాంగం...ఈ మూడు అంశాలు ప్రస్తుతం మోడీ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

నిన్నటి వరకూ...

దశాబ్ద కాలంలో మోడీ ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు పడకుండా సాఫీగానే నడిచింది. కులం, సంకీర్ణం, ఉచ్చులో చిక్కుకుపోలేదు. బీజేపీ పాలనలో హిందీ ప్రాంతంలో కుల ఆధారిత పార్టీల ప్రాభవం మసకబారింది. అదే సమయంలో నరేంద్ర మోడీ ప్రభ వెలిగిపోయింది. వెనుకబడిన, అట్టడుగు కులాలు బీజేపీకి కొమ్ము కాశాయి. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అనేక మంది ఓబీసీ అభ్యర్థులను బరిలో దింపింది. మోడీ సాక్షాత్తూ ఓబీసీ ప్రధాని. ఇంతకుముందు దేశానికి రాష్ట్రపతిగా వ్యవహరించిన రామ్‌నాథ్ కోవింద్ దళిత నేత. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గిరిజన మహిళ. ఈ నేపథ్యంలో కులాల ప్రాబల్యం అధికంగా ఉన్న హిందీ ప్రాంతంలో ఓబీసీలు, అట్టడుగు వర్గాలు బీజేపీకే మద్దతు ఇచ్చారు.

పెదవి విప్పని బీజేపీ

పునర్విభజనకు ముందు చేపట్టాల్సిన జనగణనను ఆలస్యం చేస్తే పార్లమెంటులో ప్రభుత్వం ప్రతిపక్షాల నుండి ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కులగణన జరిగేలా చూస్తామని పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారు. ఇప్పటికే ఆలస్యమైన కులగణన గురించి బీజేపీ మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. ప్రభుత్వానికి ప్రస్తుతం రాజకీయ పరంగా నిలకడ లేదు. అందువల్ల జనగణన పత్రంలోనే కులానికి సంబంధించి ప్రశ్నలు ఉన్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

ఇప్పుడు సీన్ మారింది

అయితే అది నిన్నటి మాట. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర వంటి హిందీ రాష్ట్రాల్లో బీజేపీకి ఎదురు దెబ్బలు తగిలాయి. నిన్న మొన్నటి వరకూ పార్టీకి అండగా ఉన్న ఎస్సీ, బీసీ వర్గాలు ఇప్పుడు క్రమేపీ దూరమవుతున్నాయి. ముస్లిం మైనారిటీలు సరేసరి. బీజేపీ, హిందూత్వ శక్తులకు ప్రధానంగా అగ్రవర్ణాల్లోని సంపన్నుల మద్దతు మాత్రమే లభిస్తోంది. హిందువుల ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టడానికి కాషాయ పార్టీ చేసిన ప్రయత్నాలు ఫలించటం లేదు.

మిత్రపక్షాల ఉనికే ఉండదా?

లేటరల్ ఎంట్రీ నియామకాల వ్యవహారంలో కులాల ప్రస్తావన రావడం బీజేపీ మిత్రపక్షాలను ఆందోళనకు గురిచేస్తోంది. రిజర్వేషన్ల చుట్టూ అల్లుకున్న గూడులో బీహార్‌లోని బీజేపీ మిత్రపక్షాలు రెండూ చిక్కుకుపోయాయి. వచ్చే సంవత్సరంలో జరిగే రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీలు మనుగడ కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన ప్రస్తుతానికి మౌనంగానే ఉంది. అయితే ఆ పార్టీ ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల్లో బాగా నష్టపోయింది.

కులగణనపై వేచి చూస్తూ...

ఇప్పుడు మళ్లీ జనగణన విషయానికి వద్దాం. 1881లో దేశంలో జనాభా లెక్కల సేకరణ ప్రారంభమైంది. అది ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జరిగేది. 1941లో ప్రపంచ యుద్ధం కారణంగా జనగణన జరపలేదు. కోవిడ్ మహమ్మారి రెండోసారి విరుచుకుపడడంతో 2021లో జనాభా లెక్కలను సేకరించ లేదు. కోవిడ్‌కు ముందు, ఆ తరువాత కూడా జనగణనపై ప్రభుత్వంలో ఏ మాత్రం కదలిక కనిపించలేదు. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కలు సేకరించే సంప్రదాయాన్ని కొనసాగించాలని బీజేపీ భావిస్తున్నట్లు కన్పించడం లేదు. తనకు అనుకూలమైన సమయం కోసం ఆ పార్టీ ఎదురు చూస్తోంది. మరోవైపు పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనకు తదుపరి గడువు కూడా సమీపిస్తోంది.

తేనెతుట్టెను కదిలించడమే

రాష్ట్రాల్లో...ముఖ్యంగా తీర ప్రాంతాలు, ఆర్థికంగా-సామాజికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలు, హిందీ రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల ఒకేలా లేదు. ఈ పరిస్థితుల్లో దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరపడమంటే తేనెతుట్టెను కదిల్చినట్లే అవుతుంది. పునర్విభజన జరిపితే జనాభా వృద్ధి రేటు అధికంగా ఉన్న రాష్ట్రాలు ఎక్కువ నియోజకవర్గాలను పొందుతాయి. జనాభా వృద్ధి రేటు తక్కువగా ఉన్న రాష్ట్రాలు నష్టపోతాయి. దీనివల్ల అస్థిరత ఏర్పడవచ్చు. ప్రాంతీయ శతృత్వాలు తలెత్తవచ్చు. ఒత్తిళ్లు పెరగవచ్చు. అందుకే కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు నియోజకవర్గాల పునర్విభజన జోలికి వెళ్లడం లేదు.

రాజ్యాంగాన్ని మార్చలేరు

మోడీ 3.0 ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత జరిగిన మొట్టమొదటి లోక్‌సభ సమావేశాల్లో ప్రధాని రాజ్యాంగానికి నమస్కారం చేశారు. తద్వారా వాస్తవాన్ని ఆయన గుర్తించినట్లు కన్పించింది. లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా స్థానాలు గెలుచుకొని రాజ్యాంగాన్ని మారుస్తామని కొందరు ఎన్డీఏ నేతలు బీరాలు పలికారు. అయోధ్యలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి నోట కూడా అదే మాట వచ్చింది. ఇది రిజర్వేషన్లపై దాడి చేయడమేనని అణగారిన కులాలు, వర్గాలు నిరసించాయి. ప్రతిపక్షం కూడా దీనిపై గట్టిగానే గళం విప్పింది. అయితే రాజ్యాంగాన్ని మార్చడం సాధ్యం కాదని ఎన్నికల ఫలితాలతో తేలిపోయింది. ఆర్థిక వ్యవస్థ, సమాజం, రాజకీయాలు పరిణితి చెందుతున్నప్పుడు రాజ్యాంగానికి సవరణలు చేస్తూనే ఉన్నారు. ఇప్పటికి 106 సార్లు రాజ్యాంగాన్ని సవరించారు. కొన్ని ప్రతిపక్ష పార్టీలను విశ్వాసంలోకి తీసుకున్న తర్వాత ఇవన్నీ దాదాపుగా విస్తృత ఏకాభిప్రాయంతోనే జరిగాయి. ఇప్పుడు మోడీ 3.0 ప్రభుత్వం అలాంటి సంప్రదింపులు జరుపుతుందా? ఏకాభిప్రాయం లేకుండా రాజ్యాంగాన్ని తాకడానికి సైతం భయపడాల్సి ఉంటుంది.

ఏ మార్పులకైనా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏకాభిప్రాయం కోసం ప్రయత్నించక తప్పదు. దానికి ప్రభుత్వం సుముఖంగా లేకపోతే అవమాన పడాల్సిందే.



రాముని ప్రాణ ప్రతిష్ట వేడుకకు

అక్షరాల రూ.113 కోట్లు

శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వెల్లడి

న్యూఢిల్లీ : అయోధ్య గుడిలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి రూ.113 కోట్లు ఖర్చయ్యాయి. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ విషయాన్ని వెల్లడించినట్టు ఒక ఆంగ్ల వార్త సంస్థ నివేదించింది. ఈ ఏడాది జనవరి 22న అట్టహాసంగా జరిగిన ఈ వేడుకకు పలు రంగాలకు చెందిన ప్రముఖులు హాజరైన విషయం విదితమే. గుడి నిర్మాణం కోసం రూ. 1800 కోట్లు ఖర్చు చేసినట్టు ట్రస్ట్ ఇటీవలి సమావేశంలో వెల్లడించింది. ఈ ఏడాది చివరి నాటికి రూ.670 కోట్లు అదనంగా ఖర్చవుతాయని అంచనా. 2023-24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఖాతాలను బోర్డు ట్రస్టీలు చూస్తున్నారు. సెప్టెంబర్‌లో ట్రస్ట్ ఆదాయపు పన్నును దాఖలు చేయనున్నది. కాగా, గత నాలుగేండ్లలో భక్తులు రాముడి గుడికి దాదాపు 20 కిలోల బంగారం, 13 క్వింటాళ్ల వెండిని సమర్పించినట్టు ట్రస్ట్ వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 మధ్య అంచనా వ్యయం రూ.850 కోట్లని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరం కోసం మొత్తం రూ.676 కోట్లు ఖర్చైనట్టు ట్రస్ట్ వివరించింది. అలాగే, ఇదే కాలానికి మొత్తం రూ.363.34 కోట్లు ఆదాయం వచ్చినట్టు తెలిపింది. ఇందులో రూ.204 కోట్లు బ్యాంకు వడ్డీలు, రూ. 58 కోట్లు విరాళాల ద్వారా వచ్చి చేరినట్టు ట్రస్ట్ ప్రకటించింది.

ఉద్యోగాల కోసం ఫేక్ కుల సర్టిఫికెట్లు

- తొమ్మిదేండ్లలో ప్రభుత్వానికి 1084 ఫిర్యాదులు
- 2010-19 మధ్య 92 మందికి ఉద్వాసన
- అత్యధికం రైల్వే శాఖ నుంచే
- ఆర్టీఐ సమాచారం



న్యూఢిల్లీ : ప్రభుత్వ ఉద్యోగాల కోసం అభ్యర్థులు నకిలీ కుల సర్టిఫికెట్లు అందిస్తున్న ఘటనలు ఆందోళనను కలిగిస్తున్నాయి. 2010 నుంచి 2019 వరకు, తొమ్మిదేండ్లలో ఇలాంటి ఘటనలకు సంబంధించి 1084 ఫిర్యాదులు అందినట్టు ఒక అధికారిక పరిశీలనలో తేలినట్టు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఒక ఆంగ్ల వార్త సంస్థ నివేదించింది. ఈ కేసులలో 92 మంది సిబ్బందిని సర్వీసు నుంచి తొలగించినట్టు సిబ్బంది మరియు ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ (డీఓపీటీ) రికార్డులనుబట్టి తెలుస్తున్నది.

ఇక శాఖల వారీగా చూస్తే అత్యధికంగా ఫిర్యాదులు, ఉద్వాసనలు రైల్వే డిపార్ట్‌మెంట్ నుంచి ఉన్నాయి. ఇందులో 349 ఫిర్యాదులు అందగా.. 27 మంది డిస్మిస్ అయ్యారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుంచి 259 ఫిర్యాదులు, 24 డిస్మిస్‌లు నమోదయ్యాయి. షిప్పింగ్ మినిస్ట్రీ నుంచి 202 కంప్లైంట్లు అందగా, నలుగురు సర్వీసుల నుంచి తొలగించబడ్డారు. ఆహార మరియు ప్రజా పంపిణీ విభాగం నుంచి 138 ఫిర్యాదులు, రెండు డిస్మిస్‌లు, హౌజింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మినిస్ట్రీ నుంచి 26 కంప్లైంట్లు రాగా, ఇద్దరు సర్వీసుల నుంచి తొలగించబడ్డారు. కాగా, ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ ఉదంతం బయటపడిన నేపథ్యంలో ఆర్టీఐ కింద ఈ సమాచారం బహిర్గతం కావటం గమనార్హం.



బీజేపీకి ప్రచారం

- సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు తప్పని పరిస్థితి
- ఆన్‌లైన్‌లో ప్రజాదరణ, ఉనికి కోసమే ఇలాగా
- తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ : కేంద్రం, రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అడ్డం పెట్టుకొని బీజేపీ ప్రభుత్వాలు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను తమ అదుపాజ్ఞలో ఉంచుకుంటున్నాయి. తమ మాట వింటే ఒకలా, వినకపోతే ఇంకొకలా వ్యవహరిస్తున్నాయని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. ఇందుకోసం, కొత్త చట్టాలను తీసుకొచ్చి, తమ మాట విననివారిపై ప్రయోగించాలని చూస్తున్నదని వారు అంటున్నారు. అయితే, ఈ భయంతోనే ఆన్‌లైన్‌లో తమ ఉనికిని కాపాడుకోవడానికి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ప్రతిపక్షం కంటే.. బీజేపీని ప్రమోట్ చేస్తున్నారని తాజా అధ్యయనంలో తేలింది. మిచిగాన్ యూనివర్సిటీకి చెందిన శైలీ దేశాయ్, జొయోజీత్ పాల్‌లు వివిధ వనరుల నుంచి అందిన సమాచారాన్ని విశ్లేషించి ఈ అధ్యయనాన్ని జరిపారు.

ఈ అధ్యయనం ప్రకారం.. ప్రతిపక్షాల సర్కిళ్లలో ప్రజాదరణ పొందిన ఇన్‌ఫ్లూయెన్సర్లు కాలక్రమేణా వారు తమ సందేశాలను తగ్గించారు. దీనిని 'స్పైరల్ ఆఫ్ సైలెన్స్'గా అభివర్ణిస్తారు. అంటే, ఒక భయం కారణంగా వారు తమ అభిప్రాయాలను మార్చుకొని ప్రచారం చేస్తుంటారు. మొదట్లో బీజేపీని విమర్శించి, ఆ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన కొందరు సెలెబ్రిటీలు, ప్రముఖులు ఆన్‌లైన్‌లో రాజకీయ అంశాలపై మాట్లాడటాన్ని పెద్ద ఎత్తున తగ్గించారు. దీంతో రాజకీయాల గురించి చర్చించటంపై డిజిటల్ ఇన్‌ఫ్లూయెన్సర్లు ప్రధాన గొంతుకగా మారారు. ఇందులో అధికం బీజేపీకి అనుకూలంగా ప్రచారం చేసే ఇన్‌ఫ్లూయెన్సర్లే కావటం గమనార్హం. వీరికి బీజేపీ నాయకుల నుంచి మద్దతు లభిస్తున్నది.

బీజేపీ అనుకూల ఇన్‌ఫ్లూయెన్సర్ల ఎంగేజ్‌మెంట్ టైమ్ అనేది.. ప్రతిపక్షాలకు మద్దతిస్తూ రాజకీయ నాయకులను విమర్శించేవారి కంటే ఎక్కువగా ఉన్నది. ముఖ్యంగా, రాహుల్ గాంధీని విమర్శిస్తూ వస్తున్న కంటెంట్ కంటే.. ప్రధాని మోడీని పొగుడుతూ వచ్చేవి వైరల్‌గా మారుతున్నాయి. అయితే, ఇందుకు చక్కగా నిర్మితమై ఉన్న బీజేపీ ఐటీ వ్యవస్థనే కారణం. పార్టీకి మద్దతిచ్చే ఇన్‌ఫ్లూయెన్సర్లకు ప్రత్యక్షంగా ప్రయోజనాన్ని కల్పిస్తున్నది. ప్రతిపక్షాలను సమర్థిస్తున్న ఆన్‌లైన్ ప్రభావశీలుర కంటే.. బీజేపీని సమర్థించేవారి ట్వీటింగ్ యాక్టివిటీ ఎక్కువగా ఉన్నది. అయితే, ప్రతిపక్షాలు ఈ విషయంలో వెనకబడిపోయి ఉన్నాయి.

ప్రస్తుతం సోషల్ మీడియాలో బీజేపీ ఆధిపత్యమే కనిపిస్తున్నది. 'ఎక్స్'లో ఆయనకు 10.1 కోట్ల మంది, ఇన్‌స్టాగ్రామ్‌లో 9.13 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. బీజేపీ అధికారిక ఎక్స్ హ్యాండిల్‌కు 2.2 కోట్ల మంది ఫాలోవర్లు ఉండగా.. కాంగ్రెస్‌కు 1.09 కోట్ల మంది ఉన్నారు. బీజేపీ యూట్యూబ్ ఛానెల్‌కు 61.10 లక్షల మంది, కాంగ్రెస్‌కు 55.6 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.



రంగారెడ్డి జిల్లా పోల్కంపల్లిలో ప్రజానాట్యమండలి "శౌర్యయాత్ర" శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తూ కళాకారులకు "ధీర" పుస్తకాన్ని బహుకరిస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య... చిత్రంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్, పీఎన్‌ఎం రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ తదితరులు

చరిత్రను ఎలుగెత్తి చాటాలి

ప్రజానాట్యమండలి శౌర్య యాత్ర శిక్షణా తరగతుల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

ప్రజానాట్యమండలి శౌర్య యాత్ర చారిత్రక వాస్తవాలను ప్రజలకు వివరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లిలో సోమవారం ప్రజా నాట్యమండలి (పీఎన్‌ఎం) శౌర్య యాత్ర కళారూపాల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రస్తుత పరిస్థితుల్లో పీఎన్‌ఎం పాత్రను వివరించారు. ఏ ఏ అంశాలపై కళారూపాలు ఉండాలో, వాటి ప్రాధాన్యతను వివరించారు. ఏ అంశం వివరించినా ప్రజలకు అర్థమయ్యే విధంగా.. కండ్లకు కట్టినట్టు చెప్పాలన్నారు. పలు సాంస్కృతిక అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. పీఎన్‌ఎం నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం గురించి ప్రత్యేక కళారూపాలు రూపొందించనున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని శౌర్య యాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, పీఎన్‌ఎం రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

దంచికొడుతున్న భారీ వర్షాలు

గుజరాత్ నుంచి త్రిపుర వరకూ బెంగాల్ నుంచి మహారాష్ట్ర వరకూ

న్యూఢిల్లీ : రుతుపవనాల సీజన్‌తో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల్లో విస్తరించిన తీవ్ర అల్పపీడనం కారణంగా దేశంలో అనేక రాష్ట్రాల్లో భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. గుజరాత్ నుంచి త్రిపుర వరకూ, బెంగాల్ నుంచి మహారాష్ట్ర వరకూ భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ నెల 19 నుంచి కురుస్తున్నా ఈ భారీ వర్షాలు ఈ నెల 30 వరకూ కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. రుతుపవనాల ప్రభావం నుంచి ఢిల్లీ కూడా బయటపడలేదు. ఢిల్లీలో ప్రధాన రహదారులన్నీ జలమయ్యాయి. అలాగే ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను వాయుగుండం వలన బెంగాల్‌లో అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. త్రిపురలో భారీ వర్షాలకు ఈ నెల 19 నుంచి 26 మంది మరణించారు. కనీసం 1.17 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. త్రిపురలో పూర్తి స్థాయి సంక్షోభ పరిస్థితి నెలకుంది. భారీ వర్షాల కారణంగా మౌలిక సదుపాయాలు, ఆస్తులు, పంటలకు రాష్ట్రంలో దాదాపు 15 వేల కోట్ల రూపాయిల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్రలో భారీ వర్షాలకు గోదావరి నది పొంగిపొర్లుతోంది.



నర్మదా నదికి రూ. 3.9 క్యూసెక్కుల నీరు విడుదల

గుజరాత్‌లో భారీ వర్షాల కారణంగా సర్దార్ సరోవర్ డ్యామ్ నుంచి నర్మదా నదిలోకి దాదాపు 4 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ కారణంగా భరూచ్ నగరంలోని లోతట్టు ప్రాంతాల నుంచి 280 మందిని సురక్షిత ప్రాంతాలకు తరించినట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం కారణంగా సర్దార్ సరోవర్ నీటి నిల్వ సోమవారానికి 135.20 మీటర్లకు చేరుకుంది. డ్యామ్ పూర్తి సామర్థ్యానం (138.68 మీటర్లు) కంటే కేవలం 3.48 మీటర్లు తక్కువ. డ్యామ్‌కు రోజుకు 3.68 క్యూసెక్కుల నీరు చేరుతుందని అధికారులు తెలిపారు. మొత్తం 30 గేట్లలో సోమవారానికి 23 గేట్లను అధికారులు ఎత్తివేశారు. నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు నదీ ఒడ్డుకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

ఒప్పందమే కీలకం?

- విభేదాల పరిష్కారానికి వర్కింగ్ టీమ్‌ల కసరత్తు
- కాల్పుల విరమణపై కొనసాగనున్న చర్చలు
- ఉద్రిక్తతలను పెంచాలనుకోవడం లేదన్న ఇరాన్

జెరూసలేం : గత 10 మాసాలుగా గాజాపై ఇజ్రాయిల్ అత్యంత పాశవికంగా సాగిస్తున్న దాడులను తాత్కాలికంగానైనా నిలుపుచేసేందుకు ఒప్పందం కుదుర్చుకునేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఎలాంటి తుది ఒప్పందం కుదరకుండానే బందీల విడుదలకు, కాల్పుల విరమణకు ఉద్దేశించిన ఈ చర్చలు ఆదివారం ముగిశాయి. ఇంకా మిగిలివున్న విభేదాలను పరిష్కరించుకోవడానికి రాబోయే రోజుల్లో కింది స్థాయిలో చర్చలు కొనసాగనున్నాయని పేరు చెప్పడానికి వెల్లడించని సంబంధిత అధికారి ఒకరు వెల్లడించారు. కింది స్థాయి వర్కింగ్ టీమ్‌లు కైరోలోనే వుండి మధ్యవర్తులతో భేటీ అయి ఇంకా మిగిలివున్న విభేదాలను పరిష్కరించుకోవడానికి కృషి చేస్తాయని చెప్పారు. మొత్తానికి గాజాపై ఒప్పందమే కీలకంగా మారింది. అయితే కైరోలో గురువారం నుండి ఆదివారం వరకు సాగిన చర్చలు నిర్మాణాత్మకంగా సాగాయని ఆ అధికారి తెలిపారు. ఆచరణయోగ్యమైన ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు అన్ని పక్షాలు కృషి చేస్తున్నాయన్నారు.

ఓపెన్ జైళ్లపై పూర్తి సమాచారం ఇవ్వండి

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ఓపెన్ జైళ్ల పనితీరుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని నాలుగు వారాల్లోగా అందించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. సెమీ-ఓపెన్ లేదా ఓపెన్ జైళ్లు అనేవి ఖైదీలు జీవనోపాధిని సంపాదించడానికి పగటిపూట ప్రాంగణం వెలుపల పని చేసి సాయంత్రం తిరిగి రావడానికి ఖైదీలను అనుమతిస్తాయి. ఖైదీలను సమాజంతో కలిసి పోడానికి, బయట సాధారణ జీవితాలను గడపడానికి, ఖైదీలు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని తగ్గించడానికి ఈ ఓపెన్, సెమీ-ఓపెన్ జైళ్లను ప్రవేశపెట్టారు.

జైళ్లలో రద్దీకి సంబంధిం చిన సమస్యల విచారణలో భాగంగా సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జులై 15న విచారణలో కూడా ఇలాంటి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. అయితే గుజరాత్, హర్యానా, జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర, మణిపూర్, నాగాలాండ్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, దాద్రా అండ్ నగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూ, లక్షద్వీప్, పుదుచ్చేరి, లడఖ్ వంటి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇంకా తమ స్పందన తెలియ జేయలేదని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. కాగా, మే 9న విచారణ సందర్భంగా ఖైదీల పునరావాస సమస్యను కూడా పరిష్కరిం చేందుకు ఓపెన్ జైళ్లను ఏర్పాటు చేయడం ఒక పరిష్కారమని సుప్రీం కోర్టు పేర్కొంది.

షేక్ హసీనాపై మరో 4 కేసులు

ధాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు క్యాబినెట్ మాజీ మంత్రులు, సహాయకులపై మరో నాలుగు హత్య కేసులు నమోదయ్యాయని ఆదివారం మీడియా తెలిపింది. రిజర్వేషన్‌పై చెలరేగిన ఆందోళనలు నిరసనలకు దారితీయడంతో షేక్ హసీనా బంగ్లాదేశ్ ప్రధాని పదవికి రాజీనామా చేసి, దేశాన్ని విడిచి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే.

2010లో అప్పటి బంగ్లాదేశ్ రైఫిల్స్ (బిడిఆర్) అధికారి అబ్దుల్ రహీమ్ మృతిపై హసీనా, బంగ్లాదేశ్ బోర్డర్ గార్డ్ మాజీ డైరెక్టర్ జనరల్ జనరల్ అజీజ్ అహ్మద్‌తో పాటు మరో 11 మందిపై ఆదివారం హత్య కేసు నమోదైంది. 2010లో పిల్ఖానాలో జరిగిన మారణహోమంపై నమోదైన కేసులో మాజీ బిడిఆర్ డిప్యూటీ అసిస్టెంట్ డైరెక్టర్ రహీమ్ నిందితుడిగా ఉన్నాడు. అదే ఏడాది జులై 29న జైలు కస్టడీలో మరణించాడు. రహీమ్ కుమారుడు అడ్వకేట్ అబ్దుల్ అజీజ్ ధాకా మేజిస్ట్రేట్ ముందు కేసు దాఖలు చేశారు.

సంపాదకీయం

చిత్తశుద్ధి ఎంత?



"మహిళల భద్రత ఎంతో ముఖ్యమైనది. మహిళలపై నేరాలు క్షమించరానివని ప్రతి రాష్ట్రానికి చెబుతున్నా. నేరస్థులు ఎవ్వరైనా సరే.. వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు. మహిళలపై నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా శిక్షించేందుకు చట్టాలను మరింత పటిష్ఠ పరుస్తున్నాం" ఇవి సాక్షాత్తు మన ప్రధానమంత్రి మోడీ చెప్పిన మాటలు. మహారాష్ట్రలోని లఖ్‌పతి దీదీ కార్యక్ర మంలో ప్రధానమంత్రిపై వ్యాఖ్యలు చేస్తున్న తరుణంలోనే గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో ప్రపంచంలో మహిళలకు అత్యంత ప్రమాదకరమైన దేశాలు ఇవిగో అంటూ ఒక జాబితా చెక్కర్లు కొట్టింది. ఆ జాబితాలో భారత్ రెండో స్థానంలో ఉంటడం ఆందోళన కలిగిస్తోంది. కోల్‌కతా దారుణ లైంగికదాడి ఘటనో లేదంటే.. ఇటీవల కాలంలో మహిళలపై పెరిగిపోతున్న అఘాయిత్యాల వల్లనో స్పష్టమైన కారణం తెలీదు కానీ, ప్రధాని మాట్లాడుతున్న తరుణంలోనే ఇది జరగడం విశేషం.

> లైంగికదాడి కేసులో శిక్ష అనుభవిస్తున్న డేరా బాబాకు హర్యానాలో ఎన్నికల వేళ పదేపదే పెరోల్ ఇస్తూ పోతుంటాం. గత నాలుగేండ్లలో ఆయన 234రోజులు జైలు బయటే ఉన్నారు. మైనర్ బాలిక లైంగికదాడి కేసులో జీవిత ఖైదులో ఉన్న మరో బాబా ఆశా రామ్ బాపూను ఆయుర్వేద చికిత్సకై తాజాగా బయటకు వదులుతాం. అన్ని వ్యవస్థలనూ నీరుగార్చి, అధికారం సహా అనేక బలహీనతలతో పాలకులు చేసే ఈ పాపాలన్నీ బాధి తులకు శాపాలు కాక మరేమవుతాయి?


అయితే ప్రధాని వ్యాఖ్యలు ఆహ్వా నించదగినవే గానీ, ఆచరణలో వారి ప్రభుత్వ తీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతుండటం గమ నార్హం. ఉన్నావో లైంగికదాడి నిందితుల విషయంలో గానీ, బిల్కిస్ బానో ఘటనకు సంబంధించిన నిందితులకు గానీ జైలు నుంచి ఘనస్వాగతం పలికి బయటకు తీసుకు వచ్చిందెవరు? అలాంటి వారిపై తీసుకున్న చర్యలేమిటి? ఇప్పటికీ రావణకాష్టంలా మండుతున్న మణిపూర్ దురాగతంలో వెలుగు చూసిన దారుణాలెన్ని? వాటిలో ఎన్నింటిపై మీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది? మీపార్టీ ఎంపీ మాపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు మహాప్రభో కాపాడండన్న మహిళా మల్లయోధులకు వీరు చేసిన న్యాయమేమిటి? ఇలాంటి ప్రశ్నలు ప్రధాని మాటల్లోని చిత్తశుద్ధిని ఎత్తి చూపుతున్నాయి. సంఘటన ఏదైనా నిందితులను కాపాడటానికి పాలకులే ప్రయత్నించడం అత్యంత హేయం. పైగా డ్రెస్సింగ్ విధానమే ఈ దాడులకు కారణమనే ప్రవచనాలు వింటున్నాం. చూస్తున్నాం. ఇటువంటి నేపథ్యంలో మహిళల భద్రత గురించి ప్రధాని మాటలు కేవలం కంటితుడుపు చర్య అనే అభిప్రాయాలు సర్వసాధారణం.

సమాజంలో తలెత్తుతున్న కొన్ని సహించలేని ఘటనలు ఆవేదన కలిగిస్తాయి. చట్టాలెన్నున్నా ఆగకుండా సాగుతున్న అకృత్యాలపై ఏమీ చేయలేమా అన్న ఆక్రోశం రగిలిస్తాయి. ప్రకటనలు, ప్రచారార్భా టాలు తప్ప అఘాయిత్యాలపై పాలకులు ఏనాడూ నోరు మెదపడం లేదు. లేకపోతే నెలల చిన్నారులపై సైతం మృగాళ్ల అఘాయిత్యాలు ఎందుకు జరుగుతు న్నాయి? 'ఈ దుశ్శాసన పర్వానికి ముగింపు ఎప్పుడు? పైగా అన్యాయం జరిగిందని గొంతెత్తి అరుస్తున్నా స్పందించని నేలపైన న్యాయం ఊసెత్తటమే అన్యాయమై పోతున్నది. దుష్ట సంస్కృతీ వారసత్వం నేటికీ సమాజాన కొనసాగుతూనే ఉన్నది. నాడు 'భారతా'న ఒక్క దుశ్శాసనుడే ఉన్నాడు. నేడు వీధికొక్కడు కనపడుతున్నాడు. ఆధిపత్య పర్వంలో విహరిస్తున్నారు. 'బేటీ పడావ్ బేటీ బచావ్' నినాదం నేడు దేశపు నడి వీధిలో అణచివేయబడి హాహాకారాలు చేస్తున్నది. స్త్రీలను శక్తులుగా కొలిచే దేశం మనదని గొప్పలు చెప్పుకునే సాంస్కృతిక ప్రచార పటాటోపంలో 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అని నొక్కి వక్కాణిస్తున్న తీరుకు కించిత్ విచారమూ ప్రకటించము. పాలకులే ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాల పేరుతో స్త్రీని సొంతఆస్తిగా, బానిసగా చూస్తోంటే... ఈ దుష్టత్వానికి అంతమెప్పుడు!

లైంగికదాడి కేసులో శిక్ష అనుభవిస్తున్న డేరా బాబాకు హర్యానాలో ఎన్నికల వేళ పదేపదే పెరోల్ ఇస్తూ పోతుంటాం. గత నాలు గేండ్లలో ఆయన 234రోజులు జైలు బయటే ఉన్నారు. మైనర్ బాలిక లైంగికదాడి కేసులో జీవిత ఖైదులో ఉన్న మరో బాబా ఆశా రామ్ బాపూను ఆయుర్వేద చికిత్సకై తాజాగా బయటకు వదులుతాం. అన్ని వ్యవస్థలనూ నీరుగార్చి, అధికారం సహా అనేక బలహీనతలతో పాలకులు చేసే ఈ పాపాలన్నీ బాధి తులకు శాపాలు కాక మరేమవుతాయి? ఇంత జరుగుతున్నా స్పందించని మన ప్రధాని 'మహిళలపై దాడులకు పాల్పడిన వారిని వదిలిపెట్టం' అని ఢంకా బజాయించి మరీ చెబు తున్నారు. మాట్లాడే మాటలకు, చేతలకూ ఉన్న వ్యత్యాసం అనేకసార్లు తేటతెల్లం అవుతూనే ఉంది. నీతులు, ధర్మాలు వల్లించేవారి నిజస్వరూపమేమిటో బయటపెడుతూనే ఉంది.

2012 నాటి 'నిర్భయ' ఘటన తర్వాత కఠినచట్టాలు చేసినా పరిస్థితులు మారలేదంటే లోపం ఎక్కడున్నట్టు? వావి వరుసలు లేవు, వయసులో చిన్నాపెద్దా విచక్షణ లేదు. చట్టం పట్ల భయభక్తులు అసలే లేవు. ఇలా ఉచ్చం నీచం మరిచి, చివ రకు చిన్నారులపైనా మనుషులు మృగాలుగా మారడానికి దారి తీస్తున్న సాంఘిక, మానసిక పరిస్థితుల్ని లోతుగా అధ్య యనం చేయా ల్సిన అవసరం ఉంది. మన వెనకాలే ఊడలు దిగుతున్న ఈ వికృత ధోర ణిని పెంచి పోషిస్తున్న మన వినోద, వినిమయ సంస్కృతులు, వైయక్తిక ప్రవర్తనల్ని సమీక్షించుకోవాల్సి ఉంది. ఈ భూతాన్ని ఆపేదెలా అని సత్వరమే ఆలోచించాల్సి ఉంది.

స్వల్పకాలిక 'అద్భుతాలు'



ప్రభాత్ పట్నాయక్

> ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం వలన నయా ఉదారవాద విధానాలను అమలు చేసే మూడో ప్రపంచ దేశాలో ఎక్కువ భాగం ఆర్థిక మాంద్యంలోకి నెట్టబడుతున్నాయి. నిరుద్యోగం తీవ్ర స్థాయికి చేరడం, విదేశీ రుణాలు పెరిగిపోవడం కనిపిస్తున్నది. ఏవైనా దేశాల్లో సాపేక్షంగా స్వయం నిర్ణయాధికారాన్ని నెరపగలిగే స్థితిలో మధ్యేవాద ప్రభుత్వాలు ఉన్నా, అవి ప్రజా బాహుళ్యంలో తమ పలుకుబడిని కోల్పోతున్నాయి. వాటిని దించి ఆ స్థానాల్లో తనకు అనుకూలంగా ఉండే మితవాద ప్రభుత్వాలను తీసుకురాగల శక్తి సామ్రాజ్యవాదానికి పెరిగింది. ఇలా ఏర్పడే కొత్త ప్రభుత్వాలు అంతకు ముందున్న ప్రభుత్వాలకన్నా నియంతృత్వంగా నడిచేవే. ఇవి నయా ఉదారవాద మార్గాన నడవడంతోబాటు, ప్రజల ఆలోచనలను మతతత్వం వైపో, మరో విధంగా ప్రజల్లోనే ఒక మైనారిటీ తరగతిని మెజారిటీ ప్రజలకు శత్రువులుగా చిత్రీకరించే విద్వేష రాజకీయాల వైపో మళ్లిస్తాయి.

బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ అస్తవ్యస్త పరిస్థితులమీద చాలా విశ్లేషణలు వచ్చాయి. వాటిలో ఎక్కువ భాగం షేక్ హసీనా ప్రభుత్వం అవలంబించిన పెత్తందారీ, నియంతృత్వ విధానాల మీద దృష్టిని ప్రధానంగా కేంద్రీకరించాయి. ఆ దేశ ఆర్థిక పరిస్థితిలో వచ్చిన మార్పుల గురించి చాలా తక్కువగా చెప్పాయి. కొన్ని విశ్లేషణలలో ఆర్థికస్థితి గురించిన చర్చే మొత్తంగా లేకుండా పోయింది. కేవలం కొద్ది నెలల క్రితమే ఒక ఆర్థిక 'అద్భుతం'గా ప్రశం సలు పొందిన బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ ఉన్నట్టుండి పతనమైంది. అక్కడి ప్రజల్లో అధిక సంఖ్యాకుల జీవన పరిస్థితులు హఠాత్తుగా దిగజారిపోయాయి. షేక్ హసీనా ప్రభుత్వం ప్రజల్లో తనకున్న పలుకుబడిని చాలా వేగంగా కోల్పో వడం వెనుక ప్రధాన కారణం ఈ దిగజారిన ప్రజల స్థితిగతులే. ఆ పరిస్థితులు ఆ విధంగా తయారవడానికి ప్రభుత్వమే ప్రధాన కారణంగా భావించిన ప్రజలు తమలో పెల్లుబుకుతున్న ఆగ్రహాన్ని వీధుల్లో నిరసనల రూపంలో వ్యక్తం చేశారు.


2021 వరకూ బంగ్లాదేశ్ ఆర్థిక వృద్ధిలో విజయం సాధించిన దేశంగా పరిగణించబడేది. నయా ఉదార వాద ఆర్థిక విధానాల చట్రం పరిధిలో ఎగుమతులను బాగా పెంచ డం ద్వారా ఈ వృద్ధి సాధించారు. ఆ దేశ ఎగు మతుల్లో దాదాపు 80శాతం దుస్తుల ఎగుమతులే. ఆ ఎగుమతుల వృద్ధి వేగం ఎంత ఎక్కువగా ఉండేదంటే, అతి స్వల్ప కాలంలోనే ప్రపంచం మొత్తం మీద దుస్తుల మార్కెట్‌లో 10 శాతం డిమాండ్‌ను బంగ్లాదేశ్ ఎగుమతులే అందు కుంటాయని భావించేవారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థలు కోట్లాది మందికి పేదరికం నుంచి విముక్తి కలిగించిన దేశంగా బంగ్లాదేశ్ ను ప్రశంసిస్తూ వుండేవి. 2024 ఏప్రిల్ 2న విడుదల చేసిన నివేదికలో సైతం బం గ్లాదేశ్ జిడిపి వృద్ధి రేటు 5.6 దాకా ఉంటుందని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది.ఏ విధంగా చూపినా, ఆ వృద్ధిరేటు చెప్పుకోదగ్గదే.

ఒకసారి కరోనా మహమ్మారి ప్రభావం చూపడం ప్రారంభించాక బంగ్లాదేశ్ ఎగుమతులు దెబ్బ తిన్నాయి. ఐతే ఇది తాత్కాలికమేనంటూ ప్రపంచబ్యాంక్ భావించింది. అందుకే 2024 నివేదికలో వృద్ధిరేటు మీద తన అంచనాలను ప్రకటిం చింది. కాని ఆర్థిక పతనం కొనసాగుతూ వచ్చింది. ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదు. ప్రపంచ ఆర్థి వ్యవస్థలో మాంద్యం నెలకొని కొనసాగుతున్నప్పుడు ఒకానొక దేశంలో పతనమైన ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం అంత తేలికేమీ కాదు. బంగ్లాదేశ్‌కి విదేశీ మారకద్రవ్యం గణనీయంగా అందే మరొక మార్గం ప్రవాస బంగ్లాదేశీయులు. వారి నుంచి వచ్చే చెల్లింపులు కూడా ఆర్థిక మాంద్యం ప్రభావం వలన దెబ్బతిన్నాయి. బంగ్లాదేశ్ తన విద్యుత్ ఉత్పత్తికి ప్రధానంగా చమురు మీద ఆధారపడతుంది. ఆ చమురును దిగుమతి చేసుకుంటుంది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగాయి. దాంతో తీవ్ర స్థాయిలో విదేశీ మారక ద్రవ్యానికి కొరత ఏర్పడింది. ఫలితంగా విద్యుత్ కోతలు పెరిగాయి. పైగా విద్యుత్ ధరలు పెరిగాయి. దాని పర్యవసానంగా విద్యుత్ మీద ఆధారపడి ఉత్పత్తి అయ్యే సరుకుల ధరలూ పెరిగాయి. ఇదంతా కలిసి దేశ ఆర్థి వ్యవస్థలో తీవ్ర సంక్షోభానికి కారణమైంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం 9.52 శాతానికి ఎగబాకింది. ఇది గత దశాబ్దంలోకెల్లా అత్యధికం. కొందరైతే ఈ అంచనాలు తక్కువ చేసి చూపారని కూడా అంటున్నారు.

ఈ ద్రవ్యోల్బణానికి దోహదం చేసినవి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది: బంగ్లాదేశ్ కరెన్సీని డాలర్‌తో పోల్చి మారకపు రేటు తగ్గించడం. అమెరికన్ ప్రభుత్వం తన దేశంలో ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి వడ్డీ రేట్లు పెంచింది. దాంతో డాలర్లు అమెరికాకు ఎక్కువగా ప్రవహించడం మొదలైంది. దాని ఫలితంగా ఇతర దేశాల్లో డాలర్లకు కొరత ఏర్పడి వాటి డిమాండ్ పెరిగింది. దానివలన డాలర్ మారకపు రేటు పెరిగింది. దీనికి బంగ్లాదేశ్‌కు ఏర్పడిన విదేశీ మారకపు ద్రవ్య కొరత తోడైంది. ఇక రెండో కారణం: నయా ఉదారవాద చట్రంలో ఆర్థిక వ్యవస్థ నడుస్తున్నందున ప్రభుత్వం ధరల పెరుగుదలతో బాధపడే ప్రజలకు ఏ విధంగానూ ఊరట కలిగించే చర్యలు చేపట్టడానికి కుదరదు. అలా ఊరట కలిగించాలంటే ప్రభుత్వం ప్రజలకిచ్చే సబ్సిడీలను పెంచాలి. అలా పెంచేందుకు ప్రపంచబ్యాంక్ షరతులు అనుమతించవు.

ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగం మందగించడంతో దేశంలో నిరుద్యోగం తీవ్ర సమస్యగా మారింది. మరోపక్క ద్రవ్యోల్బణం వలన ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచుదామంటే అప్పుడు ఎగుమతి చేసే సరుకుల ధరలను పెంచాల్సి వుంటుంది. అలా పెంచితే అంతర్జాతీయ మార్కెట్ లో పోటీలో నిలదొక్కుకోవడం సాధ్యం కాదు. ఒక వేళ నిలదొక్కుకోవడం కోసం బంగ్లాదేశ్ కరెన్సీ మారకపు రేటును తగ్గించా లనుకుంటే దాని వలన దిగుమతి చేసుకునే చమురు ధరలు పెరిగిపోతాయి. దాని వలన మళ్ళీ ధరలు పెరిగిపోతాయి. ఈ చిక్కుల మధ్య బంగ్లాదేశ్ ఐఎంఎఫ్ ను, ఇతర అంతర్జాతీయ రుణదాతలను అప్పుల కోసం అభ్యర్థించింది. అలా పొందిన అప్పులతో విదేశీ చెల్లింపుల లోటు సమస్య మరింత పెరిగింది. తెచ్చిన అప్పులకు వడ్డీలు, వాయిదాలు చెల్లించవలసి వుంటుంది. వాటి మొత్తం పెరిగి పోయింది. అది విదేశీ చెల్లింపులలో లోటుకు దారి తీసింది. పైగా ఐఎంఎఫ్ షరతుగా విధించిన కొత్త పొదుపు చర్యలతో నిరుద్యోగం మరింత పెరిగింది.

షేక్ హసీనా ప్రభుత్వం దెబ్బతినడం వెనుక ఈ ఆర్థిక సంక్షోభం ప్రభావం ప్రధానంగా పనిచేసింది. ఈ సంగతిని కొందరు గుర్తించారు. కాని దానికి కారణం హసీనా ప్రభుత్వం కొందరు ఆశ్రిత పెట్టుబడిదారులను వెనకేసుకురావడమేనంటూ



విశ్లేషిస్తున్నారు. మరికొందరు ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ విధానం ముఖ్య కారణం అంటున్నారు. బంగ్లాదేశ విముక్తి పోరాటంలో పాల్గొన్న సైనికుల సంతానానికి రిజర్వేషన్లు ఉద్యోగాలలో కల్పించడం పట్ల వ్యతిరేకత తలెత్తింది. అయితే దీన్నే ప్రధాన కారణంగా చూపించడం అంటే అసలు సమస్యను పక్కకు తప్పించడమే. అసలు రిజర్వేషన్లకు వ్యతిరేకత రావడానికి కారణం అక్కడ పెరిగిపోతున్న నిరుద్యోగం.సంక్షో భానికి కారణం బంగ్లాదేశ్ తన ఆర్థిక వ్యూహాన్ని మొత్తంగా ఎగుమతుల పెంపు అనే అంశం చుట్టూ రూపొందించడం. అది కూడా నయా ఉదారవాద చట్రానికి లోబడిన వ్యూహం. సంక్షోభానికి మూలకారణం ఈ ఆర్థిక వ్యూహంలోనే ఉంది.

ఈ వ్యూహం కొద్దికాలం పాటు చాలా నాటకీయంగా విజయవంతమైన ఫలితాలను రాబట్టవచ్చు. కాని ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే మందగిస్తున్నప్పుడు ఎగు మతులు దెబ్బ తినకమానవు. ఇక ఉక్రెయిన్ యుద్ధం వంటి ప్రతికూల పరిణామాలు అంతర్జాతీయ రంగంలో తలెత్తితే దాని పర్య వసానాలు కూడా ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తాయి.ఆర్థిక వ్యూహం విజయవంతంగా నడిచిన కాలంలో వేసిన ముందడుగులు కూడా నిష్ప్ర యోజనమై, ఆర్థిక వ్యవస్థ చాలా వెనక్కి జారి పోతుంది. బంగ్లాదేశ్ అనుభవం నుండి నేర్చుకోవలసినవి రెండు గొప్ప గుణపాఠాలు ఉన్నాయి. మొదటిది: విజయ వం తంగా పురోగమిస్తున్న ఒక మూడవ ప్రపంచదేశ ఆర్థిక వ్యవస్థ ఒక విఫలమైన వ్యవస్థగా పడిపోవడం ఒక హఠాత్ పరిణా మంగా జరగడం. రెండవది: దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక రంగంలో ఎదురయే సమస్యలు అక్కడికే పరిమితం కాకుండా అన్ని రంగాలనూ కష్టాల్లోకి నెట్టడం.

> షేక్ హసీనా ప్రభుత్వం దెబ్బతినడం వెనుక ఈ ఆర్థిక సంక్షోభం ప్రభావం ప్రధానంగా పనిచేసింది. ఈ సంగతిని కొందరు గుర్తించారు. కాని దానికి కారణం హసీనా ప్రభుత్వం కొందరు ఆశ్రిత పెట్టుబడి దారులను వెనకేసుకురావడమేనంటూ విశ్లేషిస్తున్నారు. మరికొందరు ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ విధానం ముఖ్య కారణం అంటున్నారు. బంగ్లాదేశ విముక్తి పోరాటంలో పాల్గొన్న సైనికుల సంతానానికి రిజర్వేషన్లు ఉద్యోగాలలో కల్పించడం పట్ల వ్యతిరేకత తలెత్తింది. అయితే దీన్నే ప్రధాన కారణంగా చూపించడం అంటే అసలు సమస్యను పక్కకు తప్పించడమే. అసలు రిజర్వేషన్లకు వ్యతిరేకత రావడానికి కారణం అక్కడ పెరిగిపోతున్న నిరుద్యోగం.సంక్షో భానికి కారణం బంగ్లాదేశ్ తన ఆర్థిక వ్యూహాన్ని మొత్తంగా ఎగుమతుల పెంపు అనే అంశం చుట్టూ రూపొందించడం. అది కూడా నయా ఉదారవాద చట్రానికి లోబడిన వ్యూహం. సంక్షోభానికి మూలకారణం ఈ ఆర్థిక వ్యూహంలోనే ఉంది.

కేవలం ఎగుమతును పెంచుకోవడం మీదనే బంగ్లాదేశ్ కేంద్రీకరించడం వల్లనే ఈ కష్టాలు వచ్చాయని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. పైగా ఆ ఎగుమతుల్లో కూడా కేవలం దుస్తుల ఎగుమతుల మీదే కేంద్రీకరిం చడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందంటున్నారు. దుస్తులతో బాటు ఎగుమతుల్లో వివిధ సరుకులను చేర్చివుంటే ఇలా జరిగేది కాదం టున్నారు. మరికొందరు ఎగమతుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని దేశంలో వివిధ పరిశ్రమల ఏర్పాటుకు మళ్లించి మొత్తంగా ఆర్థిక వ్యవ స్థను బలపరిచి వుండాల్సిందని అంటున్నారు. ఈ విమర్శలు చేసేవారు ఒక విషయాన్ని విస్మరిస్తున్నారు. నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం జోక్యం కల్పించుకోగల సామర్థ్యాన్ని కోల్పోతుంది. దేశీయంగా పరిశ్రమలను ప్రోత్సహించాలంటే అంతర్జాతీయ పోటీ నుండి ఆ పరిశ్రమలకు రక్షణ కల్పించాలి. కాని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అటువంటి రక్షణ చర్యల పట్ల కన్నెర చేస్తుంది. ఆ అంతర్జాతీయ పెట్టుబడి సహకారం లేకపోతే ఎగుమతులు కాస్తా దెబ్బతింటాయి. అంతేకాదు. అంత ర్జాతీయ మార్కెట్‌లో ఏయే సరుకుల ఎగుమతులు నిలదొక్కు కోవాలన్నది అంతర్జా తీయ పెట్టుబడి నిర్ణయిస్తుందే తప్ప ఆయా దేశాల ప్రభుత్వాలు కావు. అందుచేత బంగ్లాదేశ్‌లో అను సరించిన ఎగుమతుల- ఆధారిత అభివృద్ధి వ్యూహం దెబ్బతిని పోవడానికి కేవలం అక్కడి ప్రభుత్వమే కారణం అని నిందించడం సరికాదు.

ఇప్పుడు మహమ్మద్ యూనస్ ఉద్దేశాలేమైనా, విద్యార్థుల ఉద్దేశాలేమైనా, అక్కడ జరగబోయే ఎన్నికల్లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ పార్టీని పోటీ చేయడానికి అనుమ తించకపోతే...ప్రస్తుత రాజకీయ సంక్షోభ పరిస్థి తుల నుండి లాభం పొందేది మాత్రం అక్కడి మితవాద పార్టీలే. అక్కడ మిత వాద శక్తులు బలపడితే అది అమెరికాకి ఆనంద దాయకంగా ఉంటుంది. దేశీయ కార్పొరేట్ గద్దలకూ అది ఆనందదాయకమే. ప్రస్తుతం ప్రపంచంలో ఆవిష్కరించ బడుతున్న కొత్త దృశ్యాన్ని బంగ్లాదేశ్ పరిస్థితులు మన ముందు చూపిస్తున్నాయి.

ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం వలన నయా ఉదారవాద విధానాలను అమలు చేసే మూడో ప్రపంచ దేశాలో ఎక్కువ భాగం ఆర్థిక మాంద్యంలోకి నెట్టబడుతున్నాయి. నిరుద్యోగం తీవ్ర స్థాయికి చేరడం, విదేశీ రుణాలు పెరిగి పోవడం కనిపిస్తున్నది. ఏవైనా దేశాల్లో సాపేక్షంగా స్వయం నిర్ణయాధికారాన్ని నెరపగలిగే స్థితిలో మధ్యేవాద ప్రభుత్వాలు ఉన్నా అవి ప్రజా బాహుళ్యంలో తమ పలుకుబడిని కోల్పో తున్నాయి. వాటిని దించి ఆ స్థానాల్లో తనకు అనుకూలంగా ఉండే మితవాద ప్రభుత్వాలను తీసుకురాగల శక్తి సామ్రాజ్య వాదానికి పెరిగింది. ఇలా ఏర్పడే కొత్త ప్రభుత్వాలు అంతకు ముందున్న ప్రభుత్వాలకన్నా నియంతృత్వంగా నడిచేవే. ఇవి నయా ఉదారవాద మార్గాన నడవడంతోబాటు, ప్రజల ఆలోచ నలను మతతత్వం వైపో, మరో విధంగా ప్రజల్లోనే ఒక మైనా రిటీ తరగతిని మెజారిటీ ప్రజలకు శత్రువులుగా చిత్రీకరించే విద్వేష రాజకీయాల వైపో మళ్లిస్తాయి. "బొమ్మ పడితే గెలుపు నాది, బొరుసు పడితే ఓటమి నీది" అన్నట్టుగా సామ్రాజ్యవాదం పరిస్థితి ఇప్పుడు ఉంది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా ప్రజల్లో తలెత్తే అసంతృప్తి ఫలితంగా ఆ ఉదారవాద విధానాల చట్రాన్ని బద్దలు కొట్టుకుని బయటపడడం జరగదు సరికదా, అవే విధానాలను నయా ఫాసిస్టు నియంతృత్వ ప్రభు త్వాల ఆధ్వర్యంలో మరింత పటిష్ఠంగా ప్రజల మీద రుద్దే పరిస్థితి వస్తుంది.నయా ఉదారవాదం అనే పిశాచపు అణచివేతను గుర్తించినా, దానిని వదలగొట్టుకోవడం అంతకంతా కష్టతరమౌతుంది.

ఈ నయా ఉదారవాద విధానాల ఉక్కు చట్రాన్ని బద్దలు కొట్టుకుని అధిగమించాలంటే ప్రజలలో కేవలం ప్రభుత్వాల మీద అసంతృప్తి పెరిగితే చాలదు. ఈ విధానాలకు ప్రత్యామ్నా యంగా ఉండే ఆర్థిక వ్యూహాన్ని ప్రజల ముందుంచి దాని సాధన లక్ష్యంగా వారిని సమీకరించాలి. ఆ వ్యూహంలో ప్రభుత్వ జోక్యా నికి ఎక్కువ అవకాశం ఉండాలి. దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసే దిశగా అది ఉండాలి. దేశంలోని ఖనిజాలు, ఇతర సహజవనరుల మీద జాతికి పూర్తి అదుపు ఉండాలి. బంగ్లాదేశ్ మరీ చిన్న దేశం ఏమీ కాదు. 17 కోట్ల జనాభా ఉన్న దేశం. కేవలం బయట నుంచి ఒత్తిడి చేయడం ద్వారా అటువంటి దేశంలో నయా ఉదారవాద చట్రంలో ఎగుమతి-ఆధారిత వృద్ధి వ్యూహాన్ని అమలు చేయడం అంత తేలికేమీ కాదు. అక్కడ పాలక వర్గాల సహకారంతోటే దానిని అమలు చేశారు. అయితే, దానికి ప్రత్యామ్నాయంగా అమలు చేయాల్సిన, దేశీయ మార్కెట్-ఆధారిత అభివృద్ధి వ్యూహాన్ని అమలు చేయడం కూడా అంత తేలికేమీ కాదు. ఇందుకు ప్రజల మద్దతు చాలా అవసరం. ప్రస్తుతం ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభపు ప్రతికూల పర్యవసానాలను అనుభవిస్తున్న మూడవ ప్రపంచ దేశాల ముందు ఇంతకన్నా వేరే మార్గం లేదు.

(స్వేచ్ఛానుసరణ)

తెలుగు-వెలుగు



తెలుగు అనగానే అమ్మ గుర్తొస్తుంది!
అమ్మప్రేమ, లాలన గుర్తొస్తుంది
మొదటి చందమామ కథ గుర్తొస్తుంది
నాయనమ్మ కథనా పటిమ గుర్తొస్తుంది
చిన్నప్పటి స్నేహితులు
ఆటలు,పాటలు గుర్తొస్తాయి
చదివిన పుస్తకాలు,
ఉపన్యాసాలు గుర్తొస్తాయి
వ్యాసరచనలో బహుమతి గుర్తొస్తుంది
అవే చాటుతాయి తెలుగు గొప్పతనం

మాతృభాషంటే నాలుకపై నటన కాదు!
హృదయాంతరాల లోపలి అంతరంగం
కొరుకుడు పడక, మింగుడుపడక
ఒంటికి పడక ఒంటరైన అమ్మను
లాలించి బుజ్జగించి మన మనస్సుల్లోకి
నడిపించిన తొలిఅడుగు మన'గిడుగు'!

నేటి వ్యవహారిక వ్యవహారం
ఉన్నపళంగా ఊడి పడిందేం కాదు
జాతికి పునర్జన్మనిచ్చిన గొంగళిపురుగు
నుండి సీతాకోకచిలుకలా
గ్రాంథికం నుండి వ్యవహారికం వరకు
చాలా వ్యవహారమే నడిచింది...
గిడుగు పిడుగు గర్జనకు తేట తెనుగు
హర్షించి వర్షించాకే...
నేడీ సప్తవర్ణ శోభిత ఆధునిక సాహితీ
ఇంద్రచాపానికి నాడు బీజం పడింది!!

(ఆగష్టు29న తెలుగుభాషా దినోత్సవం)

- భీమవరపు పురుషోత్తమ్
సెల్:9949800253

స్వాతంత్ర్య ఉత్సవాలు సరే! మరి లక్ష్యాల మాటేమిటి?

ఈ ఆగష్టు 15న డెబ్బయి ఎనిమిదో స్వాతంత్ర్యంలోకి అడుగుపెట్టాం. సమకాలిన ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే సాధించ వలసిన ప్రగతి ఎంతగానో ఉంది. స్వాతంత్రోద్యమ లక్ష్యాలైన వ్యవసాయరంగంలో స్వయం సమృద్ధి సాధించడం, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం, శాస్త్ర సాం కేతిక రంగాలు, అందరికీ విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పనలో సాధించిన ప్రగతి ఏమిటి? లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడు కోవడంలో ఎదురవుతున్న సవాళ్లు మనకు నేర్పుతున్న పాఠమేంటి? ఆర్థిక, సామాజిక అసమానతలు చెబుతున్న వాస్తవలేంటి? ఈ కోణంలో ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. ప్రస్తుతం దేశానికి కాషాయికరణ ప్రమాదం పొంచివుంది. ఆరెస్సెస్-బీజేపీ విభజించు, పాలించు విధానంతో దేశం ఆందోళనకరంగా తయా రైంది. బ్రిటీష్ కబంధ హస్తాల నుండి దేశాన్ని విముక్తి చేసుకున్న ప్రజలు, ఇప్పుడు మతోన్మాదంపై పోరాడాల్సిన అనివార్యత ఏర్పడింది. జాతీయ లక్ష్యాల సాధన కృషి అందులో భాగమే.

స్వాతంత్రోద్యమంతో పాటే పెంపొందిన పైన పేర్కొనబడిన ఆకాంక్షలు సాధించడానికి, మొదటి దశాబ్ది కాలంలో భారత్, సోషలిస్టు రష్యా సహకారంతో బలమైన పునాదులు ఏర్పడ్డాయి. వ్యవ సాయానికి వెన్నెముకగా నిలిచే భారీ నీటిపారుదల ప్రాజెక్టులు బాక్ర-నంగల్ మొదలుకొని నాగార్జునసాగర్ వరకు అనేక సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగాయి. వేల ఎకరాల బీడు భూములు సాగులోకి వచ్చాయి. ఐకార్‌ను బలోపేతం చేయడంతో పాటు, రాష్ట్రస్థాయిలో అగ్రికల్చర్ యూనివర్సిటీల ఏర్పాటు, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌లను ఏర్పాటు చేయడం,తద్వారా హరిత విప్లవం, ఆహార ఉత్పత్తుల స్వయం సమృద్ధికి దోహదం చేశాయి.

భిలాయి, బొకారో ఉక్కు కర్మాగారాలు సోవియట్ రష్యా సహ కారంతో నిర్మాణం జరిగింది. ఆ తర్వాతనే దుర్గాపూర్, రూర్కెలా ఉక్కు కర్మాగారాలకు బ్రిటిష్, జర్మనీలు సహకారం అందించాయి. స్టీల్ ఉత్పత్తితో పాటు సిమెంట్, విద్యుత్, రైల్వేల నిర్మాణం దేశ పారిశ్రామిక అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయి. ప్రజల్లో చిన్న మొ త్తాల పొదుపును (పోస్ట్ ఆఫీస్, ఎల్ఐసి, బ్యాంకింగ్) ప్రోత్స హించడం ద్వారా భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి కావలసిన పెట్టు బడులు ప్రజల నుండి పోగుచేయబడ్డాయి. 1991 నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాల అమలు ముందు వరకు వాటి ప్రయోజ



నాలను ప్రజలు పొందారు. నీటి పారుదల ప్రాజెక్టుల వలన కొత్తగా వేల ఎకరాల భూములు సాగులోకి వచ్చాయి. గ్రామీణ ప్రాంతంలో కొనుగోలు శక్తి పెరిగింది. భూస్వాములతో పెట్టుబడిదారి వర్గం రాజీ పడకుండా భూ పంపిణీ చేసి ఉంటే... ప్రయోజనం మరింత విప్ల వాత్మకంగా ఉండేది. కానీ భారత పెట్టుబడుదారి వర్గ పాలకులు ఆ పని చేయలేదు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు వేలాది మందికి ఉపాధిని కల్పించాయి. గౌరవప్రదంగా జీవించేందుకు అవసర మైన వేతనాలు, సౌకర్యాలు, వివిధ సామాజిక తరగతులకు రిజర్వేషన్లు కల్పించ బడ్డాయి.వాటి ఉత్పత్తులు, సేవలు ప్రజలకు చౌకధరలకే అందించబడ్డాయి.

> స్వాతంత్ర్య ఉద్యమం నుండి ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకు నాడు బ్రిటిష్ పాలకులు విభజించు, పాలించు లక్ష్యంతో హిందూ, ముస్లిం మత ఘర్షణలు సృష్టించారు. బెంగాల్ ను మత ప్రాతిపదికన తూర్పు, పశ్చిమ బెంగాల్‌గా విడదీయడానికి యత్నించారు. అనేక సందర్భాలలో మత వైషమ్యాలు రగిలించారు. నేటి బీజేపీ పాలకులు బ్యాంకులు, రైల్వేలు, ఎల్ఐసి, సింగరేణి, బొగ్గుగనులు, విద్యుత్తు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, జాతీయ రహదారులు, స్పెక్ట్రం, విద్య, వైద్యం అన్నింటినీ లూటీచేసే విధంగా బడా పెట్టుబడిదారులకు ప్రయోజనం చేసే విధానాలు అవలంభిస్తున్నారు.

'మేడిన్ ఇండియా'ను..మేకిన్ ఇండియా'గా మార్చారు!

నాడు 'మేడ్ ఇన్ ఇండియా'ను సాధించేందుకు ఆధునిక విద్యాలయాలు, యూనివర్సిటీలు, ఐఐటీలు స్థాపనకు పునాది పడ్డాయి. రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కు ప్రాధాన్యత సంతరించు కుంది. గుడులకంటే బడులకు ప్రాధాన్యత ఇవ్వబడింది. ప్రజా రోగ్యం, వైద్యం విషయంలో అనేక పరిమితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం చేతనే ప్రధానంగా అందించబడింది. ప్రజలకు తక్కువ ధరకే మందులందించే లక్ష్యంతో ఏర్పాటు చేయబడిందే ఐడిపిఎల్. పాలకులు దీన్ని ఉద్దేశ పూర్వకంగా మూసివేశారు. నేడు రెడ్డి ల్యాబ్ లాంటి అనేక ఫార్మా కంపెనీలు ప్రజల రక్తాన్ని డబ్బు రూపంలో జలగల్లా పీలుస్తు న్నాయి. ప్రజల స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో వచ్చింది మేడిన్ ఇండియా అయితే, స్వదేశీ, విదేశీ పెట్ట బడిదారుల ప్రయోజనాల కోసం, నేటి పాలకులు అవలంబిస్తున్నది 'మేకిన్ ఇండియా'.



గీట్ల ముకుందరెడ్డి
9490098857

స్వతహాగా టెక్నాలజీని అభివృద్ధి చేసి, స్వయం సమృద్ధి, దేశ స్వావలంబన, మెరుగైన జీతభత్యాలు, పర్మనెంట్ ఉద్యోగత కల్పించడం మేడిన్ ఇండియా ఉత్పత్తి లక్ష్యం. కాగా, విదేశీ టెక్నాలజీ, భారతీయ నిరుద్యోగులను కట్టు బానిసలుగా మార్చి అతి తక్కువ వేతనాలతో బహుళ జాతి సంస్థల ఉత్పత్తు లను దేశంలో ఉత్పత్తి చేయడమే మేకిన్ ఇండియా ఉద్దేశం. ఆధు నిక రఫేల్ యుద్ధ విమానాలను స్వయంగా తయారు చేసు కోవ డం కాదు,అధిక రేట్లకు దిగుమతి చేసుకోవడమే గొప్ప. సెమీ కండ క్టర్లు, చిప్ డిజైన్లు అభివృద్ధి చేసుకోవడం కాదు, సెల్ఫోన్ల అసెంబ్లీ దేశంలో చేస్తే సరిపోతుందనేది నేటి పాలకవర్గాల విధానం.

నాటి నుంచి నేటి వరకు అవే విధానాలు!

ఒక దేశ అభివృద్ధి ఆ దేశంలో లభించే సహజ వనరులు, భౌగోళిక స్థితిగతులు, వాతావరణం, శీతోష్ణస్థితి, మానవ వనరుల నైపుణ్యత, ఉత్పత్తిలో వినియోగించే పనిముట్ల స్థాయిపై ఆధారపడి ఉంటాయి. మన దేశమనే గర్వంకాదు కానీ, ప్రపంచంలో ఏ దేశానికి లేనంత సహజ వనరులు, భౌగోళిక, వాతావరణ పరిస్థితులు, మానవవనరులు శీఘ్రగతిన భారతదేశం అభివృద్ధి చెందడానికి దోహదం చేసే విధంగా ఉన్నాయి. కానీ, చిత్తశుద్ధి లేని పరిపాలన వ్యవస్థ, పెట్టుబడిదారి, భూస్వామ్య వర్గాల ప్రయోజనకరమైన విధానాలే ఈరోజు అనేక రంగాల్లో దేశం సాధించాల్సిన ప్రగతికి ఎంతో దూరంగా ఉండిపోవడానికి కారణమైంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటితో పోల్చుకుంటే ఎంతోకొంత అభివృద్ధి చెందింది. కానీ దానికి కొలమానం గతంతో పోల్చు కోవడం కాదు, సమకాలీన ప్రపంచంలో మనమెక్కడున్నామనేదే ఇప్పుడు వేసు కోవాల్సిన ప్రశ్న? నాటి స్వదేశీ ఉద్యమం అప్పుడే పుట్టి నడక నేర్చు కుంటున్న భారత పెట్టుబడిదారుల అభివృద్ధికి బాగా తోడ్పడింది. బాంబే ప్లాన్ 1944 మౌలిక రంగంలో అభివృద్ధికి పెట్టుబడులు ప్రభుత్వాని(ప్రజలవి)వి. వాటిని ఉపయోగించుకొని, నిరంతర వినిమయ వస్తుత్ప త్తుల పరిశ్రమలు పెట్టుబడిదారులవి (ఉదా: బట్టలు, సబ్బులు, టూత్ పేస్టులు). తక్కువ కాలంలో ఎక్కువ టర్నో వర్లు, ఎక్కువ లాభాలు భారత పెట్టుబడిదారులకు అభయ హస్తం అందించింది. రాజీవ్ కాలంలో అడుగులుపడి పీవీ నర్సింహారావు, మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో తెరలేసిన నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు మోడీ, షా నేతృత్వ ంలో ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులు లీజుకు లేదా నామమాత్రం ధరలకు బడా కార్పొరేట్లకు అప్పగిస్తు ప్రజల ఆస్తులను లూటీ చేస్తున్నారు.

ప్రజల దృష్టిని పక్కదారి పట్టిస్తున్న పాలకులు

స్వాతంత్రోద్యమకాలంలోనే మూడు ప్రధాన ప్రవంతులు ఏర్పడ్డాయి. ఒకటి: పాశ్చాత్య ఆధునిక పెట్టుబడిదారీ విధాన అభి వృద్ధి పంతాన్ని ఎంచుకున్న జాతీయ బూర్జువా వర్గం. దానికి నాయ కత్వం వహించిన కాంగ్రెస్ పార్టీ. రెండు: వామపక్షం, రష్యన్ విప్లవ స్ఫూర్తి, మార్క్సిజం, లెనినిజం ఆశయ సాధనంతో కార్మికవర్గ రాజ్యం, సోషలిస్టు వ్యవస్థ ఏర్పాటు చేయడం. మూడు: భారతదేశ ప్రాచీన వ్యవస్థ, ధర్మశాస్త్రం, పుక్కిటి పురాణాలు, మనుధర్మ శాస్త్రం ప్రబో ధంగా ఆరెస్సెస్ హిందుత్వ శక్తులు. ఈ మూడు ప్రధాన సవం త్రులలో నేడు మూడో ధోరణి కలవారు గత పదకొండేండ్లుగా దేశంలో రాజ్యాధికారం చేస్తున్నారు. వీరి నీతి బ్రిటిష్ నీతి. వీరి లక్ష్యం సహజ వనరులను లూటీ చేసి స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు దోచిపెట్టడం. స్వాతంత్ర్య ఉద్యమం నుండి ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకు నాడు బ్రిటిష్ పాలకులు విభజించు, పాలించు లక్ష్యంతో హిందూ, ముస్లిం మత ఘర్షణలు సృష్టించారు. బెంగాల్ ను మత ప్రాతిపదికన తూర్పు, పశ్చిమ బెంగాల్‌గా విడదీయడానికి యత్నించారు. అనేక సందర్భాలలో మత వైషమ్యాలు రగిలించారు. నేటి బీజేపీ పాలకులు బ్యాంకులు, రైల్వేలు, ఎల్ఐసి, సింగరేణి, బొగ్గుగనులు, విద్యుత్తు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, జాతీయ రహ దారులు, స్పెక్ట్రం, విద్య, వైద్యం అన్నింటినీ లూటీచేసే విధంగా బడా పెట్టుబడిదారులకు ప్రయోజనం చేసే విధానాలు అవలంభిస్తు న్నారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రతి అంశాన్ని, సందర్భాన్ని మతానికి ముడిపెడుతూ మత ఘర్షణలను ప్రోత్సహిస్తున్నారు, పెం పొందిస్తున్నారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో లౌకిక ప్రజాస్వామ్య రక్షణ, దేశ సహజ వనరుల రక్షణ, ప్రజా వనరుల దోపిడీ నిర్మూలన, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, విద్యా వైద్యం ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక, ఉద్యోగ, మేధావివర్గం మరో స్వాతంత్ర్య పోరాటానికి నడుం బిగించాల్సిన అవసరం ఉన్నది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
మంగళవారం | ఆగస్టు 27, 2024 | www.navatelangana.com

నేడు ధర్నా విజయవంతం చేయండి..

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్

నవతెలంగాణ - కరీంనగర్

భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను ఎల్ఐసీకి ఇవ్వాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కరీంనగర్ లేబర్ కమిషనర్ ఆఫీస్ ఎదుట మంగళవారం నిర్వహించే ధర్నా కార్యక్రమా న్ని జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్ కోరారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను ఎల్ఐసీకివాలన్నా ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాల్సిందిగా జిల్లా లేబర్ కమిషనర్ ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం ఉంటుందని, దీనికి జిల్లాల్లోని ప్రతి భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయా లని కోరారు. 3600 కోట్ల రూపాయలు ఉన్న వెల్ఫేర్ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికులకు దక్కకుండా చేయడానికి ఎల్ఐసీకి ఇవ్వాలనే తీసుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఇప్పటికే అనేక రకాల ఇబ్బందులకు గురవుతూ నానా కష్టాలు పడుతున్న నిర్మాణ కార్మికులకు ఎల్ఐసీకి ఇవ్వాలనే నిర్ణయం పెద్ద గుదిబండగా మారనుందని అన్నారు. లేబర్ ఆఫీస్ ద్వారా ఇస్తున్న నిధులు కార్మికులకు అందకుండా పైరవీకారులు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రభుత్వం తీసుకునే నిర్ణయం నిర్మాణ కార్మికులకు శాపంగా మారనుందన్నారు. ఎల్ఐసీకి నిధులు అప్పగిస్తే ఇన్సూరెన్స్ కంపెనీ వారు పెట్టే నిబంధనలు సామాన్య కార్మికులు వాటిని అర్థం చేసుకోలేక ఆ సర్టిఫికెట్స్ తేలేక పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఆలోచించి ఎల్ఐసీకి ఇవ్వాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఇప్పుడు నడుస్తున్న పద్ధతిలోనే క్లైములు ఇస్తూ ఈ వ్యవస్థలో ఉన్న దళారీ వ్యవస్థను అరికట్టాలని, అవినీతి అధికారులను కూడా కట్టడి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ అధ్యక్షులు అనుముల మల్లారెడ్డి, జిల్లా కోశాధికారి వట్టి జగదీష్, జిల్లా ఉపాధ్యక్షులు పాతూరి లింగారెడ్డి, నాయకులు అంజి, చంద్రయ్య, సిరికొండ రాజు, లత, తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలి

-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



నవతెలంగాణ - కరీంనగర్

రైతుల రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగనందున రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నందున వెంటనే రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం వెంటనే చొరవ చూపి రైతులందరికీ రుణమాఫీ జరిగేలా చూడాలని తెలిపారు. వర్షాకాలం పంటలు ప్రారంభమైనందున రైతు భరోసా వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన విధంగా రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని, ఎరువులను సబ్సిడీలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. కొత్త రేషన్ కార్డులు వెంటనే అందించాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డు ఇవ్వాలని కోరారు. కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తానన్న హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. మహిళలకు పెన్షన్ అమలు చేయాలని కోరారు.

గన్నీబ్యాగ్‌ల కుంభకోణంపై తేల్చండి

- ఆర్ఆర్ ట్యాక్స్ కోసమే వసూళ్ల పర్వం
- కేంద్ర మంత్రులకు ధాన్యం దోపిడీ కనబడటం లేదా
- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్



నవతెలంగాణ - కరీంనగర్

వరిధాన్యం కోనుగోళ్ల విషయంలో రూ.11కోట్ల కుంభకోణం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయని, గన్నీబ్యాగ్‌ల విషయంలో రూ.50కోట్లు చేతులు మారాయని, కాంగ్రెస్ ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖలో జరుగుతున్న అవినీతిపై దృష్టిసారించాలని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ధాన్యాన్ని సేకరించేందుకు టెండర్లు పెట్టారని, ఒక బస్తాకు రూ.2223 అయితే అదనంగా మరో రూ.200 వసూలు చేస్తున్నారని విమర్శించారు. అవసరమైనన్ని గన్నీ బ్యాగ్స్ కొనుగోలు చేయాలని ప్రభుత్వం అలసత్వం వల్ల ఒక్క బ్యాగ్‌కు రూ.14 నుంచి రూ.18కు ధర చేరుకోవడం ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. ఒక బ్యాగ్ బరువు ప్రస్తుతం 400 గ్రాములకు బ్యాగ్ బరువు ఉండటం రైతును దగా చేయడమేనని అన్నారు. గన్నీ బ్యాగ్‌లు, ధాన్యం కొనుగోళ్ల టెండర్‌లలో విచ్చలవిడి అవినీతి జరుగుతుందని విమర్శించారు. ప్రభుత్వం ఆర్ఆర్ ట్యాక్స్(రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి) వసూలు చేస్తూ కమీషన్లు ఇస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. ఆర్ఆర్ ఇంప్లిమెంట్ చేయడానికి మాత్రమే టెండర్లు, గన్నీ బ్యాగ్‌ల కుంభకోణానికి తెరలేపారని విమర్శించారు. ఎఫ్‌సీఐ కేంద్రం చేతుల్లో ఉంటుందని, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్యాడి దోపిడీపై దృష్టిసారించకపోవడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. చెడిపోయిన సంచులను తిరిగి అమ్ముతున్నారని, ఇదో పెద్ద స్కామ్ అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి తూతూ మంత్రంగా ఇస్తుందని విమర్శించారు. తక్షణమే సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్ల టెండర్లు, గన్నీబ్యాగ్‌ల స్కామ్‌పై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో పెండ్యాల మహేశ్, కెమసారం తిరుపతి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పారమిత విద్యార్థినికి కేంద్ర మంత్రి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి బండి సంజయ్

నవతెలంగాణ - కరీంనగర్

జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైన పారమిత విద్యార్థిని మంత్రి బండి సంజయ్ అభినందించారు. నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన శుభశ్రీ సాహు తన శాస్త్రీయ ఆవిష్కరణకు గాను న్యూఢిల్లీలో జరగనున్న ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్ నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనేందుకు ఎంపికైంది. ఈ ఎగ్జిబిషన్ 17-19 సెప్టెంబర్‌న న్యూఢిల్లీలో జరగనుంది. ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్ నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ నిర్వహిస్తోంది. భారత ప్రభుత్వం నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) సహకారంతో సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్త సంస్థ. ప్రతిష్టాత్మకమైన ఈ జాతీయస్థాయి ఎగ్జిబిషన్ పోటీలో పాల్గొనేందుకు కరీంనగర్ జిల్లా నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిని శుభశ్రీ మాత్రమే కావడం గమనార్హం. అగ్రశ్రేణి విజేతలు రాష్ట్రపతి భవన్‌లో జరిగే ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఫైన్)లో పాల్గొనే అవకాశాన్ని కూడా పొందుతారు. సాకురా మార్పిడి కార్యక్రమం కింద జపాన్ సందర్శించడానికి ఆహ్వానం పొందుతారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం శుభశ్రీని అభినందించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. శుభశ్రీ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పారమిత గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, ప్రాచీ, రమణ, రాకేష్, వీయూఎం ప్రసాద్, వినోద్ రావు, డైరెక్టర్, ప్రధానోపాధ్యాయులు హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు పాల్గొన్నారు.

'కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి'



కుంటను చూపెడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ పట్టణంలోని వివిధ కుంటలు, చెరువుల భూములను కబ్జా చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు, నాయకుడు కొలిపాక శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. హుజురాబాద్ పట్టణంలో సాగు తాగు అవసరాల కోసం మోడల్ చెరువు గుండ్ల చెరువు, గంగోని కుంట బట్టోని కుంట, చంద్రవానికుంట, పీతిరుకుంట, ఎర్రకుంటలు గతంలో ఉండేవని అన్నారు. జమ్మికుంట రోడ్‌లోని చంద్రవాని కుంట స్థలాన్ని పలువురు కబ్జా చేసి ఇండ్లు నిర్మించుకున్నారని అన్నారు. మరి కొంతమంది ఎఫ్‌టిఎల్ ప్రాంతంలో, బఫర్ జోన్‌లో కూడా నిర్మాణాలు చేపట్టారని.. వెంటనే ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణ చేసి కుంటను కాపాడాలని కోరారు. ఎర్రకుంట దాదాపుగా అన్యాకాంతమైందని ఆవేదన వ్యక్తం చేశారు. పాతవాడ సమీపంలో గంగోని కుంట స్థలం కూడా చాలా ఆక్రమణకు గురైందని, గతంలో అధికారులు ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేశారని, నిర్లక్ష్యం మూలంగా కొంతమంది గంగోలి కుంట స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని అన్నారు. డిబిఎం 16 ఉపకాలువ గతంలో 33 ఫీట్ల వెడల్పుతో ఉండేదని ప్రస్తుతం కాలువ వెడల్పు పూర్తిగా తగ్గిపోయిందని వెంటనే చిన్న నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి కాలువ హద్దులను నిర్ణయించి ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు. బుడగ జంగం కాలనీలోని బట్టోని కుంట కూడా చాలామటుకు కొంతమంది పలుకుబడి కలిగిన వ్యక్తులు కబ్జాలు చేశారని వెంటనే అధికారులు స్పందించాలని కోరారు. కబ్జాలలో కూడా కొంతమంది టెక్నికల్ గా అధికారులకు దొరకకుండా ఉండేందుకు ఒక స్థలాన్ని కొన్ని రోజుల్లోనే ముగ్గురు ఒకరి తర్వాత ఒకరు కొనుక్కొని లింకు డాక్యుమెంటును సంపాదిస్తున్నారని వారు ఆరోపించారు. హుజురాబాద్ పట్టణంలో హనుమాన్ గుడి స్థలాన్ని, ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని ఉన్నత పాఠశాల స్థలాన్ని విడిచిపెట్టకుండా కబ్జాలు చేశారని అన్నారు. హైదరాబాద్‌లో కబ్జాలపై చర్యలు తీసుకున్నట్లుగానే హుజురాబాద్‌లో కూడా ప్రభుత్వ స్థలాలను కబ్జాదారుల నుండి కాపాడడానికి అధికారులు కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతుబంధుపై రసమయి ద్వంద్వ వైఖరి

కాంగ్రెస్ నేత గోపు మల్లారెడ్డి



నవతెలంగాణ - తిమ్మాపూర్

రైతుబంధు పథకంపై మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి కార్యదర్శి గోపు మల్లారెడ్డి ఆరోపించారు. మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కుటుంబం రైతుబంధు సాయం పొందుతున్నారంటూ బాలకిషన్ యాగి చేస్తున్నారని, మరి ఆయన కుటుంబం కూడా రైతుబంధు సాయం పొందుతున్నారని, ఈ విషయాన్ని విస్మరించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 8నెలల్లోనే రైతులకు రుణ బకాయిలను మూడు విడుతల్లో మాఫీ చేసిందని గుర్తు చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు రైతులను రోడ్లపైకి రప్పించి ఆందోళనలు చేయిస్తున్నారని విమర్శించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ - రామడుగు

మండలంలోని వెలిచాల సరస్వతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు బాలకృష్ణుడు, గోపికలు, రాధ,రుక్మిణి, సత్యభామ, యశోద వంటి వేషధారణలతో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం, ప్రైమరీ స్కూల్ ఇన్‌చార్జి కంకణాల భూమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవానికి సిద్ధమైన సింగిల్ విండో భవనం

ప్రారంభానికి ముస్తాబైన సింగిల్ విండోభవనం

రూ.60లక్షలతో నిర్మాణం - నేడే ప్రారంభం



చైర్మన్ దూలం బాలగౌడ్

నవతెలంగాణ - గంగాధర

రైతుల సౌలభ్యం కోసం గంగాధర మండల కేంద్రంలో నూతన సహకార సంఘ భవనం అన్ని హంగులతో నిర్మాణ పనులు పూరై ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నుండి మంజూరైన 60లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ నూతన భవనాన్ని సంఘ సభ్యులు, పాలకవర్గ సమావేశాలు, అధికారిక పాలనకు అనుగుణంగా చేపట్టారు. అనేక సంవత్సరాలుగా ఇక్కడి సింగిల్ విండో భవనం రెవెన్యూ కార్యాలయంలో కొనసాగుతుండగా, వచ్చే రైతులకు ప్రజలకు ఇబ్బందిగా మారింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని నూతన సహకార సంఘ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఆ సంఘం చైర్మన్ దూలం బాలగౌడ్ అనతి కాలంలోనే భవన నిర్మాణం పూర్తి చేసి రైతుల మన్ననలను చూరగొన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనులు పూర్తి చేసిన ఈ భవనం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా మంగళవారం ప్రారంభోత్సవం జరగనుంది. సంఘ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా రుణాల చెల్లింపులు, వసూళ్లను చేపట్టిన చైర్మన్ దూలం బాలగౌడ్ సంఘంలో అనేక సంస్కరణలు చేపట్టి అభివృద్ధి దిశగా తీసుకెళ్లారు. గతంలో ఎంపీపీగా పనిచేసిన దూలం బాలగౌడ్ తన హయాంలోనే మండల పరిషత్ నూతన భవనాన్ని నిర్మించి అధికారిక పాలనకు, మండల పరిషత్ పాలకవర్గ సభ్యులు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. దూలం బాలగౌడ్ ఏ పదవి చేపట్టిన ఆ పదవికే వన్నె తెచ్చే విధంగా వ్యవహరించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యే. గంగాధర సహకార సంఘంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రుణాలను పెంచి రైతులకు అందించారు. 3కోట్లా 20లక్షల రూపాయలను రైతులకు దీర్ఘకాలిక, 7కోట్లా 90లక్షలను స్వల్పకాలిక రుణాలుగా అందించారు. సహకార సంఘం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ ముందుకు సాగుతున్న సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్ తీరుపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బొమ్మలమ్మ గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

చరిత్ర పరిరక్షణ సమితి సభ్యులు



బొమ్మలమ్మ గుట్టను సందర్శించిన చరిత్ర పరిరక్షణ సమితి సభ్యులు

నవతెలంగాణ - గంగాధర

తొలి కంద పద్యాలకు నిలయం, జైనమత నేపథ్యం గల బొమ్మలమ్మ గుట్టను ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా గుర్తించాలని చరిత్ర పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సందెవేని తిరుపతి, ఆ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. చరిత్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రెండు రోజుల యాత్రను చేపట్టారు. ఇందులో భాగంగా గంగాధర మండలం కురిక్యాల, కొండన్నపల్లి గ్రామాలను ఆనుకుని ఉన్న బొమ్మలమ్మ గుట్టను సందర్శించారు. తెలంగాణ చారిత్రక ప్రాంతాలను సందర్శిస్తూ వాటి ప్రాధాన్యతలను నేటి తరానికి పరిచయం చేస్తూ, కళాశాల స్థాయి విద్యాబోధనలో చరిత్రను తప్పనిసరి పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేస్తూ చరిత్ర పరిరక్షణ సమితి సభ్యులు చేపట్టిన ఈ యాత్రను ప్రముఖ చరిత్ర కారుడు డాక్టర్ జైశెట్టి రమణయ్య ప్రారంభించారు. తొలి రోజు పొలాస, కోటిలింగాల, మునులగుట్టను సందర్శించిన సమితి సభ్యులు సోమవారం బొమ్మలగుట్ట సందర్శించి యాత్రను ముగించారు. ఈ సందర్భంగా చరిత్ర పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సందెవేని తిరుపతి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని అత్యంత ప్రాచీన విద్యా కేంద్రాలలో బొమ్మలమ్మ గుట్ట ఒకటని అన్నారు. త్రిభువన తిలక బసదిగా పిలువబడే గుట్టపై చెక్కబడిన త్రిభాషా శాసనంలోని తెలుగు కంద పద్యాల వల్లే తెలుగు బాషకు ప్రాచీన హోదా దక్కిందని అన్నారు. గొప్ప చారిత్రక సంపద, ప్రాచీన తెలుగు శాసనాలకు నిలయమైన బొమ్మలమ్మ గుట్టను పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒకరిపైన ఉందన్నారు. బొమ్మలమ్మ గుట్టను తెలుగు ప్రజలు తప్పకుండా సందర్శించి చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకోవల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గుట్టను సందర్శించే ప్రజలకు ప్రభుత్వం మరిన్ని సౌకర్యాలు కల్పించి, పర్యాటక కేంద్రంగా అభివద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా నిలిచే వారసత్వ సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలంటే కళాశాల స్థాయి విద్యాబోధనలో బొమ్మలమ్మ గుట్ట చరిత్రను తప్పనిసరిగా బోధన పాఠ్యాంశంగా చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ యాత్రలో చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుందారపు సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివాల భక్తర్, రామకృష్ణగౌడ్, తిరుపతి, అజేయ్, శంశక్ సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలపై అవగాహనా సదస్సు



మాట్లాడుతున్న సీఐ స్వామి

నవతెలంగాణ - తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు తిమ్మాపూర్ సీఐ స్వామి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గణేష్ మండపాలు ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా డీజే మండపాల్లో , నిమజ్జనం రోజున ఉపయోగిస్తే డీజే వారితో పాటుగా మండపాల నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ ఎస్ఐ బెల్లం చేరాలు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా జీల మధు



నవతెలంగాణ - గన్నేరువరం

మండల ఆటో యూనియన్ కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆటో యూనియన్ జేఏసి మద్దెల రాజేందర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గన్నేరువరం మండల అధ్యక్షుడిగా జీల మధు, ఉపాధ్యక్షుడిగా కుసుంబ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బోయిని శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కవ్వంపల్లి సంపత్, కోశాధికారిగా మహంకాళి తిరుపతి, ఆర్గనైజర్‌గా బండి పరశురాం, జిల్లా కమిటీ సభ్యులుగా సోలేటి అంజనేయులు, ఉప్పులేటి అంజయ్య కుమ్మరి స్వామిని ఎన్నుకున్నారు.

బీసీ కాబట్టే ఇన్‌చార్జి మేయర్‌గా బాధ్యతలు ఇవ్వలేదు

బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్



మాట్లాడుతున్న గుంజపడుగు హరిప్రసాద్

నవతెలంగాణ - కరీంనగర్ : డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి బీసీ మహిళ కాబట్టే ఇన్‌చార్జి మేయర్‌గా బాధ్యతలు ఇవ్వడం లేదని బీసీ సంఘాల నాయకుల రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. కరీంనగర్ మేయర్ ప్రభుత్వానికి, కలెక్టర్‌కి ఎలాంటి సమాచారం లేకుండా అమెరికా పర్యటన వెళ్లడం సరికాదన్నారు. ఒక బీసీ మహిళకు వివక్ష జరుగుతున్న విషయంలో కలెక్టర్ స్పందించి డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణిని ఇన్‌చార్జి మేయర్‌గా తక్షణమే నియమించాలని, లేదా మేయర్‌ను వెంటనే ఇండియాకు రప్పించాలన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి పటేల్, నాయకులు అది మల్లేశం పటేల్, గుట్ల శంకర్, పెంట అజయ్ పటేల్, గారిగే కోటేశ్వర్, కొట్టే రమేష్, చట్ల తిరుపతి తదితరులున్నారు.

ఘనంగా ఉట్టి వేడుకలు



నవతెలంగాణ - భగత్‌నగర్

కృష్ణాష్టమి సందర్భంగా నగరంలోని జ్యోతినగర్ ఇంగ్లీష్ యూనియన్ గ్రౌండ్ వద్ద సోమవారం రాత్రి సీవీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో ఉట్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాపర్తి విజయ, కొత్త అనిల్, లైనిక్, సాయిసుమంత్, సాయిరాం, అరుణ్, చరణ్, అనంద్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకులకు సన్మానం

నవతెలంగాణ - కరీంనగర్ : భారతరత్న మదర్ థెరీసా జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ లయన్స్ క్లబ్ మంకమ్మతోట అధ్యక్షుడు లయన్ బూర్ల విద్యాసాగర్ ఎంజేఎఫ్, కార్యదర్శి లయన్ అంబటి రవీందర్ రాజు, కోశాధికారి లయన్ పాత విశ్వనాథం ఆధ్వర్యంలో నలుగురు నిస్వార్థ స్వచ్ఛంద సేవకులను వాసర హాస్పిటల్‌లో సోమవారం సన్మానించారు. రావుఫ్ అఫ్జల్ విశ్రాంత పీఈటీ, మమత, సుభాషిని, షబానాకు సన్మానం చేశారు. క్రార్యక్రమంలో ఫాస్ట్ ప్రెసిడెంట్స్ లయన్స్ నాగసముద్రం వాసరయ్య, గుండు లక్ష్మయ్య, జిల్లా కృష్ణమూర్తి, వైదరాజ మల్లయ్య, శ్రీపతి వెంకటేశం, భొంగోని దామోదర్, సల్వాజి తిరుపతి, దొనపాటి రవీందర్ రెడ్డి, డాక్టర్ మహేష్ బాబు, డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

29నుంచి పాఠశాలల క్రీడా పోటీలు

నవతెలంగాణ - జమ్మికుంట

ఈ నెల 29 నుండి 31 వరకు పట్టణంలోని జెడ్‌పిహెచ్ఎస్ బాలుర మైదానంలో జమ్మికుంట మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అండర్ 14, అండర్17 సంవత్సరాల బాల బాలికలకు ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని చెప్పారు.

యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ - వీణవంక

మండలంలోని గన్ముకుల గ్రామానికి చెందిన యువకుడు కాగిత సందీప్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సంపత్ కుమారుడు సందీప్(20) గన్ముకుల మోడల్ స్కూల్లో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. కొన్ని రోజులుగా సందీప్ మానసిక స్థితి సరిగా లేక కడుపులో నొప్పి వస్తూ కాలేజీకి వెళ్లడం లేదు. ఈ నెల 25న ఉదయం 8 గంటలకు కడుపులో విపరీతంగా నొప్పి వస్తుందని చెప్పగా సందీప్ తల్లిదండ్రులు చికిత్స గురించి జమ్మికుంటలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతు పరిస్థితి విషమించి సాయంత్రం ఐదు గంటలకు మరణించాడు. కడుపునొప్పి బాధ భరించలేక గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఈద్గా, కబరస్థాన్, మజీద్ ప్రాంతాలను శుభ్రం చేయాలి



నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ మజీద్ కాంప్లెక్స్‌లో ఈద్గా, కబరస్తాన్‌తో పాటు ఐదు మసీదుల చుట్టుపక్కల ప్రాంతాలను మున్సిపల్ అధికారులు, పాలకవర్గం శుభ్రం చేయించాలని జామే మజీద్, ఈద్గా, కబరస్తాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. సోమవారం మజీద్ కాంప్లెక్స్ ప్రాంతంలోని ఈద్గా, కబరస్తాన్ సందర్శనలో భాగంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలం కావడంతో చెట్లు మొలిసి ఈద్గా, మసీదులు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయని వాటిని పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయని, అలాగే కబరస్తాన్లో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో ఆ ప్రాంతంలో పాములు కూడా సంచరిస్తున్నాయని ఎలాంటి ప్రమాదం జరగకముందే దయచేసి వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులు వీటిని శుభ్రపరచాలన్నారు.

నేత్ర, అవయవ దానంపై అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ - జమ్మికుంట

ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించే జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు యం.నరహరి ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని నిత్య యోగ సాధన సెంటర్‌లో శిక్షణ పొందుతున్న వారికి నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు. మానవతా దృక్పథంతో ఆలోచించి నేత్రదానం చేయాలని కోరారు.

కళారత్న పురస్కారం అందుకున్న రామంచ భరత్

నవతెలంగాణ - జమ్మికుంట

తెలంగాణ రాష్ట్రస్థాయి కళారత్న పురస్కారం ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్ అందుకున్నారు. మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా అందించి ఘనంగా సన్మానించారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT WARANGAL

O.S NO 445 OF 2023

BETWEEN:

Gajjela Upender ....Plaintiff

And

Edla Rajender ....Defendant

To

Edla Rajender, S/o Rajalingam, Age: 38yrs, Occ: Auto Driver, R/o. Gandrapalli, Jammikunta Mandal, Karimnagar Dist (Defendant)

Take Notice that the plaintiff herein filed the above suit for Recovery of money, against you. Earlier notices sent to you were not served on you and returned as un-served, so the above suit is posted to 27-09-2024 for your appearance. So be present either personally or through an advocate on the above date before the Hon'ble court, at 10:30A.M, failing which the matter will be determined in your absence by way of Ex-parte.

(By the Order of the Hon'ble court in I.A No 401/2024 in O.S No 445/2023)

Sd/- GANDHAM RAMESH
BURRA VAMSHI
Advocates
Off : # 5-11-1130/2,
Hanuman nagar Colony,
Hanuman Nagar,
Hanamkonda City & dist
Mob: 9010490047, 9701173100

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ఆకట్టుకున్న చిన్నారుల వేషాదారణలు



నవతెలంగాణ-జగిత్యాల టౌన్

జగిత్యాల పట్టణంలో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వేడుకలు అంబరాన్నంటాయి. పట్టణంలోని పలు విధుల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ప్రత్యేకంగా చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలతో అందంగా అలంకరించారు.. ధర్మపురి శ్రీ లక్ష్మీనసింహ్మా స్వామి, కొండగట్టు ఆంజనేయ స్వామి, పెంబట్ల దుబ్బరాజేశ్వర స్వామి, జగిత్యాల పట్టణంలోని శివాలయం, సాయిబాబా, పొలాస లలితమత ఆలయాల్లో భక్తుల తాకిడి పెరిగింది.

మల్యాల: మల్యాల మండలంలోని ఆయా గ్రామాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, రాధాకృష్ణుల, గోపికల వేషధారణలతో అలరించారు. అనంతరం పలు గ్రామాలలో ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు మెరుగుపర్చేలా!

- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మళ్లీ ఎఫ్ఎల్ఎన్
- ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎల్ఈపీ
- ఈనెల 1 నుంచి అమలు చేస్తున్న విద్యాశాఖ

నవతెలంగాణ-మల్యాల

విద్యాశాఖ ప్రభుత్వం పాఠశాలల్లోని విద్యార్థుల విద్యా సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందు కోసం ప్రాథమిక స్థాయిలో ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ), ఉన్నత విద్యార్థుల ప్రగతి కోసం ఎల్ఐపీ (లర్నింగ్ ఇంప్రూవమెంట్ ప్రోగ్రాం) కార్యక్రమాలను పునరుద్ధరించారు. ఆయా కార్యక్రమాలు ఎన్నికల సమయంలో నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఆగస్టు 1 నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో యధావిధిగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తెలుగు, గణితం, ఇంగ్లీష్‌పై సరైన పట్టు సాధించడం, చదవడం, రాయడంలో మెరుగుపర్చడమే లక్ష్యంగా ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

మండలంలో పరిస్థితి..

మల్యాల మండలంలో మొత్తం 40 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 25, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ఉన్నత పాఠశాలలు 11 వరకు ఉండగా కేజీబీవీ పాఠశాల, తెలంగాణ మోడల్ పాఠశాల, బాలికల గురుకులం పాఠశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపు 2900 వందల మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. 2022లో ప్రారంభమైన ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం గతేడాది ఎన్నికల కారణంగా అటకెక్కింది. దీంతో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కనీస సామర్థ్యాలు తగ్గిపోయాయి.



విద్యార్థులు చదవడం, రాయడంలో తడబడుతున్నారు. విద్యావ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టడం, విద్యాసామర్థ్యాలు మెరుగుపర్చేందుకు మళ్లీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్యేక యాప్ ద్వారా ఆగస్టు, డిసెంబర్, మార్చిలో ప్రత్యేక టెస్టులు నిర్వహించనున్నారు. వాటి ద్వారా చిన్నారుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేయనున్నారు. ఐదో తరగతి వరకు అక్షర పునాదిని పటిష్టం చేయనున్నారు. విద్యార్థులు చదవడం, రాయడంతో పాటు కూడికలు, తీసివేతలపై కూడా పట్టు సాధించేలా ప్రోత్సహించనున్నారు. ఒకటో తరగతిలో నిమిషానికి 20 పదాలు, రెండో తగరతిలో 25, మూడు, నాలుగో తరగతి విద్యార్థులకు 40, ఐదో తరగతి విద్యార్థులకు 50 పదాల ధారాళంగా చదవడం రావాలి. విద్యార్థిలో కనీస సామర్థ్యాలను అంచనా వేసి రానున్న కాలంలో వారిపై ప్రత్యేక దృష్టి సారించేలా ప్రణాళికలు రూపొందించారు.

విద్యా సామర్థ్యాల పెంపే లక్ష్యంగా..



ప్రతి విద్యార్థిలో కనీస విద్యా సామర్థ్యాలు, బోధనా భ్యాసన ప్రక్రియలు పెంపే లక్ష్యంగా ఎఫ్ఎల్ఎన్, ఎల్ఈపీ కార్యక్రమాలు కొనసాగుతాయి. ప్రతి విద్యార్థి బేస్ లైన్ పర్ఫామెన్స్ ఆధారంగా మూడు విభాగాలుగా విభజించి. మొదట పర్ఫామెర్ గ్రూప్, రెండోది పీఆర్ గ్రూప్, మూడోది టీచర్ సపోర్ట్ గ్రూప్‌లు నిర్వహించి టీచర్ సపోర్టు గ్రూప్ ఉన్న పిల్లలను పర్ఫార్మర్ గ్రూపులోకి తెచ్చేందుకు, ఉపాధ్యాయులు కృషి చేస్తారు. ఇప్పటి వరకు కొన్ని పాఠశాలల్లో పరీక్షలు పెట్టడం జరిగింది. మిగతా పాఠశాలలలో ఈనెల 30లోపు పరీక్షలు పెట్టి. గ్రూపులను ఏర్పాటు చేయడం జరుగుతుంది. నవంబర్‌లో నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో ఉన్నతమైన ఫలితాలు సాధిస్తాం. కనీస అభ్యసన సామర్థ్యాల ఆధారంగా వర్క్‌బుక్‌లు పూర్తి చేయాలి.

-శ్రీనివాస్, ఎంఈవో,మల్యాల

హై స్కూల్ విద్యార్థులకు లిప్..

ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు కోసం ప్రత్యేకంగా లిప్ (లర్నింగ్ ఇంప్రూవమెంట్ ప్రోగ్రాం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో మూడు అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని అమలు చేస్తున్నారు. తరగతి గది బోధన మెరుగుపర్చడం, విద్యార్థులు తెలుగులో రాయడం, చదవడం, టీచర్లలో సామర్థ్యాలను పెంచడం లాంటి అంశాలపై దృష్టి సారించారు. ఏం చదివారో..ఏం నేర్చుకున్నారో.. చెప్పలేని పరిస్థితి నుంచి విద్యార్థులను గట్టెక్కించేందుకు ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా బేస్‌లైన్ టెస్టులు నిర్వహిస్తారు. దీని ఆధారంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏనుగు రమేష్‌రెడ్డి

నవతెలంగాణ-మేడపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అని కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి మండల అధ్యక్షుడు ఏనుగు రమేష్‌రెడ్డి అన్నారు. భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాడు ఉద్యమ సమయంలో కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ మూడు విడతలుగా రైతులకు అందించిందని, ఇంకా 30శాతం రైతులకు రుణమాఫీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం అవుతుందని త్వరలో పూర్తవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు స్వామిగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఉరుమడ్ల నర్సయ్య, శ్రీపాతి దామోదర్, మాజీ ఎంపీటీసీలు దాసరి శంకర్, రాజారెడ్డి, ఏలేటి మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పద్మనాయక కళ్యాణ మంటపంలో వెలమ గణేష్ ఉత్సవ కమిటీ నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన కరపత్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాల నుంచి మట్టి గణపతి ఏర్పాటు ఆదర్శనీయం అని, మన సంస్కృతి సాంప్రదాయాలు మనమే కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రావు, మాజీ అధ్యక్షుడు పురుషోత్తం రావు, ముప్పాళ్ళ రాంచందర్‌రావు, మాజీ ఏఎంసి చైర్మెన్ దామోదర్‌రావు, ఆర్టీఏ మెంబర్ సుధాకర్‌రావు, పాక్స్ చైర్మన్ సాగర్‌రావు, అల్లాల ఆనంద్‌రావు, బోయిన్పల్లి హరి ప్రియ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్కేఎన్ఆర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను ఎస్‌కెఎన్ఆర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం కలిశారు. ఎస్‌కేఎన్ఆర్ మైదానంలో ట్రాక్ మరమ్మతులు చేయాలని, హైమాస్ లైట్ చెడిపోవడం వల్ల రాత్రి వేళలో మహిళా వాకర్స్‌కి ఇబ్బందిగా మారిందని సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధ్యక్షులు ఎర్ర నర్సయ్య, ప్రధాన కార్యదర్శి పరందాములు, క్యాషియర్ అంబారీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండలంలోని పోరుమల్ల గ్రామానికి చెందిన బోడ గంగమని, కొత్తూరి ప్రకాష్, కోత్తూరు లక్ష్మి ఇటీవల అనారోగ్యం బారిన పడి సాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవ చూపి బాధితులకు లక్షా 57 వేల 500 విలువ గల చెక్కులను బాధిత కుటుంబాలకు నేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మేడిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, ఏనుగు రమేష్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు మాదం వినోద్, మండల కార్యదర్శి పుప్పాల శ్రీధర్, జలపతి, భూమా రెడ్డి, తిరుపతి, మాజిద్, ప్రణయ్, సూర్యం,శ్రీను, రాజు, నారాయణ పాల్గొన్నారు.

వినాయక నవరాత్రి ఉత్సవాల కళాజాతరను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



మాట్లాడుతున్న కళాకారులు

మండలంలోని గోధూరు గ్రామంలో కళా వేదిక వద్ద గోధూరు యువశక్తి, కళాశక్తి గోధూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక నవరాత్రి ఉత్సవాల కళాజాతర కార్యక్రమ కరపత్రాన్ని ఉత్సవ నిర్వాహకులు అందరూ కలిసి సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను, కళలకు పునరుజ్జీవం అందించే కార్యక్రమాలను పదిరోజులపాటు ఒక్కో రోజు ఒక్కో కళా ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోధూరు యువశక్తి, కళాశక్తి గోధూరు సభ్యులు పాల్గొన్నారు.


జిల్లాలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-మేడిపల్లి

జగిత్యాల జిల్లాలో ఈఎస్ఐ డిస్పెన్సరీ కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి మునుగూరి హనుమంతు కోరారు. ఈఎస్ఐ సేవల ద్వారా ఉచిత ఓపి సేవలు, ఐపి సేవలు, ఉచిత పరీక్షలు, ఉచితంగా చికిత్స లు, శస్త్ర చికిత్సలు సంబంధిత ఈఎస్ఐ (ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ సంస్థ) పరిధిలో ప్రతినెల కార్మికుల జీతాల నుంచి కొంత అమౌంట్ కట్ కావడంతో లబ్ధిదారులు సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక జిల్లాలు ఏర్పాటు చేసినప్పటికీ ఈఎస్ఐ డిస్పెన్సరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో సేవలు కార్మికులకు అందని ద్రాక్షగా మిగిలి పోయింది.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-మల్యాల



బాండ్ పేపర్ అందిస్తున్న సంఘ సభ్యులు

మండలంలో అంబేద్కర్ యువజన సంఘాల ముత్యంపేట సంఘ సభ్యుడు మల్యాల గంగాధర్ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులకు అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. సోమవారం అంబేద్కర్ యువజన సంఘ సభ్యుల సహకారాలతో ఆర్థిక సహాయంగా రూ.50.000ల కేడీసీసీ బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి, బాండు పేపర్ వారి కుటుంబ సభ్యులు (భార్య) మల్యాల లత, తల్లి మల్యాల లక్ష్మిలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్లలో తనిఖీలు



నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని పలు రెస్టారెంట్లను మున్సిపల్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. మిగిలిపోయిన అన్నం, చికెన్, పలు పదార్థాలను గుర్తించారు. నిబంధనలు పాటించని రెస్టారెంట్లకు 32వేల జరిమానా వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ తనిఖీలో సానిటరీ ఇన్స్పెక్టర్ బాలే అశోక్, మున్సిపల్ సిబ్బంది జగ్గల్ల రమేష్ సానిటర్ జవాన్‌లు చిట్యాల గంగరాజం, చిట్యాల రమేష్, చిట్యాల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు ఎంపిక

నవతెలంగాణ -పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని పాఠశాలలో అండర్-14, అండర్-17 విద్యార్థులకు ఈ నెల 29, 30, 31 తేదీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ మరియు అథ్లెటిక్స్ క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీన బాలురకు, 30వ తేదీన బాలికలకు, 31వ తేదీన బాల బాలికలకు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే బాలబాలికలు బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికేట్‌లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెగడపల్లిలో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని వివరాలకు జడ్పీహెచ్ఎస్ పెగడపల్లి స్కూల్ పిడి రమేష్‌ను 9491109138 సంప్రదించాలని అన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- ఈనెల 29న రెవిన్యూ కార్యాలయాల వద్ద రైతులతో కలిసి ధర్నా
- సీపీఐ (ఎం) జగిత్యాల జిల్లా కమిటీ పిలుపు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

అర్హులైన రైతులందరికీ రెండు లక్షల వరకు రుణమాఫీతో పాటు రైతు భరోసాను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నాలకు సీపీఐ(ఎం) జిల్లా ఇన్‌చార్జి లెల్లెల బాలకృష్ణ, జిల్లా ప్రజాసంఘాల కన్వీనర్ తిరుపతి నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో రుణమాఫీ అమలు కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు జరిపిన రుణమాఫీ 50 శాతం మంది రైతులకే వర్తిస్తుందన్నారు. రుణమాఫీ కోసం అర్హులైన రైతులు బ్యాంకులు, రెవిన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, తెలంగాణ అన్నీ జిల్లాల్లో ఆధార్, రేషన్ కార్డును ఆగమనంలోకి తీసుకొని రుణమాఫీ చేసినట్లు మంత్రులు ప్రకటించారన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో అర్హులున్న వారికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. అనేక ప్రజా ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వం రుణమాఫీని ప్రకటించిందని గుర్తు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న లెల్లెల బాలకృష్ణ

రైతుల్లో పెరుగుతున్న అశాంతిని నివారించేందుకు తక్షణమే రుణమాఫీ పథకాన్ని అర్హులైన రైతులకు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రేషన్ కార్డులు, ఆధార్ కార్డులతో సంబంధం లేకుండా రెండు లక్షల లోపు రుణమాఫీ చేయాలన్నారు. ఇప్పటి వరకు రుణమాఫీ పొందిన వారికి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న రెవిన్యూ కార్యాలయాల వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు. రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎంఎ చౌదరి, వెలుమల వెంకటాచారి, హిందూరి సులోచన, రజియా సుల్తానా, గర్వందుల రమేష్, మల్యాల సురేష్, సిరికొండ చంద్రయ్య కోమటి చంద్రశేఖర్, ఎండి రఫీక్, బచ్చల వినోద్, లింగంపల్లి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులో తల్లిదండ్రుల పాత్ర కీలకం

కరస్పాండెంట్ మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-రాయికల్

విద్యార్థులు చదువులో రాణించాలంటే తల్లిదండ్రుల పాత్ర కీలకమని గ్రీన్ వుడ్ హై స్కూల్ కరస్పాండెంట్ మిట్టపెల్లి మహేష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని అన్నారు. రోజులో కొంత సమయాన్ని తమ పిల్లల కోసం కేటాయించాలని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే తల్లిదండ్రులు తమ వంతు పాత్ర పోషించాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పిల్లల



పట్ల అనుకూల వైఖరి ప్రదర్శిస్తూ సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాలని, ప్రతి దినం ఒక గంట పిల్లలతో మాట్లాడుతూ వారు చేసే పనులను గమనిస్తూ వారి అభిరుచికి అనుగుణంగా తల్లిదండ్రులు పిల్లలను సన్నద్ధం చేయాలని, దాని కనుగుణంగా కృషి చేయాలని తల్లిదండ్రులను కోరారు.



కంటి ఆపరేషన్లకు కరీంనగర్‌కు వెళ్తున్న గ్రామస్తులు

ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-కోరుట

మండలంలోని ఐలాపూర్ గ్రామంలో రేకుర్తి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్ దీకొండ రాజ్ నరయ్య మాట్లాడుతూ.. శిబిరంలో సుమారుగా 200 మంది హాజరవుగా అందులో 85 మందికి కంది ఆపరేషన్ అవసరం అని వైద్యులు సూచించారు. వారిని కరీంనగర్ రేకుర్తి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో అశోక్ ప్రవీణ్ కిరణ్, వేణుమూర్తి, రమేష్, సంతోష్ ,గోనే చంద్ర ప్రకాశ్, తొగిటి శ్రీనివాస్,తాటికొండ విశాల్, వెంకట స్వామి, కిరణ్, నరేష్, రాజలింగం పాల్గొన్నారు.

పల్లెలకు పాకిన మొబైల్ 'వాణిజ్యం'

- సరళతరమైన కొనుగోలు విధానం
- ధరలు తక్కువ ఉండడంతో కొనుగోలుకు మొగ్గు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలకు చెందిన తిరుపతి నాలుగేళ్ల కిందటి వరకు కూరగాయలు, నిత్యావసర సరకులు, ఇలా ప్రతీది ప్రత్యక్షంగా కొనుగోలు చేసేవారు. కరోనా తదనంతర పరిస్థితుల్లో అరచేతిలో ఇమిడే ఫోన్‌తో సులువుగా కొనుగోళ్లు చేస్తున్నారు. తద్వారా సమయం, డబ్బు ఆదా చేసుకున్నట్లయింది. ఒకప్పుడు. ఆన్‌లైన్ ఆర్డర్లు నగరాలకే పరిమితం. ఇప్పుడు.. పల్లెలకూ వ్యాపించింది. ఈ-కామర్స్ సంస్థల విస్తృతి.. ఇంట్లో కాలు కదపకుండా కొనుగోళ్లు చేసే విధానం. ఒకేసారి అనేక రకాలు, నచ్చిన వస్తువులు సులువుగా పొందే వెసులుబాటు రావడంతో ఆన్‌లైన్ కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వినియోగించుకోవడం విశేషం. చేతిలో ఫోన్ ఉంటే సరిపోతుంది. గతంలో మహానగరాలకే పరిమితం కాగా, ఇప్పుడు పట్టణాలు, పల్లెల్లకూ ఈవిధానం పాకింది. జిల్లాలో ఆన్‌లైన్ కొనుగోళ్ల ట్రెండ్ కొత్త పుంతలు తొక్కుతుంది.

ఆన్‌లైన్ వ్యాపారం.. పల్లెలను తాకిన తరుణంలో పట్టణాలు వేదికలుగా మారుతున్నాయి. పెన్ను, పుస్తకం మొదలు.. ల్యాప్టాప్ల వరకు.. ఇంట్లో అవసరమైన అన్ని వస్తువులు.. వ్యాపారాల నిర్వహణకు ఉపకరించే సామగ్రి. గృహోపకరణ, వస్త్ర, యంత్ర, సాంకేతిక సామగ్రి కొనుగోలుకు.. వివిధ ఈ-కామర్స్ సంస్థలు వేదికలుగా నిలుస్తున్నాయి. ఆయా సంస్థలకు అనుబంధంగా జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాల్లో కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు సైతం వెలిశాయి. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాలకు సేవలు అందిస్తున్నాయి. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి లభిస్తోంది. నిర్వాహకులు ద్విచక్ర వాహనాలున్న వారిని నియమించుకుంటున్నారు.

అధికంగా యువత...

ఫోన్, అనుబంధంగా నెట్ ఉంటే చాలా ప్రపంచాన్ని చుట్టేయొచ్చు. నచ్చిన సామగ్రి..ఉపకరణాలను ఇట్టే కొనుగోలు చేయవచ్చనది నేటియువత మాట. కరోనా ముందు.. ఆ తర్వాత చూస్తే.. గణనీయ మార్పులు చోటుచేసుకున్నాయి.



ఎక్కువగా యువత ఈ తరహా కొనుగోళ్లపై దృష్టి సారిస్తున్నారు. అత్యధిక శాతం ఇంట్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఉపయోగపడే ప్రతి వస్తువు కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్ కొనుగోళ్లల్లో తప్పుడు సైట్లతో జాగ్రత్తగా వ్యవహరించాలి. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రముఖ సంస్థలను ఎంచుకోవడం ఉత్తమం. బహిరంగ విపణి, సదరు సైట్ ధర వ్యత్యాసాన్ని పోల్చుకోవాలి. కొన్ని సైట్లలో తక్కువ ధర అంటూ మోసం చేస్తున్నారు. రివ్యూను పరిగణనలోకి తీసుకోవాలి. తక్కువ ధర అంటే..ముందుగా ఆలోచించాలని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. అంతర్జాలం పని చేసే చోట, పిన్ కోడ్ ఉన్న ప్రతి ప్రాంతానికి నచ్చిన వస్తువు ఇంటికే చేరుతుంది. విద్యావంతులు, మహిళలు, వివిధ వ్యాపార సంస్థలు ఆన్‌లైన్ వైపు మళ్లుతున్నారు. చిన్నపాటి వస్తువులకు వినియోగం చేస్తున్నారు.

వెలసిన ఏజెన్సీలు ...

జిల్లాల ప్రముఖ ఈ కామర్స్ సంస్థలకు అనుబంధంగా కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు కొనసాగుతున్నాయి. పలు సంస్థలకు అనుబంధంగా శాఖల వారీగా సేవలు అందుతున్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు మెట్‌పల్లి, కోరుట్ల, వివిధ మండలాలలో సైతం పలు రకాల ఆన్‌లైన్ కొరియర్ సంస్థలు ఉన్నాయి. జిల్లాలోని 380 గ్రామాలలో సైతం వినియోగ దారులు ఆయా సంస్థల ద్వారా సేవలు పొందుతున్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే, కుంగ్ ఫూ పోటీలలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే, కుంగ్ ఫూ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచిన జగిత్యాల కుంగ్ ఫూ విద్యార్థులను జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అభినందించారు. మన్విత 2 గోల్డ్ మెడల్స్, మణిదీప్ 2 గోల్డ్ మెడల్స్, అన్విత 1 గోల్డ్ 1 సిల్వర్, లోకేష్ 1 సిల్వర్ 1 బ్రాన్జ్ మెడల్స్ సాధించారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతి



వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ ప్రయివేట్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

రాష్ట్ర వ్యాప్తంగా వోకేషనల్ కళాశాల విద్యార్థులకు నాలుగు సంవత్సరాల నుంచి ఎటువంటి స్కాలర్‌షిప్ ఎంటిఎఫ్, ఆర్‌టిఎఫ్ నిధులను విడుదల చేయలేదని సిబ్బంది జీతాలు, కళాశాల భవనం అద్దెలు చెల్లించడంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని తెలంగాణ ప్రైవేట్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ మెంబర్స్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వివరించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్క రించాలని ఎమ్మెల్సీని కోరారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు



దీకొండలో రహదారిపై నిలిచిన నీరు

నవతెలంగాణ-పెగడపల్లి

మండల పరిధిలోని ల్యాగలమర్రి నుంచి దీకొండ మీదుగా పెగడపల్లి వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలవడంతో రోడ్డు చెరువును తలపిస్తుంది. గుంతల మయమైన రోడ్డుపై నీరు నిలవడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన రైతు బజార్ హమాలీ సంఘం సభ్యులు



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల రైతు బజార్‌లో హమాలీ కూలీలకు ప్రత్యేక గదిని కేటాయించగా సోమవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను హమాలీ సంఘం సభ్యులు కలిసి శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
రాజన్న సిరిసిల్ల
మంగళవారం | ఆగస్టు 27, 2024 | www.navatelangana.com


ముస్తాబాద్ పాఠశాలల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


సిరిసిల్ల రూరల్: శ్రీ శబరి విద్యానికేతన్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు


సిరిసిల్ల రూరల్ : వెంకట్రావునగర్‌లోని విజ్ఞాన్ హై స్కూల్లో...


వేములవాడ : శ్రీ సరస్వతి శిశుమందిర్ స్కూల్‌లో...


ముస్తాబాద్: మహర్షి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో...

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండల వ్యాప్తంగా ప్రజలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ముస్తాబాద్‌లోని మహర్షి ఇంగ్లీష్ మీడియం పాఠశాల పిల్లలు కృష్ణుడు, గొల్లభామల వేషధారణ ఆటపాటలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్ జలజ రామ్‌మనోహర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : పట్టణంలోని పలు పాఠశాలలో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ శబరి విద్యానికేతన్, ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్లో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు గోపికమ్మ కృష్ణుని వేషధారణలో అలరించారు. వేడుకల్లో శ్రీ శబరి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ యేల్లే శ్రీనివాస్, ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్లో కరస్పాండెంట్ రాజకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేరళ పాఠశాలలో ..

నవతెలంగాణ - రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలోని కేరళ గ్లోబల్ హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణం నుండి ఇంద్రచౌక్ వరకు శోభాయాత్రను నిర్వహించారు. ఇందిరా చౌక్‌లో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ బాబు నంబియార్, ప్రిన్సిపాల్ లతిక, పాఠశాల ఇన్‌చార్జి నరికే విజయ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ హైస్కూల్ లో ...

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా వెంకట్రావునగర్‌లోని విజ్ఞాన్ హైస్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ బొద్దుల సుదర్శన్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు గెంట్యాల భూమేష్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ...

కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల ప్రిన్సిపాల్ రాజురెడ్డి పాల్గొన్నారు.

శ్రీ సరస్వతి శిశు మందిర్ లో...

నవతెలంగాణ - వేములవాడ : వేములవాడ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో చిన్నారులు అందరు గోపికలు, శ్రీకృష్ణులుగా మారి ఆడి పాడారు. పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ మనోహర్, ప్రధాన ఉపాధ్యాయుడు, సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.


సిరిసిల్ల రూరల్: గోపికల వేషధారణలో చిన్నారులు


సిరిసిల్ల రూరల్: ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్ లో


సిరిసిల్ల రూరల్: శ్రీ కష్ణవేణి టాలెంట్ స్కూల్లో...


రుద్రంగి: కేరళ గ్లోబల్ హైస్కూల్‌లో...

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


డబ్బులు అందజేస్తున్న స్నేహితులు

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన ఎండి. రంజాన్ తండ్రి కొన్నిరోజుల క్రితం చనిపోయాడు. ఈ బాధనుండి తేరుకోకముందే రంజాన్ భార్య, తల్లి ఇద్దరు కూడా అనారోగ్యానికి గురయ్యా రు. వారిది చాలా నిరుపేద కుటుంబం కావడంతో తీవ్ర మనోవేదనలో ఉన్న విషయం తెలుసుకున్న 2001-02 పదోతరగతి బ్యాచ్ స్నేహితులంతా కలిసి రంజాన్‌ను ఓదార్చి అండగా ఉంటామని తెలిపారు. అందరు కలిసి రూ.30వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొండని బాలకిషన్, మురికి భానుచందర్, కటికె నవీన్, కంచం శ్రీనివాస్, జంగబాలకిషన్ పాల్గొన్నారు.

కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ సేవాసమితి అధ్యక్షుడుగా నర్సింలు


నియామక పత్రం అందుకున్న నర్సింలు ముదిరాజ్

నవతెలంగాణ - గంభీరావుపేట : మండలంలోని లింగన్నపేట గ్రామానికి చేందిన నారాయణరావు పేట నర్సింలు శ్రీ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షుడిగా నియమితులయ్యారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శ్రీ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహ ఆవిష్కరణలో భాగంగా సేవా సమితి సిరిసిల్ల నియోజకవర్గం అధ్యక్షుడిగా నర్సింలును నియమిస్తూ రాష్ట్ర సమితి అధ్యక్షుడు పిట్ల నగేష్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోడేటి సత్యం ముదిరాజ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పలు జిల్లాల అధ్యక్షులు, కొంతం శ్రవణ్, పిడుగు నర్సింలు, దేశాయిపేట దేవయ్య, బీమారి నరేష్, తోడెంగల నవీన్, పడిగే ప్రశాంత్, పిట్ల శ్రీను, చెంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : శాంతియుతంగా వినాయక నవరాత్రులు, నిమజ్జనం జరుపుకోవాలని ఎల్లారెడి పేట సీఐ బి.శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్ వినాయక మండపాల నిర్వాహకులను కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయి శివ గార్డెన్‌లో సోమవారం మండలంలోని అన్ని గ్రామాల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మండపాల నిర్వహకులు ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా, పోలీసు శాఖ నిబందనల మేరకు వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. డీజేలకు అనుమతి లేదని, ఉల్లంఘిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో గంభీరావుపేట ఎస్ఐ రాంమోహన్, వీర్నపల్లి ఎస్ఐ ఎల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన వ్యవసాయధికారికి సన్మానం


సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల వ్యవసాయధికారిగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై వెళ్లిన చాడ భూంరెడ్డిని సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు గుల్లపల్లి నర్సింహరెడ్డి, సీత్యా నాయక్, దేవానందం, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా డీజేలు నిర్వహించవద్దు


బైండోవర్ చేస్తున్న ఎస్సై

నవతెలంగాణ - వీర్నపల్లి : రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలకు డీజే అనుమతులు లేవని ఎస్ఐ ఎల్లయ్యగౌడ్ అన్నారు. వీర్నపల్లి పోలిస్ స్టేషన్‌లో డీజే యజమానులతో ఎస్ఐ సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగానే డీజే ఓనర్‌లను బైండోవర్ చేసినట్టు చెప్పారు.

ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ - వీర్నపల్లి : ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రెండు లక్షల వరకు రుణ మాఫీతోపాటు రైతు భరోసా ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట రైతు సంఘం నాయకులు పర్శయ్య, చంద్రయ్య, రాజం పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన కలిగి వుండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై.

నవతెలంగాణ - వీర్నపల్లి : పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎల్లయ్య గౌడ్ అన్నారు. వీర్నపల్లి మండలంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం బాలికల లైంగిక వేధింపుల నివారణ, పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ మహిళా భద్రత, రక్షణ కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. మహిళలు, విద్యార్థుల్లో భరోసా కల్పించడం కోసం షీ టీం ఏర్పాటు చేశారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యం, పట్టుదలతో కష్టపడి చదవాలన్నారు. సంకల్పంతో చదివితే ఉద్యోగాలు తప్పకుండా వరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో నీలిమ, కానిస్టేబుల్ మల్లగౌడ్, సిబ్బంది ఉన్నారు.

విషజ్వరంతో వృద్ధుడు మృతి


లక్ష్మారెడ్డి ఫైల్ ఫోటో

నవతెలంగాణ - కొనరావుపేట : కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మారు లక్ష్మారెడ్డి(74) విష జ్వరంతో బాధపడుతూ మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మారు లక్ష్మారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారం రోజుల నుండి జ్వరంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఆర్ఎంపి వద్ద చికిత్స తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య జనవ్వ కుమారుడు తిరుపతి, కూతురు రమణ ఉన్నారు.

హైదరాబాద్‌లో లింగంపేట యువతి మృతి


రమ్య (ఫైల్)

నవతెలంగాణ - చందుర్తి : మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన యువతి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు లింగంపేటకు చెందిన కొనతల రమేష్-ప్రమీల కూతురు రమ్య (22) హైదరాబాద్‌లో ప్రయివేట్ ఉద్యోగం చేస్తుంది. సోమవారం మధ్యాహ్నం కార్యాలయం నుండి తన ద్విచక్ర వాహనంపై రూమ్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో వెనకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమ్య అక్కడికక్కడే మృతి చెందింది. యువతి మృతితో లింగంపేట గ్రామంలో విషాదం నెలకొంది.

శాంతియుత వాతావరణంలో పండగను జరుపుకోవాలి

వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్


నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న సిఐ

నవతెలంగాణ - కోనరావుపేట : మండల కేంద్రంలో వినాయక మండపాల నిర్వాహకులతో పోలీసులు సమావేశం ఏర్పాటు చేశారు. వేములవాడ రూరల్ సీఐ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణం లో వినాయక పండుగను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు గ్రామ సమస్యలు పరిష్కరించాలి

మంత్రి పొన్నంకు వినతి



నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలోని గూడూరు గ్రామ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర దళిత యువ నేత చాకలి రాజశేఖర్ హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హులకు ఇండ్లు ఇవ్వాలని, హమాలీ సంఘ భవనం నిర్మించాలని కోరారు.

రాజన్న దేవాలయంలో అంతర్గత బదిలీలు

నవతెలంగాణ - వేములవాడ : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో కొన్ని రోజుల క్రితం అవినీతి ఆరోపణ నైపథ్యంలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తాజాగా సోమవారం దేవాలయంలోని 20మంది ఆలయ ఉద్యోగులను ఈవో వినోద్ రెడ్డి అంతర్గత బదిలీలను చేశారు. ప్రధానంగా గోదాం సరుకుల నిలువలో వ్యత్యాసం జరిగాయని గోదాం పర్యవేక్షకుడు వరి నర్సయ్యను ఆ శాఖ నుండి సానిటేషన్ విభాగానికి బదిలీ చేశారు. అలాగే కళ్యాణకట్టలోని భక్తుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలతో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు రికార్డు అసిస్టెంట్లను, ఒక పరిచారికను కూడా ఇతర శాఖలకు బదిలీ చేశారు. ముగ్గురు పర్యవేక్షలతో పాటు తొమ్మిది మంది సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు రికార్డ్ అసిస్టెంట్లను, ఒక పరిచారికతో కలిపి 20 మంది ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. దేవాలయంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఉద్యోగులను ఈవో హెచ్చరించినట్లుగా దేవాలయాలు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. భక్తుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి, కోపతాపాలు ప్రదర్శిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించినట్లుగా సమాచారం.

ఎస్‌జీటీలకు ప్రమోషన్లు కల్పించాలి

నవతెలంగాణ - చొప్పదండి : ఖాళీ కాబోతున్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులలో ఎస్‌జీటీలకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలని ఎస్‌జీటీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఆలుమల్ల అనిల్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామదాసు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిహెచ్ఎం లెఫ్ట్ ఓవర్ ప్రమోషన్లలో ఇస్తున్న కారణంగా, వారి సబ్జెక్టు ఉపాధ్యాయులు పాఠశాలలో లేకపోవడం వల్ల బడుగు బలహీన వర్గాల పిల్లలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌జీటీలతో తగు సబ్జెక్ట్‌లలో రెస్పెక్టివ్, సబ్జెక్ట్‌లలో ప్రమోషన్లతో నింపాలి అన్నారు. 70శాతంలో 200పైచిలుకు పోస్టులలో వెంటనే ఎస్‌జీటీలకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు.

బీసీ గణనను ప్రారంభించాలి

నవతెలంగాణ - శంకరపట్నం : జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఫలాలు అందాలంటే కుల గణన చేపట్టడం అత్యంత ఆవశ్యకరమైనదని జాతీయ బీసీ సంఘం మండల అధ్యక్షుడు బొంగోని అభిలాష్ గౌడ్ అన్నారు. సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని, అలాగే కుల గణన చేపట్టిన తర్వాత ఫలితాల ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ బీసీలకు అమలు చేసిన తరువాతే సార్వత్రిక ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. రజక సంఘం మండల అధ్యక్షుడు తాటిచెర్ల తిరుపతి, వడ్డెర సంఘం శివరాత్రి శ్రీనివాస్, మైనారిటీ ఆరిఫ్, సంపత్ ముదిరాజ్, సాగర్ పాల్గొన్నారు.

లేబర్ వెల్ఫేర్ సంక్షేమ బోర్డు ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకుందాం

నేడు చలో కలెక్టరేట్‌కు సీఐటీయూ పిలుపు


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమాటి ఎల్లారెడ్డి

నవతెలంగాణ - వేములవాడ :

లేబర్ వెల్ఫేర్ సంక్షేమ బోర్డు ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకునేందుకు ఈ నెల 27న చేపట్టే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఎగమాటి ఎల్లారెడ్డి కోరారు. వేములవాడలో సోమవారం ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న లేబర్ వెల్ఫేర్ బోర్డును ఇప్పటిదాకా ప్రభుత్వ ఆధీనంలో నడిపిస్తూ కొన్ని లక్షల మంది కార్మికులకు లబ్దిపొందారని అన్నారు. దాన్ని ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెప్పే ఆలోచనను విరమించుకోవాలని, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న భవనిర్మాణ కార్మికులందరూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు ఉదయం 10.30గంటల వరకు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా భవన నిర్మాణరంగ సహాయ కార్యదర్శి గురజాల శ్రీధర్, సీఐటీయూ జిల్లా నాయకుడు గుర్రం అశోక్, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం

సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్


బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - సిరిసిల్ల :

ప్రజల వద్ద నుండి స్వీకరించిన ప్రతి ఫిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం ఉదయం10గంటల నుండి 3గంటల వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తామని సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 12 ఫిర్యాదులు స్వీకరించామని తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తూ శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు


మాట్లాడుతున్న పంతం రవి

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :

అకారణ విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడు లేని విధంగా సెస్ పాలకవర్గం, అధికారులు అకారణంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి, ముఖ్యంగా 15రోజులనుండి తరుచూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని వాపోయారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోమలతో విష జ్వరాల బారిన పడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ కక్షలతో జనాలను ఇబ్బంది పెట్టడం సరైనంది కాదన్నారు. సెస్ పాలకవర్గం వెంటనే తన విధానాలను మార్చుకోకపోతే పెద్ద ఎత్తున కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా బివై నగర్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అజ్జ వేణు,అ డిచర్ల రాజు, సదానందం, ఎగుర్ల మల్లయ్య, గాజుల లింగం పాల్గొన్నారు.

స్పార్క్ కుంగ్ ఫూ, కరాటే అకాడమీ విద్యార్థుల ప్రతిభ



స్పార్క్ కుంగ్ ఫూ.కరాటే అకాడమీ విద్యార్థులు

నవతెలంగాణ - వేములవాడ రూరల్ :

కరీంనగర్‌లో ఇంటర్నేషనల్ షాలిన్ కుంగ్ ఫు వారు కుంగ్ ఫు, కరాటే చాంపియన్‌షిప్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి స్పార్క్ కుంగ్‌ఫు, కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతుల అందుకున్నారు. 28 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది బహుమతులు సాధించారు. సీనియర్ బ్లాక్ బెల్ట్ విభాగంలో లత గోల్డ్ మెడల్, బ్రౌన్ బెల్ట్ విభాగంలో గగ్గురి రోషిని సిల్వర్ మెడల్, హంసిని గోల్డ్ మెడల్, బాయ్స్ విభాగంలో సాయితేజ గోల్డ్ మెడల్ సాధించారు. కలర్ బెల్ట్స్ విభాగంలో శ్రీనిధి, చరణ్య, నమస్య, మన్విత, మధుమిత, శరత్ చంద్ర, యశ్వంత్ కుమార్, సిధాంత్ గోల్డ్ మెడల్స్ సాధించారు. చైతన్య, శ్రీవైష్ణవి, శ్రీనిధి, రిష్మిక, చరత్‌చంద్ర సిల్వర్ మెడల్స్, శ్రీహన్సి, భావన, శ్రీవైష్ణవి, చైతన్య బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరిని మాస్టర్ వోడ్యాల శ్రీనివాస్, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-జూలపల్లి
జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన దేవరాని సంకీర్తన (23)అనే యువతి సోమవారం ఇంట్లో ఉరేసుకుని మృతిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఫిబ్రవరి నెలలో తన తల్లి సత్తమ్మ మరణించడంతో సంకీర్తన మానసికంగా ఇబ్బంది పడుతూ తండ్రితో స్నేహితులతో తల్లి లేకుండా నేను బతకలేనని బాధపడేదని స్నేహితులు తెలిపారన్నారు. మృతి తండ్రి వేంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూలపల్లి ఎస్సై ఎన్.శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతిరాలికి ఇంకా వివాహం కాలేదు. మృతురాలి తండ్రి కరీంనగర్ లోని ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు.


సంకీర్తన ఫైల్ ఫొటో


ఉరి వేసుకున్న యువతి

గొప్ప సంఘ సంస్కర్త మధర్ థెరిస్సా

నవతెలంగాణ-గోదావరిఖని:

అసాధారణ జీవితాన్ని గడిపిన గొప్ప సంఘ సంస్కర్త మధర్ థెరిస్సా నియోజకవర్గ ఐక్య స్వచ్ఛంద సంఘాల అధ్యక్షులు మంచికట్ల దయాకర్, మద్దెల దినేష్, సుద్దాల అనురాజులు అన్నారు. మదర్ థెరిస్సా 114వ జయంతిని పురస్కరించుకొని సోమవారం రామగుండం తాబిత ఆశ్రమంలోని మధర్ థెరిస్సా విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోని అత్యంత పేద, అత్యంత బలహీనమైన ప్రజల కోసం మదర్ థెరిస్సా యొక్క జీవితకాల అంకితభావం లెక్కలేనన్ని మిలియన్ల మందికి స్ఫూర్తినిచ్చిందని అన్నారు.

మధుప్రియ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-గోదావరిఖని:

గాయని మధుప్రియ పుట్టిన రోజు సందర్భంగా జ్యోతిగాంధీ ఫౌండేషన్ నిర్వహణలో ఆమె సోదరీ మణులు సుప్రియ, శృతిప్రియ పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. గోదావరి ఖని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రగతి నిరాశ్రయ కేంద్రంలోని నిస్సాయులకు బియ్యాన్ని అందించారు. స్థానిక స్వతంత్ర చౌక్‌లో నిరుపేద కుటుంబాలకు చెందిన వద్ద మహిళలకు పాకెట్ మనీ అందించారు. ఫౌండేషన్ కార్యనిర్వాహకుడు దయానంద్ గాంధీ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో సీనియర్ కళాకారుడు దామెర శంకర్, పలు పక్షాల బాధ్యులు భూషణ్ గౌడ్ తదితరులున్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే :ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఓదెల

ఓదెల మండలం కనగర్తి గ్రామం లోని కేశవనగర్ ప్రాంతంలో సోమవారం 5 లక్షల రూపాయలు ఎస్డీఎఫ్ నిధుల నుండి అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణానికి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణా రావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కనగర్తి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాననన్నారు.ఏక కాలంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ ప్రకటించిన ప్రకారం 2 లక్షల రుణమాఫీ హామీకి కట్టుబడి ఉండి రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు లక్షల రుణమాఫీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, పెద్దపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు చోప్పరి రాజయ్య పాల్గొన్నారు.

పంటల తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-ఓదెల

ఓదెల మండలంలోని బాయమ్మ పల్లి గ్రామంలోని శివ శ్రీ ఫంక్షన్ హాల్లో యూపీఎల్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో రీజనల్ సేల్స్ మేనేజర్ రంజిత్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్,ఫీల్డ్ అసిస్టెంట్ శ్రావణ్ పాల్గొని కంపెనీ ఉత్పత్తులు ఉలాల,సాఫ్,అపాచీ,కెవ్వక, స్వీప్, పవర్ గురించి వరి, పత్తి,మొక్కజొన్న పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.

పదవీ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-రామగిరి

ఆర్జీ-3 ఏరియా సెక్యూరిటి అధికారిగా నియమితులైన అబ్దుల్ షబ్బీరుద్దీన్ ఆర్జీ-3 ఏరియా జనరల్ మేనేజర్ ఎస్.సుధాకర రావుకు రిపోర్ట్ చేసి బాధ్యతలను స్వీకరించారు. అబ్దుల్ షబిరుద్దీన్ ఇంతకు ముందు మణుగూరు ఏరియా సెక్యూరిటీ అధికారిగా పనిచేసి ఆర్జీ-3 ఏరియాకు బదిలీపై వచ్చారు.

పరామర్శ

నవతెలంగాణ-రామగిరి

రామగిరి మండలం బేగంపేట గ్రామంలో రేగళ్ల రాజయ్య అనారోగ్యంతో మరణించగా ఆయన కుమారులు రేగళ్ల మొండయ్య, రేగళ్ల మధు కుటుంబ సభ్యులను పరామర్శించిన ముత్తారం మండల మాజీ జడ్పీటీసీ మైదం భారతి వరప్రసాద్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ ఆదివారంపేట గ్రామ శాఖ అధ్యక్షులు మైదం బుచ్చయ్య, మడిపల్లి సదానందం, మాజీ ఉపసర్పంచ్ అట్టె తిరుపతి రెడ్డి, పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్‌సీఈయూ ఆర్జీ-1 బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగిన ఎనిమిది నెలలు గడిచినా పరిష్కారం కానీ ఏ ఒక్క సమస్య కాలేదని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆర్జీ-1 బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ఆరే పల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్ అన్నారు. సింగరేణి ఆర్జీ-1 పరిధి లోని జీడీకే -2, జీడీకే ఓసీపీ-5, ఏరియా వర్క్ షాప్‌లో ఉదయం 9గంటలకు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20 నుంచి 28 వరకు దశల వారీగా చేపట్టిన ఆందోళనల్లో భాగంగా 13 డిమాండ్లపై కార్మికుల సంతకా లతో కూడిన వినతి పత్రాలను సోమవారం మెనేజర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు యాజమాన్యం, గుర్తింపు సంఘం కలిసి పరిష్కారించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు అయిపోయినా కూడా ఇంత వరకు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం, యజమాన్యంతో గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు చర్చించడం లేదని, గత ఆర్థిక సంవత్సరం వాస్తవ లాభాలు ప్రకటింపజేసి, జులై నెలలో వాటా ఇప్పిస్తామని చెప్పిన గుర్తింపు సంఘం ఇప్పటివరకు కూడా లాభాల వాటపై మాట్లాడలేదని అన్నారు. ఇదే కాకుండా ఎన్నికల ముందు అన్ని కార్మిక సంఘాల వాగ్దానం మేరకు కార్మికుల సొంతింటి పథకం అమలు, అలవెన్స్, ఇన్‌కమ్ టాక్స్ వాపస్ చేయడం, ఎస్అండ్‌పీసీ ప్రమోషన్లలో ఇంక్రిమెంట్ ఇవ్వకపోవడం, ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లలో నష్టం కలిగించడం, సీఎంపీఎఫ్ చిట్టీలు అందించడంలో నిర్లక్ష్యం వడ్డీ రేటు తగ్గించడం, 190/240 మాస్టార్లు నిండిన బదిలీ వర్కర్లను పర్మినెంట్ చేయకపోవడం, తదితర అనేక దీర్ఘకాలిక సమస్యలు పెండింగ్‌లో ఉన్నందున సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ పోరాట శంఖారావం పూరించిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు ఆరేపల్లి రాజమౌళి, మెండే శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎస్కే గౌస్, వంగల రాములు, సిహెచ్.వేణుగోపాల్ రెడ్డి, పి.శ్రీని వాస రావు, పి.రాజేశ్వర చారి, యం.రాజేశ్వర రావు, గని పిట్ కార్యదర్శులు ఏ.శంకరన్న, ఈద వెంకటేశ్వర్లు, నంది నారాయణ, అక్కపాక సంపత్, పులి ఈశ్వర్ తదితరులున్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ

రామగుండం నియోజక వర్గం 8వ కాలనీ 18వ డివిజన్‌కు చెందిన ఆడెపు వెంకటేశ్వర్లు కు సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కును రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ అందజేశారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల బాగు కోసమే తాను పని చేస్తున్నానని గత ప్రభుత్వాల కంటే మెరుగ్గా, పారదర్శకంగా పాలన అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మారెల్లి రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు గుండెటి రాజేష్ తదితరులు ఉన్నారు

ఓసీపీ-1లో గేట్ మీటింగ్

నవతెలంగాణ యైటింక్లయిన్ కాలనీ

ఓసీపీ-1 సైట్ ఆఫీస్‌లో సోమవారం ఐఎన్టీయూసీ కేంద్రకమిటీ నాయకులు గడ్డం తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు.ఈ సమావేశానికి సీనియర్ ఉపాధ్యక్షులు యస్ నర్సింహారెడ్డి, ఆర్జీ-3 ఉపాధ్యక్షులు కోట రవీందర్‌రెడ్డి హాజరై కార్మికుల సమస్యలపై మాట్లాడారు. డిపెండెంట్ వయస్సు 35నుండి40 పెంపు ఘనత ఐఎన్టీయూసీకే దక్కుతుందని, ఒరిస్సా నైనీబ్లాకును ఉపముఖ్యమంత్రి చొరవతో సింగరేణి సంస్థద్వారా పనులను వేగవంతం చేయడం జరిగిందని, తాడిచెర్ల బ్లాకు2 ను కూడా సింగరేణి ద్వారానే నడుపుతామని,కార్మికుల సమస్యలన్నింటిని నెరవేర్చే కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గని పిట్ కార్యదర్శి జివెంకటస్వామి, నాయకులు జేడిరావు, కొలిపాక సారయ్య,సదానందం, ముప్పిడి శ్రీనివాస్, యం.ప్రభాకర్ రెడ్డి, జక్కుల చంద్రయ్య, పాల్గొన్నారు.

శిశు మందిర్ పాఠశాలకు 50 వేల విరాళం

నవతెలంగాణ-మంథని

మంథని శిశు మందిర్ పాఠశాల వెంటిలేటర్స్ కొరకు శిశు మందిర్ పాలకవర్గం కార్యదర్శి మాడిశెట్టి సురేందర్ వినతి మేరకు కొత్త రామయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వాకులు 50వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. కొత్త రామయ్య జ్ఞాపకార్థం పైన కొత్త రామయ్య చారిట బుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి భవిష్యత్తులో చదువుకునే విద్యార్థిని,విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్ గుప్త,కొత్త సత్యనారాయణ,బొడ్డు వెంకటేష్,తూర్పాటి రాము,పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజా పాలనలో సంక్షేమానికి పెద్దపీట

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తెలంగాణలోని ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో పెద్ద పీట వేస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. సోమవారం గోదావరిఖ నిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రామగుండం, అంతర్గాం, పాల కుర్తి మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పంపిణీ చేశారు. రామగుండం మండలానికి చెందిన 108 మంది లబ్ధిదారులకు 45లక్షల రూపాయల, పాలకుర్తి మండలానికి చెందిన 32 మంది లబ్ధిదారులకు 8లక్షల76వేల రూపాయల, అంతర్గాం మండలానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు 8లక్షల 2వేల రూపాయల మొత్తం 61లక్షల 70వేల విలువజేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో సంక్షేమ పాలనే కాకుండా ఇతర రాష్ట్రాల కంటే అభివృద్ధి మరింత వేగంగా దూసుకుపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహాంకాళి స్వామి, నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, యైటింక్లయిన్‌కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, కార్పొరేటర్లు పెద్దెల్లి తేజశ్వి ప్రకాష్, బాలరాజ్‌కుమార్ తదితరులున్నారు.

35 శాతం లాభాల వాటా వెంటనే ప్రకటించాలి


వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-రామగిరి
35 శాతం లాభాల వాటా సొంతింటి కల, పెర్క్ మీద ఇన్కమ్ టాక్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-2 గని ఎస్ఓఎం కు సీఐటీయూ నాయకులు వినతి పత్రం ఇచ్చారు ఈ సందర్భంగా ఏరి యా బ్రాంచ్ సెక్రటరీ దోమటి కొమరయ్య మాట్లాడుతూ సింగరేణిలో దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం సింగరేణి వ్యాప్తంగా సీఐటీయూ ఆందోళనలో భాగంగా ప్రధాన సమస్యలైన 2023-24 లాభాలను వెంటనే ప్రకటించి 35 శాతం లాభాల వాటా కింద కార్మికులకు చెల్లించాలని అన్నారు. అదేవిధంగా వెహికిల్ షెడ్ రిపేర్ చేయాలని, డ్రింకింగ్ వాటర్ వాల్స్ మురుగు కాలవలో ఉన్నయని వాటిని మార్చాలని, మాన్వే,రెస్ట్ షెల్టర్, ల్యాంప్ రూమ్‌లు బురద, మురుగు నీటిని నివారించాలని సమస్యలపై ప్రాజెక్ట్ గనిమీద కార్మికుల సంతకా లతో కూడిన వినతిపత్రాన్ని గని ఎస్ఓఎం వెంకట రామారావుకు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులుఈ కుమార్, ఎం.వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, పాల్గొన్నారు.

సింగరేణి భవిష్యత్ కోసం కాంగ్రెస్,ఐఎన్‌టీయూసీ కృషి

ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి

నవతెలంగాణ-గోదావరిఖని:

మాట్లాడుతున్న ధర్మపురి

సింగరేణి భవిష్యత్, కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి అన్నారు. సింగరేణి ఆర్జీ 1 పరిధిలోని జీడీకే-2వ ఇంక్లైన్ గనిలో ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కచ్చకాయల సదానందం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ ప్రసాద్ నాయకత్వంలో కార్మిక వర్గానికి ఎన్నికలప్పుడు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ప్రభుత్వంతో మాట్లాడి దాదాపు అన్ని నెరవేర్చడం జరుగుతుందని అన్నారు. ఏఐటీయూసీ యూనియన్‌కి కార్మికుల మీద ప్రేమ లేదని, వారికి కేవలం అధికారం కోసమే తాపత్రయపడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు బి.పోషయ్య, గడ్డం కృష్ణ, పెంచాల తిరుపతి, గుండేటి శ్రీనివాస్, బి.జగన్ మోహన్, తదితరులున్నారు.

విష జ్వరాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు

సీతంపేటలో వైద్యం శిబిరం

నవతెలంగాణ-ముత్తారం:

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అమరేందర్ రావు

గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలు తున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీవో ఎం.సురేష్, మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు అన్నారు. ముత్తారం మండలం సీతంపేట గ్రామంలో విషజ్వరాలు ప్రబలు తున్నాయని కొన్ని పత్రికల్లో వచ్చిన ప్రచూరితం కాగా, మండల అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జ్వరపీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. నీటిని నిల్వ చేసే పాత్రలను శుభ్రం చేసి కొత్త నీటిని పట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో నరేష్, మాజీ సర్పంచ్ పులిపాక నగేష్, ఉప సర్పంచ్ జక్కుల ఓదెలు, వైద్య సిబ్బంది ఎంపీహెచ్ఈవో రమేష్, పీహెచ్ఎన్ గ్రేసీమని, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, ల్యాబ్ టెక్నిషియన్ అనిల్ ఉన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలంలోని మచ్చుపేట, మైదంబండ, కేశనపల్లి, పారుపల్లి, అడవీ శ్రీరాంపూర్ గ్రామ పంచాయ తీలో సోమవారం సామాజిక తనిఖీ గ్రామ సభలను చేపట్టారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారుల అధ్యక్షతన ఈ సభలు జరుగగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో జరిగిన పనులను సభల్లో డీఆర్‌పీలు రజిత, రవి, జితేందర్, లక్ష్మణ్, భవానీలు చదివి వినిపించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు తమ పరిశీలనలో గుర్తించిన అంశాలను సభలో వివరించారు. ఉపాధి హామీ పనులకు కూలీలు హాజరైన సంతకాలు, అభ్యంతరాలను, కూలీలు చేసిన పనుల్లో పలు చోట్ల కొలతలు తేడా ఉన్నట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ రాజేశం, కార్యదర్శులు మల్లీశ్వరి, రాజేందర్, సురేందర్, భద్రు, ఫీల్డ్ అసిస్టెంట్స్ రాజ్ కుమార్, శ్రావణ్, పావని, ఓదెలు, రాకేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు

తబిత ఆశ్రమానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-గోదావరిఖని

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, సింగరేణి కార్మిక నాయకుడు మాదాసి బాణయ్య ఏడో వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సతీమణి రాజమ్మ తబిత ఆశ్రమ నిర్వాహకులకు 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని సోమవారం గోదావరిఖనిలో అందించారు. అనాధ పిల్లలను చేరదీసి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్న తబిత ఆశ్రమానికి తోడ్పాటును అందించాలని భావించి ఆర్థిక సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తబిత ఆశ్రమ నిర్వాహ కులు వీరేంద్ర నాయక్, అక్షర ఫౌండేషన్ నిర్వాహకులు బాల్సాని కొమరయ్య, పెద్దపల్లి శ్రీనివాస్, జేవిరాజు,వాసు, మాదాసి రోహిత్, రోహన్ పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు పెద్దపల్లి కార్మికుల చేయూత

సీఐటీయూ ఆధ్వర్యలో రూ.53 వేల విరాళం



నవతెలంగాణ-పెద్దపల్లి :
కేరళలోని వయనాడ్ ప్రాంతంలో ప్రకృతి ఘోరానికి గురైన వారికి తెలంగాణ కార్మికులు అండగా నిలిచారు. సీఐటీయూ పిలుపునకు స్పందించిన పెద్దపల్లి జిల్లా కార్మికులు, ఉద్యోగులు రూ.53,683 విరాళంగా సమకూర్చారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ఒక ప్రకటన విడుదల చేశారు. సేకరించిన నిధులను సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌లకు అందజేసినట్టు తెలిపారు. ఈ మొత్తాన్ని కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి జమచేస్తామని వెల్లడించారు."వయనాడ్‌లో ప్రకృతి వైపరీత్యానికి బలైన కుటుంబాలను ఆదుకునేందుకు ఈ చిన్న ప్రయత్నం చేశాం. ప్రాణనష్టం, గాయాలు, ఆస్తి నష్టం ఎదుర్కొన్న వారికి ఈ నిధి ఊరట కలిగిస్తుందని ఆశిస్తున్నాం" అని ముత్యంరావు పేర్కొన్నారు. సీఐటీయూ విజ్ఞప్తికి స్పందించి విరాళాలందించిన జిల్లాలోని కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, ప్రజలందరికీ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, వంగూరు రాములు పాల్గొన్నారు.

గాంధీచౌక్ గణేష్ ఉత్సవ సమితి
నిర్వహణ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

అధ్యక్షులుగా కొమురోజు చంద్రమోహన్,

కార్యదర్శిగా పెండ్యాల రామ్ కుమార్

నవతెలంగాణ-మంథని

చంద్రమోహన్


రామ్ కుమార్

గాంధీచౌక్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 2024-2026 రెండు సంవత్సరాల కాలపరిమితికి గణేష్ నవరాత్రుల నిర్వహణ కమిటీని సోమవారం గాంధీచౌక్ ఉత్సవ సమితి కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షునిగా కొమురోజు చంద్రమోహన్,ఉపాధ్యక్షులుగా ఓల్లాల వెంకటేశ్వర్లు, రేపాల ఉమాదేవి,కార్యదర్శిగా పెండ్యాల రామ్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా బండారి రాజేశం,ఓల్లాల అశోక్,ఆర్థిక కార్యదర్శిగా సిరిపురం రమేష్, కార్యవర్గ సభ్యు లుగా కొమురోజు వేణు, గుడిమల్ల కుమార్,కొమురోజు మధుకర్, మాడిశెట్టి సురేందర్, ఓద్నాల సహేందర్,రేపాల రమేష్,కొమురోజు సుమన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


రామగుండంలో...


ముత్తారంలో...

నవతెలంగాణ-రామగుండం
శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను పురస్కరించుకొని విశ్వభారతి, నవోదయ, సెయింట్ జోసెఫ్ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యాజమాన్యం ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టె కార్యక్రమం చిన్నారుల కృష్ణ, రాధా గోపిక వేశాధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో విశ్వభారతి స్కూల్ ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్, నవోదయ ప్రధానోపాధ్యాయులు తిరుపతి గౌడ్, సెయింట్ జోసెఫ్ ప్రధానోపాధ్యాయులు నోయల్ జెసెఫ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండల కేంద్రంలోని కస్తూరిభాపాఠశాలలో సోమవారం నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అలరించాయి. శ్రీ కృష్ణ జన్మాస్టమి సందర్భంగా చిన్నారులు శ్రీ కష్ణుని, గోపికల వేషాధారణలతో పాఠశాలలో సందడి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కమల, ఉపాధ్యాయినీలు సంజీవరాణి, సునీత, సుమలత తదితరులున్నారు.

నవతెలంగాణ-ఓదెల
ఓదెల మండలంలోని కనగర్తి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయదానికి విచ్చేసిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. దుష్ట శిక్షణ,శిష్ట రక్షణ కోసం శ్రీకృష్ణుడు అవతరించిన పర్వదినం నేడు అని ప్రజల జీవితాల్లో కష్టాలు తొలగి సుఖసంతోషాలు నిండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కందుల సదాశివ్, మహేందర్‌రెడ్డి, చొప్పర్ రాజయ్య, రమణారెడ్డి,మద్దెల గట్టు యాదవ్,శంకర్, పాల్గొన్నారు.



పెద్దపల్లి టౌన్‌లో...

నవతెలంగాణ-రామగిరి
రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను సాయిబాబా గుడి ఆవరణలో గల శ్రీరామ-సాయి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ప్రగతి హైస్కూల్లో కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు కృష్ణ-గోపిక వేషధారణలో ఆట-పాటలతో అలరించారు ఈ కార్యక్రమంలో కరస్పాం డెంట్ చందుపట్ల. తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ బర్ల శ్రీనివాస్, డైరెక్టర్స్ శ్రీధర్ బాబు,అనిల్ కుమార్ రెడ్డి,పాల్గొన్నారు.

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థుల చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలు అలరించారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ అల్లెంకిరజనీ శ్రీనివాస్ మాట్లాడుతూ ద్వాపర యుగంలో శ్రీముఖ నామ సంవత్సరం శ్రావణం మాసంలో బహుళ అష్టమి నాడు అర్ధరాత్రి రోహిణి నక్షత్రంలో శ్రీకృష్ణుడు జన్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. దేవకీ వసుదేవులకు అష్టమ (8వ) సంతానంగా శ్రీకృష్ణుడు జన్మించాడని కృష్ణావతారాన్ని శ్రీమహా విష్ణువు ఎనిమిదో అవతారంగా పురాణాల్లో చెప్పుకుంటారని శ్రీమహావిష్ణువు అవతారాల్లో శ్రీకృష్ణావతారం విశిష్టమైనదని. అందుకే కృష్ణ పరమాత్మ ఆవిర్భవించిన దివ్య తిథినే 'కృష్ణాష్టమి'గా జరుపుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయ బృందం, పోషకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


జూలపల్లిలో..

నవతెలంగాణ-జూలపల్లి /ఎలిగేడు
జూలపల్లి, ఎలిగేడు మండలాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జూలపల్లి మండలంలో జూపిటర్ హైస్కూల్‌లో కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు.భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు కుమార్ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | ఆగస్టు 27, 2024 | www.navatelangana.com

మండల వాసికి యోగారత్న అవార్డు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికిచెందిన దుర్గం వినోద్ కుమార్ కు యోగా రత్న అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో సరూర్నగర్ జ్యోతి క్లబ్‌లో నిర్వహించిన రంగారెడ్డి జిల్లాస్థాయి యోగా పోటీల్లో భాగంగా యోగాలో సేవలు అందిస్తున్న వినోద్ కుమార్‌కు తెలంగాణ యోగా అసోసియేషన్ కార్యదర్శి జే మనోహర్ ఆధ్వర్యంలో అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్‌ను, తెలంగాణ మహర్ నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత, జన్నారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన, రవీందర్‌రావు, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, జన్నారం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, అభినందించారు.

'భారీ వాహనాలకు అనుమతి ఇచ్చేలా చూడాలి'

నవతెలంగాణ-జన్నారం



భారీ వాహనాలకు అనుమతి ఇచ్చేలా చూడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌కు అభయారణ్య ఆంక్షలు ఎత్తివేత కమిటీ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలో ఎమ్మెల్యే పాయల శంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. భారీ వాహనాలు రాకపోవడంతో ప్రజలకు ఉపాధి దొరకడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఆంక్షల ఎత్తివేత కమిటీ నాయకులు భూమాచారి, దాసరి తిరుపతి, కొండపల్లి మహేష్, ఎజాజ్, బీజేపీ నాయకులు గోలి చందు పాల్గొన్నారు.

స్పీడ్‌కు బ్రేకులు లేనట్లేనా..?

- కవ్వాల్‌లో టైగర్ జోన్‌లో రోడ్డు ప్రమాదాలు
- అమలుకాని 30కిలోమీటర్ల నిబంధన
- అవగాహన కల్పించినా ఫలితం శూన్యం

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లో వాహనాలు దూసుకెళ్తున్నాయి. వాహనాల వేగం గంటకు 30కిలోమీటర్లకు మించరాదనే నిబంధనలు ఉన్నా వాహనదారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి. అడవి నుంచి బయటకు వచ్చిన వన్యప్రాణులు ప్రమాదం బారిన పడుతున్నాయి. కొన్ని సమయాల్లో వన్యప్రాణుల వల్ల వాహనదారులూ ప్రమాదం బారిన పడిన గాయపడుతున్నారు. వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో వేగం పెంచ డంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోయి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంది. ఈ క్రమంలో టైగర్ జోన్‌లో వేగం నియంత్రించేందుకు అధికారులు నాకాబందీ పేరిట తనిఖీలు చేస్తూ వాహదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

నిబంధనలు బేఖాతార్ చేస్తున్న వాహనదారులు

దట్టమైన అడవులు, వన్యప్రాణుల సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా 2012లో కవ్వాల్ అభయారణ్యాన్ని కేంద్ర ప్రభుత్వం టైగర్ జోన్‌గా ప్రకటించింది. అప్పటి నుంచి ఒక్కో నిబంధన అమలు చేస్తు న్నారు. రాత్రివేళల్లో వాహనాల రాకపోకలు నిలిపి వేశారు. భారీ వాహనాలకు అనుమతి నిరాకరిం చారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. టైగర్ జోన్‌లో సుమారు 60 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇరువైపుల అడవులు ఉండడం వల్ల వన్యప్రాణులు రోడ్డు దాటే అవకాశం ఉంది. దీంతో అధికారులు టైగర్ జోన్ పరిధిలో వాహనదారులు గంటకు 30కిలోమీటర్ల వేగం దాటవద్దనే నిబంధన అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రధాన రహదారికి ఇరువైపుల తపాలాపూర్ నుంచి కడెం వరకు, ఉట్నూర్ వరకు అటవీ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అక్కడక్కడ వన్యప్రాణులు వాహనాలను ఢీకొని ఎలా చనిపోతాయో బోర్డులు ఏర్పాటు చేశారు. అడవి ఎక్కువగా ఉన్న ప్రాంతం వైపు రోడ్డుకు పక్కనే జాలీలతో ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. అయినా వాహనదారులు పట్టిం చుకోకుండా అతివేగంగా వెళ్తుండడంతో వన్యప్రాణులు వాహనాలకు తగిలి మత్యువాత పడుతు న్నాయి. జన్నారం నుంచి తపాలాపూర్ చెక్ పోస్టు మధ్యలో అనేక ప్రమాదాలు జరిగాయి.



వన్యప్రాణుల సంచారం దృష్ట్యా స్పీడ్ తగ్గించి వెళ్లాలని సూచిస్తున్న బోర్డు

వాహనదారులకు అవగాహన

టైగర్ జోన్ ప్రాంతంలో వాహనాల వేగానికి బ్రేక్ వేసేందుకు నూతన పద్ధతిని అవలంబిస్తున్నారు. తాళ్లపేట, జన్నారం, ఇందన్పల్లి అటవీ రేంజ్ల ప్రాంతంలో అటవీ అధికారులు జట్టుగా తనిఖీలు చేస్తూ వేగనియంత్రణపై అవగాహన కల్పిస్తు న్నారు. వేగానికి సంబంధించిన బోర్డులను డ్రైవర్‌కు ఇస్తూ పాటించాలని సూచిస్తున్నారు. వేగంగా వాహనాలు నడపడం వల్ల వన్యప్రాణులు తగిలి ప్రమాదాలు జరిగితే గాయాల పాలయ్యే అవకాశం ఉందని, ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. వన్యప్రాణి చనిపోతే కేసులు అవుతాయని, వాహనంలో ప్రయాణిస్తున్న వారికి డ్రైవర్లకు ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని సూచనలు సలహాలు అందిస్తున్నారు.

కవ్వాల్ టైగర్ జోన్‌లో పలు సంఘటనలు

రాత్రిపూట వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో అతివేగంగా వెళ్తే ప్రమాదాలు సంభవిస్తాయి. అడవిపందులు, దుప్పులు, నీలుగాయిలు అతివే గంగా రోడ్డు దాటే అవకాశం ఉంది. జన్నారం మండలంతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు గాయపడ్డారు.

- రెండేళ్ల క్రితం జింకల పార్కు సమీపంలో అడవిపంది అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఐదుగురుగాయపడ్డారు.
- మహ్మదాబాద్ గ్రామ సమీపంలో అడవి పంది రోడ్డు దాటే క్రమంలో ఆటోకు తగలడంతో బోల్తాపడింది. నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు.
- జన్నారానికి చెందిన బీజేపీ మాజీ అధ్యక్షుడు గోలి చందు బైక్‌పై వస్తుండగా ఒక్కసారిగా వన్యప్రాణి అడ్డు రావడంతో తప్పించబోయి తీవ్రంగా గాయపడ్డాడు.
- రాత్రివేళ పెట్రోలింగ్‌కు వెళ్లిన పలువురు అటవీ అధికారులు కూడా వన్యప్రాణులు తగిలి గాయాలపాలయ్యారు.
- తపాలాపూర్ గ్రామ సమీపంలో మంచిర్యాలకు చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వన్యప్రాణి అడ్డు రావడంతో తప్పించబోయి కల్వర్టును ఢీకొట్టి కిందపడ్డారు. ఈ ఘటనలో భార్య మృతిచెందింది. ఇలా అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం

హఫీస్ ఉద్దీన్, ఎఫ్ఆర్ఓ ఇంధన్‌పల్లి.



టైగర్‌జోన్ ప్రాంతంలో వేగం తగ్గిం చాలని సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. కాని కొందరిలో మార్పు రావడం లేదు. వన్యప్రాణులు ఒకేసారి బయటకు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నం దున రోడ్డుకు ఇరువైపుల ఫ్యాలైన్స్ ఏర్పాటు చేశాం. వేగం 30 కిలోమీటర్లలోపే వెళ్లాలని సూచిస్తున్నాం. ప్లాస్టిక్ కవర్లు అడవి ప్రాంతంలో పడేయవద్దు. ఈ విషయాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు



గంటకు 30 కిలో మీటర్ల వేగం దాటొద్దని సూచిస్తున్న బోర్డు



స్టేషన్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

నవతెలంగాణ-వేమనపల్లి

పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసు రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం నీల్వాయి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సర్వీస్ బుక్స్, లీవ్ రికార్డులతో పాటు తదితర రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు గ్రేవ్, నాన్ గ్రేవ్ సీడీ ఫైల్స్‌ను పరిశీలించాలన్నారు. పెండింగ్ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఎస్ఐని ఆదేశించారు. దొంగతనాల నివారణకు పెట్రోలింగ్ నిర్వహించాలని, గంజాయి, డ్రగ్స్ నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రౌడీ షీటర్స్, సస్పెక్ట్స్, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని బ్లూ కోట్ సిబ్బందిని ఆదేశించారు. చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ శ్యామ్ పటేల్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

నవతెలంగాణ-జన్నారం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా పాలనాధికారి చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగులుగా అవార్డు అందుకున్న పలువురు మండల స్థాయి అధికారులతో పాటు పదవీ కాలం పూర్తి చేసు కున్న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీతో కలిసి మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లుగా ఆ సంఘం మండల అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గోపి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొంతం శంకరయ్య ప్రచార కార్యదర్శి దాసరి రాజన్న తెలిపారు. సోమవారం ప్రెస్ క్లబ్లో మీడియాతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే ఆత్మీయ సమావేశానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి మున్నూరు కాపు సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

నేటి ఏజన్సీ బంద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

ఆదివాసీ సమస్యల పరిష్కారానికి మంగళవారం 27న ఏజన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య పిలుపు నిచ్చారు. సోమవారం మండలంలోని దేవాపూర్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య మాట్లాడుతూ ఏజన్సీ ప్రత్యేక డీఎస్సీని ఏర్పాటు చేయాలని, ఐటీడీఏలో బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, జీఓ 3ను కొనసాగించాలని, ట్రైబల్ కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యేక జీఓ ఏర్పాటు చేయాలని, గిరిజన బెటాలియన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏజన్సీ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్త ఏజన్సీ బంద్‌లో ప్రతి ఒక్క ఆదివాసీ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, ఉపాధ్యాక్షుడు రాయిసిడం శంకర్ పాల్గొన్నారు.

రోప్ హాలేజీ సిస్టంను పరిశీలించిన డీడీఎంఎస్ అధికారులు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 గనిలో అండర్ గ్రౌండ్ గనులలో రూప్ హాలేజీ సిస్టంను డీడీఎంఎస్ అధికారి దిలీప్ కుమార్ సోమవారం పరిశీలించారు. అనంతరం గని ప్లాన్లను రికార్డులను, గనిలోని పని స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీఎం(సేఫ్టీ) బీపీఏ రీజియన్ కే రఘు కుమార్, ఏజీఎం(ఇ అండ్ ఎం)బీపీఏ రీజియన్ రామనాదం, డీజీఎం(ఇ అండ్ఎం) ఎస్ఆర్‌పీ ఏరియా ఇంజనీర్ బి.చంద్రశేఖర్, ఆర్కే-5,6 గూప్ ఏజెంట్ ఎస్.శ్రీధర్, ఆర్కే-6 గని మేనేజర్ ఇ.తిరుపతి పాల్గొన్నారు.

ఎస్సై అంజమ్మను కలిసిన మాల సంక్షేమ సంఘం నాయకులు

నవతెలంగాణ-తలమడుగు

ఇటీవల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన అంజమ్మను మాల సంక్షేమ సంఘం మండల నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి గజానంద్, ప్రకాష్, దేవన్న ముత్యాల రవి, మాజీ ఎంపిటిసి సంటి, సురేష్, ప్రతాప్, వేణు, నర్సిములు, ప్రభాకర్, రాజేశ్వర్, సంటి, రజినీకాంత్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మిక కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-జన్నారం

మండలం దేవునిగూడ గ్రామంలో గల్ఫ్ నిరుపేద కార్మికుడు చొప్పదండి దుబ్బయ్య భార్య ఇటీవల క్యాన్సర్‌తో మరణించడంతో నిరుపేద కుటుంబానికి దేవుని గూడా గల్ఫ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సోమవారం రూ.5000 ఆర్థిక సాయం 50 కిలోల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా గల్ఫ్ సంక్షేమ సమితి నాయకులు మాట్లాడుతూ, గల్ఫ్‌లో ఉండి వేలాది రూపాయలు రాష్ట్రానికి తీసుకువచ్చిన వారి కుటుంబాలకు జీవనోపాధి మాత్రం కొనసాగడం లేదన్నారు. రెక్కాడితే డొక్కాడనీ ఇలాంటి గల్ఫ్ కటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అలాగే ఈ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్లతో గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌరవ ఆధ్యక్షుడు కునారపు భీమరాజు అధ్యక్షుడు సాంబారి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాగాల మల్లేష్, క్యాషియర్ ఏడేలి సత్తన్న, ఉపాధ్యక్షుడు కర్నె సురేందర్, కార్యదర్శులు దేసవేని గోపాల్, మల్లేష్, సభ్యులు కునారపు గంగాధర్, కాల్వ సాయికుమార్, కుశనాపెలి రాజన్న మహేష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య

నవతెలంగాణ-మందమర్రి

రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి సొన్నాయిల చిన్నయ్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్‌కి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి సొన్నాయిల చిన్నయ్య(70) కొన్ని సంవత్సరాలుగా తాగుడుకు బానిస అయ్యాడు. ఇద్దరు కొడుకులు ఎలాంటి పనులు లేక కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంది. ఆదివారం సాయంత్రం మద్యం సేవించి భార్యతో గొడవపడి ఇంట్లో చున్నితో ఉరి వేసుకున్నాడు గమనించిన తన భార్య కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కిందికి దించి స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్ ద్వారా బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకుపోగా సోన్నాయిల చిన్నయ్య చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై మృతుని పెద్ద కొడుకు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

నవతెలంగాణ-మందమర్రి

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించినప్పుడే సంస్థ అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందని జనరల్ మేనేజర్ సేఫ్టీ కార్పొరేట్ చింతల శ్రీనివాస్ అన్నారు. సోమవారం జనరల్ మేనేజర్ సేఫ్టీ కార్పొరేట్ చింతల శ్రీనివాస్ ఏరియాకు మొదటిసారిగా వచ్చిన సందర్భంగా జీఎం దేవేందర్, ఏరియా ఉన్నతాధికారులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం రక్షణ కార్పొరేట్ చింతల శ్రీనివాస్, జనరల్ మేనేజర్ దేవేందర్ మాట్లాడుతూ జీఎం సేఫ్టీ కార్పొరేట్‌గా వారి అనుభవంతో సింగరేణి సంస్థను ప్రమాద రహిత సింగరేణిగా మార్చడంలో ముందుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ రఘు కుమార్, జీఎం సేఫ్టీ కేహెచ్ఎస్ గుప్తా ఆర్జీ రీజియన్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఎస్ ఓ టు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎంవై వెంకటరమణ, డీజీఎం ఐడి రాజన్న, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఏరియా సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్‌లో ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై రవీందర్ తమ సిబ్బందితో కలిసి ఒక ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్‌లో కొందరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో తనిఖీ నిర్వహించారు. పింజరిగుట్ట కాలనీకి చెందిన షేక్ అఫ్రోజ్ అను వ్యక్తి అనుమానస్పదంగా కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా అతను తన నేరాన్ని ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి రూ.27వేలు, సెల్ ఫోన్ స్వాధీన పరచుకొని అరెస్ట్ చేసినట్టు తెలిపారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

నవతెలంగాణ-నస్పూర్



పట్టణ పరిధిలోని లిటిల్ రోబోస్ ప్లే స్కూల్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలు ధరించి ఆటపాటలతో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంను నిర్వహించారు. ఈ వేడుకలలో పాఠశాల ప్రిన్సిపల్ వూట్ల సత్యనారాయణ, ట్రస్మా నస్పూర్ మండల అధ్యక్షుడు మైదం రామకృష్ణ, కోశాధికారి అంబాల రాజకుమార్, మంచిర్యాల కోశాధికారి బండారి మమత, లత, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : పట్టణంలోని పలు పాఠశాలల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో ఆకట్టుకున్నారు. వారు ఆట పాటలతో అలరించారు. విద్యార్థులు ఉట్టి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్ని ఉట్టిని కొట్టారు.

మండలంలో ఘనంగా తీజ్ ఉత్సవాలు



నవతెలంగాణ-జన్నారం

మండలంలో లంబాడ కులస్తులు సోమవారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బంజారా సేవా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జువ్విగూడా గ్రామంలో ఉన్న శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, జగదాంబ దేవి మాతకు ఆ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువతులు వెదురు బుట్టలలో ఉంచిన గోధుమ వరి మొలకలతో నృత్యాలు చేస్తూ ర్యాలీగా జువ్విగూడ నుండి ధర్మారం చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జాదవ్ సందేశ్, ప్రకాష్ నాయక్, బీవీఎస్ నాయక్, బిమ్లాల్ నాయక్, రాములు నాయక్, రామ్ కిషన్ నాయక్, సంతోష్ నాయక్, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ పాల్గొన్నారు.

మహిళలను నమ్మించి మోసం చేసిన లక్కీ లేడీ

- లక్కీ స్కీమ్ పేరుతో కోట్లు వసూలు
- ఆశ పడి మోసపోయిన అమాయకులు



నవతెలంగాణ-మంచిర్యాల

నమ్మినందుకు నట్టేట ముంచుతున్నారు కొందరు నయ వంచకులు, అమాయక ప్రజలను చూసి చిట్టీలు, లక్కీ స్కీమ్‌లు, ఉద్యోగాల పేరుతో బురిడీ కొట్టిస్తున్నారు. అదే తరహాలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఒక మహిళ లక్కీ స్కిం పేరుతో పట్టణ వాసులను మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రతి నెల డబ్బులు కడితే లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి పెద్ద మొత్తంలో వస్తువులు ఇస్తామని చెప్పి వారి వద్ద నుంచి కోట్లలో వసూలు చేసింది. తర్వాత అడ్రస్ లేకుండా పోయింది. మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

బెల్లంపల్లి కేంద్రంగా గాలం

బెల్లంపల్లికి చెందిన ఒక మహిళా జై గణేష్ ఎంటర్ ప్రైజస్ పేరుతో లక్కీ స్కీమ్ ప్రారంభించింది. తెలిసిన వారు, బంధువులు,స్నేహితులకు స్కీమ్‌ల గురించి వివరించి వారిని ఏజెంట్‌గా నియమించింది. 10 మందిని ఏజెంట్‌గా ఏర్పాటు చేసి ఒక్క ఏజెంట్ దాదాపు 100 మంది సభ్యులు స్కీమ్‌లో జాయిన్ చేసేలా ప్రేరేపించింది. మహిళా మాయ మాటలు నమ్మిన ఏజెంట్‌లు నిజమే అనుకుని వారికి తెలిసిన వారిని స్కీమ్‌లో జాయిన్ చేశారు. ఇలా 999 మంది సభ్యులు అయ్యారు. ఒక్కో వ్యక్తి నెలకు రూ.650 చొప్పున 20 నెలలు కట్టాలి, 20 నెలలు పూర్తి అయ్యే వరకు సభ్యులు కట్టిన డబ్బులు రూ.13000 రూ అవుతాయి. సభ్యుల పేర్లను కలిపి ప్రతి నెల లక్కీ డ్రా తీసి డ్రాలో పేరు వచ్చిన సభ్యుడికి వారి వద్ద ఉన్న గృహోపకరణకు ఉపయోగించే ఒక్కో వస్తువు ఇవ్వడం అనేది స్కీమ్ ఉదేశ్యం. వస్తువుల్లో మొబైల్, టీవి, రి ఫ్రిజిరేటర్, వాషింగ్ మేషన్, బైక్, బంగారంతో పాటు కొన్ని విలువైన వస్తువులను చేర్చారు. ఇలా బెల్లంపల్లిలో దాదాపు 999 మంది సభ్యులను స్కీమ్‌లో చేర్చుకొని వారి వద్ద నుండి ప్రతి నెల డబ్బులు వసులు చేశారు. ఇందుకు గాను బెల్లంపల్లిలో ఒక ఆఫీస్ తెరిచి ఉద్యోగులను నియమించింది. ఎంటర్ ప్రైజస్‌కు రిజిస్ట్రేషన్, జీఎస్‌టీజి కడుతున్నట్లు తప్పుడు పత్రాలు చూపించి స్కీమ్‌లో సభ్యులను చేర్చుకుంది. రెండు, మూడు నెలలకు ఒకసారి ఒక వస్తువు ఇచ్చేదని, ఇంట్లోకి సంబంధించిన వస్తువులు కాబట్టి ఎప్పటికి అయిన ఇస్తుందనే నమ్మకంతో ప్రతి నెల డబ్బులు కట్టామని బాదితులు ఆందోళన చెందుతున్నారు. ఏండ్లు గడిచిన డబ్బులు, వస్తువులు తిరిగి ఇవ్వక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డబ్బులు కట్టిన సభ్యులు ఏజెంట్‌ల ఇంటి వద్దకు వచ్చి గొడవలు చేయడంతో స్కీమ్ బాగోతం బయటకు వచ్చింది. కొన్ని రోజులు అడ్రస్ లేకుండా పోయిన మహిళ వివరాలు సేకరించిన బాధితులు నిర్మల్‌లో ఉంటున్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి నిలదీయడంతో ఒక్కోకరికి డబ్బులు ఇస్తానని చెప్పినట్లు తెలిపారు. గతంలో బెల్లంపల్లి పోలీసులను బాదితులు ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మళ్లీ ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని పోలుసులు తెలిపారు.

వదిలేది లేదు

అమృత బెల్లంపల్లి



మాది మహారాష్ట్ర, ఇక్కడికి వచ్చి ఇండ్లలో పని చేసుకుంటు బ్రతుకుతున్న, పని చేస్తే వచ్చే పైసలతో స్కీమ్‌లో డబ్బులు కట్టిన, ఏజెంట్ చెప్పిన మాటలు నమ్మి ప్రతి నెల పైసలు ఇచ్చిన, ఇంటి కోసం ఏదైనా వస్తువు అయిన వస్తది అనే ఆశ ఉండి రెండు సంవత్సరాలు గడిచింది ఒక్క రూపాయి కూడ తిరిగి ఇవ్వలేదు. ఎం చేయలేక పోతున్న పది ఇండ్లలో పని చేసి బ్రతుకుతున్న, నా డబ్బులు నాకు వచ్చేలా చూడాలి.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

ఈశ్వరమ్మ

దగ్గరి బంధువని నమ్మినం. అందరిని ముంచింది, నాకు ఇంకా రూ.4 లక్షల రావలి. ఇప్పటికే బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అమాయకులని చూసి మోసం చేసింది. అందరికి డబ్బులు ఇవ్వాల్సిందే, ఎప్పుడు అడిగిన ఇస్తాను అని చెప్తుంది. కానీ ఇప్పటికి కట్టిన డబ్బులు, వస్తువులు ఇవ్వలేదు. న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం.

జూరాలలో 24 గేట్లు ఎత్తివేత

- తాలిపేరు 22 గేట్ల ద్వారా నీటి విడుదల



నవతెలంగాణ - ధరూర్/చర్ల

జూరాల, తాలిపేరు ప్రాజెక్టులకు ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహం వస్తుండటంతో అధికారులు సోమవారం గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని జూరాలలో 24 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినట్టు పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల ద్వారా జూరాలకు ఇన్‌ఫ్లో 93 వేల క్యూసెక్కుల నీరు రాగా.. శ్రీశైలానికి 95 వేలా 464 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు చెప్పారు. జూరాలలో జల విద్యుత్ కేంద్రం ద్వారా ఐదు యూనిట్ల నుంచి 31 వేలా 489 క్యూసెక్కుల నీరును వదులుతున్నామని తెలిపారు. నెట్టెంపాడుకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాలువకు 820, కుడి కాలువకు 496 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. మొత్తం లక్షా 29 వేల 228 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్టు పీజేపీ అధికారులు తెలిపారు.

తాలిపేరు 22 గేట్లు ఎత్తివేత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలో గల మధ్యతరహా తాలిపేరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం పెరిగింది. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. తద్వారా తాలిపేరు రిజర్వాయర్‌లోకి 25621 క్యూసెక్కుల వరద నీరు చేరడంతో అధికారులు ప్రాజెక్టు 25 గేట్లలో 22 గేట్లను రెండడుగుల మేర ఎత్తి 29236 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

స్పీకర్ 'ఎక్స్' అకౌంట్ హ్యాక్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోషల్‌మీడియా అక్కౌంట్ హ్యాక్ అయింది. కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ఆయన 'ఎక్స్' ఖాతాలో అసభ్యకర వీడియోలు పోస్టు చేశారు. ఈ విషయాన్ని స్వయంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ చెప్పారు. 'సోమవారం ఉదయం నా వ్యక్తిగత 'ఎక్స్' అకౌంట్‌ను కొంత మంది కొద్దిసేపు హ్యాక్ చేసినట్టు తెలిపారు. అసెంబ్లీ సాంకేతిక బృందం ఈ విషయాన్ని గమనించి వెంటనే తిరిగి సరి చేసిందని వివరించారు. నా 'ఎక్స్' ఖాతా హ్యాకింగ్‌కు గురైన సమయంలో నా అకౌంట్‌లో వచ్చిన వీడియోలు, పోస్టులతో నాకు ఎలాంటి సంబంధం లేదు' అంటూ స్పీకర్ వివరణ ఇచ్చారు.



25 మంది మావోయిస్టుల లొంగుబాటు

- వివరాలు వెల్లడించిన బీజాపూర్ జిల్లా ఎస్పీ

నవతెలంగాణ- చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో రూ.29 లక్షల రివార్డ్ కలిగిన ఆరుగురు హార్డ్‌కోర్ మావోయిస్టులతో సహా మరో 19 మంది మావోయిస్టులు పోలీసు అధికారుల సమక్షంలో లొంగిపోయారు. వారిలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి చెందిన ఇద్దరు మహిళా మావోయిస్టులూ ఉన్నారు. లొంగిపోయిన వారంతా గంగుళూరు ప్రాంతానికి చెందిన వారని జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. ఏడు నెలల కాలంలో 170 మంది "లోన్ వరాటో" కార్యక్రమానికి ఆకర్షితులై జనజీవన స్రవంతిలో చేరినట్టు ఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 346 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని, స్వచ్ఛందంగా లొంగిపోయిన వారికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పునరావాస పథకం కింద ఒక్కొక్కరికీ రూ.25 వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందించనున్నట్టు ఎస్పీ తెలిపారు.

నేడు నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన

- టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ పిలుపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలపాలని టీజీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు ఇచ్చింది. ఈ మేరకు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఎమ్‌జీబీఎస్‌లో, తార్నాక ఆస్పత్రిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, సికింద్రాబాద్ పికెట్‌లో మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు నల్లబ్యాడ్జీలు పెట్టే కార్యక్రమం జరుగుతుందని జేఏసీ చైర్మెన్ ఈదురు వెంకన్న తెలిపారు.

ఈ సందర్భంగా కార్మికులకు సమస్యలపై కరపత్రాలు పంచుతామన్నారు. మంగళవారం జరిగే కార్యక్రమంలో తనతోపాటు జేఏసీ వైస్ చైర్మెన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎమ్‌డీ మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బీ యాదగిరి కూడా పాల్గొంటారని వివరించారు.

విద్యార్థుల్లో మానసిక రుగ్మతలు పెరిగితే అందరికీ నష్టమే

- ప్రశాంత వాతావరణం కల్పిస్తేనే ఫలితాలు
- గురుకుల విద్యాలయాల్లో అన్నీ సమస్యలే
- వాటి పనివేళలను శాస్త్రీయంగా నిర్ణయించాలి : టీఎస్ యూటీఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యార్థుల్లో మానసిక రుగ్మతలు పెరిగితే సమాజానికి తీవ్ర నష్టం సంభవిస్తుందని ఇండియన్ సైకియాట్రిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటీఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో "గురుకులాల పని వేళలు - విద్యార్థులపై ప్రభావం" అనే అంశంపై సంఘం అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశాల్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల పనివేళలు విద్యార్థుల మానసిక వికాసానికి తగిన విధంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు ఒత్తిడి లేకుండా పనిచేసేటట్టు వాటిని నిర్ణయించాలని సూచించారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి, పౌష్టికాహారలోపం, శారీరక వ్యాయామ లోపం వివిధ మానసిక రుగ్మతలకు దారి తీస్తుందన్నారు. దీంతో వారు ఆత్మహత్యే పరిష్కారంగా భావిస్తున్నారని తెలిపారు. అందుకే బాధ్యతగా విద్యార్థులకు ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. సరిపోను నిద్ర, ఆకలిలేమి, తగిన విధంగా ఆటలు ఉన్నప్పుడే వారిలో మానసిక వికాసం పెంపొందుతుందని చెప్పారు. సమావేశంలో మానసిక నిపుణులు, బాలల హక్కుల కార్యకర్తలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గురుకులాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్ని గురుకుల సొసైటీల్లో ఒకే పనివేళలను నిర్ణయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేరుతో ఉత్తర్వులిచ్చారని సంఘాల నేతలు తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన టైంటేబుల్ శాస్త్రీయంగా లేదని విమర్శించారు. విద్యార్థులపై ఒత్తిడి పెంచేదిగా అది ఉందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల ప్రాంగణంలో వసతి గృహాలు లేనందున నూతన పనివేళలు సిబ్బందికి కూడా కష్టంగా మారాయని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి 11.15 వరకు ఏకబిగిన తరగతిలో కూర్చోవటం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కేవలం పది నిమిషాల వ్యవధిలో 600 మంది విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవటం, సాయంత్రం స్నానాదులకు కేవలం 15 నిమిషాలు మాత్రమే సమయం నిర్ణయించటం సమంజసం కాదన్నారు. విద్యార్థులకు ఉదయం ఏడు గంటలకు అల్పాహారం అందించి మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనం పెట్టటంతో ఆకలికి ఆగలేకపోతున్నారని చెప్పారు. సాయంత్రం 4.30కు స్నాక్స్ ఇచ్చి, 6.30 కే భోజనం పెట్టటంతో సరిగా తినటం లేదనీ, పడుకునే ముందు ఆకలి అంటున్నారని ఉపాధ్యాయులు వివరించారు.

ఈ రీత్యా పనివేళలను విద్యార్థులకు అనుగుణంగా సవరించాలని వారు డిమాండ్ చేశారు. 2016-17 విద్యాసంవత్సరంలో అత్యధికంగా 750 గురుకులాలను ఒకేసారి ప్రారంభించారని తెలిపారు. అవన్నీ అద్దె భవనాల్లో ఉన్నాయనీ, అరకొర వసతులతో కొనసాగుతున్నాయని వివరించారు. ఇటీవల ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పేరుతో గురుకులాలకు దశలవారీగా శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించటాన్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. అయితే ప్రస్తుతం పాఠశాలలు నిర్వహిస్తున్న భవనాల్లో అత్యధికం గురుకులాల నిర్వహణకు అనుకూలంగా లేవని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో తరగతి గదులే వసతిగృహాలుగా ఉన్నాయన్నారు. స్టాఫ్ క్వార్టర్స్ లేవని గుర్తు చేశారు. పాఠశాలలు ఊరికి దూరంగా, పట్టణాల్లోని శివారు ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. స్థానికంగా వసతి లేనందున ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ సమీపంలోని పట్టణాలు, గ్రామాల్లో నివసిస్తూ రాకపోకలు సాగించాల్సి వస్తున్నదని తెలిపారు. మహిళలకైతే రక్షణ, భద్రతా పరమైన సమస్యలున్నాయన్నారు. వీటన్నింటినీ పరిగణన లోకి తీసుకోవాలనీ, ఉపాధ్యాయులు సంతోషంగా ఉంటేనే విద్యార్థులకు సమర్థవంతంగా బోధించగలరని వక్తలు ప్రభుత్వానికి సూచించారు. టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి, డీటీఎఫ్ అధ్యక్షులు ఎం సోమయ్య, గురుకుల ఉపాధ్యాయ సంఘం నాయకులు మామిడి నారాయణ, డాక్టర్ ఎ మధుసూదన్, పౌర స్పందన వేదిక ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం, బాలల హక్కుల కార్యకర్త క్రాంతికుమార్, బాలల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణయ్య, రఘునందన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు, పీడీఎస్‌యూ నాయకులు రామకృష్ణ, బి మధు, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎ సింహాచలం, ఎల్లయ్య, శశిధర్, లివిన్, రాంబాబు, మహేశ్, సురేందర్, హరీందర్ రెడ్డి, అనీశా, జ్యోతి, స్రవంతి, నర్సింహ, సత్యం, వేదాంతాచారి తదితరులు మాట్లాడారు. పలువురు గురుకుల ఉపాధ్యా యులు పాల్గొన్నారు. ప్రభుత్వం తక్షణమే టైంటేబుల్‌ను సవరించాలని తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

భారీగా డ్రగ్స్ పట్టివేత

- సీజ్ చేసిన ఫ్యాక్టరీ నుంచి సేకరణ
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 8.5 కిలోల ఎఫిటమిన్ డ్రగ్స్ స్వాధీనం
- విలువ రూ. 8.5 కోట్లు



నవతెలంగాణ- సిటీబ్యూరో

కొద్ది నెలల కిందట సీజ్ చేసిన ఫ్యాక్టరీ నుంచి సేకరించిన ఎఫిటమిన్ డ్రగ్స్‌ను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురిని హైదరాబాద్ నార్కోటెక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, బోయిన్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురు నిందితుల నుంచి రూ.8.5 కోట్ల విలువైన ఏండీఏం, 8.5 కిలోల ఎఫిటమిన్ డ్రగ్స్‌తో పాటు కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని సీసీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు.

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలకు చెందిన కె.నాగరాజు మేస్త్రీగా పని చేస్తున్నాడు. సంగారెడ్డి సమీపంలోని బొంతపల్లికి చెందిన వ్యాపారి గోసుకొండ అంజిరెడ్డికి చెందిన ఫంక్షన్ హాల్స్, ఫ్యాక్టరీ, గోడౌన్లలో సివిల్ వర్క్స్ ఉన్నాయని తెలుసుకుని ఆయనను కలిశాడు. పనిచేసే సమయంలో అంజిరెడ్డితో సాన్నిహిత్యం పెరిగింది. ఆ సమయంలో అంజిరెడ్డి ఎఫిటమైన్ డ్రగ్స్ తయారు చేసి, ప్లాస్టిక్ వస్తువుల సరఫరా ముసుగులో నగరంలో పార్టీలు, పబ్స్, కల్లు దుకాణాలతో పాటు ఇతరులకు సరఫరా చేస్తున్నట్టు తెలుసుకున్నాడు. ఇద్దరి మధ్య చనువు పెరగడంతో డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభిం చారు. అధిక లాభాలు వస్తుండటంతో పాటు డిమాండ్ పెరగడంతో మరో ఇద్దరిని పనిలోకి తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా సంగారెడ్డికి చెందిన ఏ.వినోద్‌కుమార్, కె.శ్రీశైలం అనే యువకులను తీసుకుని దందా కొనసాగిస్తున్నారు. ఇదిలావుండగా, అంజిరెడ్డి ఫ్యాక్టరీలో ఎఫిటమైన్ డ్రగ్స్ తయారు చేసి సరఫరా చేస్తున్నట్టు గుమ్మడిదల పోలీసులకు సమాచారం అందడంతో అతన్ని కొద్ది నెలల కిందట అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ఫ్యాక్టరీలో నిల్వ ఉంచిన ఎఫిటమైన్ డ్రగ్స్‌ను ఎలాగైనా బయట విక్రయించాలని నాగరాజు, వినోద్‌కుమార్, శ్రీశైలం నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ముగ్గురు జిన్నారం నుంచి డ్రగ్స్‌ను తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. బోయిన్‌పల్లి మీదుగా సికింద్రాబాద్ ప్యారడైజ్ వద్ద డెలివరీ చేసేందుకు కారులో వెళు తున్నట్టు హెచ్‌న్యూ(హైదరాబాద్ నార్కోటిక్స్ వింగ్) పోలీసులు గుర్తించారు. బోయినపల్లి పోలీసుల సాయంతో డెయిరీ ఫామ్ రోడ్డు వద్ద నిందితుల వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేశారు. కారు డిక్కీలో ఎఫిటమైన్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనివెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు సీపీ తెలిపారు.

గంజాయితో అలవాటై డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్న యువత: సీపీ

డ్రగ్స్ మొత్తం దేశాన్నే నష్టపరుస్తుందని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కొందరు యువకులు సరదా కోసం సిగరేట్‌తో మొదలు పెట్టి.. మద్యం, రెండో లెవల్‌లో గంజాయిని అలవాటుగా చేసుకుంటున్నారని, అక్కడి నుంచి డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని తెలిపారు. కొందరు ఉగ్రవాదులు, సంఘ విద్రోహశక్తులు యువకులను తప్పుదోవ పట్టించడంతోపాటు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన యువతను చెడగొట్టి, డ్రగ్స్ మత్తులోకి లాగుతున్నారని తెలిపారు. యువకులు డ్రగ్స్‌కు అలవాటై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుం టున్నారని, తల్లిదండ్రులకు భారంగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు? ఎవరితో స్నేహం చేస్తున్నారో తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ఎక్కడికి వెళ్తున్నారో గమనించాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు సుధీంద్ర, రష్మీ పెరుమాల్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా

1 నుంచి దేశవ్యాప్త నిరసనలు

- పేదలు, మధ్యతరగతి ప్రజల జోలికి హైడ్రా వెళ్లొద్దు : సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని మోడీ పాలనలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు వ్యతిరేకంగా వచ్చేనెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ ప్రకటించారు. 'హైడ్రా' పేరుతో అక్రమ కూల్చివేతలు పులి మీద స్వారీ లాంటివనీ, భయపడి సీఎం రేవంత్‌రెడ్డి వెనకడుగు వేస్తే ఆ పులి ఆయన్నే తినేస్తుందని చెప్పారు. ఎవరికీ భయపడకుండా ప్రలోభాలకు గురికాకుండా ముందుకెళ్తే ప్రజల మద్దతు లభిస్తుందన్నారు. అయితే పేదలు, మధ్యతరగతి ప్రజల జోలికి హైడ్రా వెళ్లొద్దని కోరారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాలమల్లేష్‌తో కలిసి నారాయణ మాట్లాడారు. గవర్నర్ ద్వారా కర్నాటక ప్రభుత్వాన్ని దెబ్బకొట్టాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ఇది ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతిస్తుందన్నారు. ఇలాంటి చర్యలు ప్రమాదకర మనీ, మోడీపై బీజేపీ తిరుగుబాటు చేస్తుందని హెచ్చరించారు. మోడీ వల్లే అదానీ ప్రపంచ కుబేరుడు అయ్యారని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలను కూలుస్తారా? అంటూ ఎంఐఎం నేత ప్రశ్నించడాన్ని నారాయణ తప్పుపట్టారు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయాలకు, కబ్జాదారుల ఫామ్‌హౌజ్, ఫంక్షన్‌హాళ్లు, విద్యాసంస్థలకు ముడిపెడుతారా?అని ప్రశ్నించారు. ఈ అంశంలో ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. బడాబాబుల అక్రమ కట్టడాలను కాపాడుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాలను సాకుగా చూపే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. పేదలు, మధ్యతరగతి ఇండ్ల స్థలాల జోలికి హైడ్రా వెళ్లొద్దని సూచించారు. వారి స్థలాలను క్రమబద్ధీకరించాలనీ, లేదంటే వారికి ప్రత్యామ్నాయం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెరువు స్థలాల్లో ఉన్న వాణిజ్య, వ్యాపార కట్టడాలను తొలగించాలనీ, కబ్జాలకు పాల్పడిన బడాబాబుల నుంచి డబ్బులు వసూలు చేయాలని కోరారు. 'ఎన్' కన్వెన్షన్ అంశంలో సినీనటుడు నాగార్జున నుంచి కూడా డబ్బులు వసూలు చేయాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సినీనటుడు నాగార్జున లాంటి వారు తాము చెరువుల్లో నిర్మించలేదనీ, టేపులతో కొలవాలని చెబుతున్నారనీ, చెరువులను కబ్జా చేసిన తర్వాత ఇంకా కొలవడం ఏంటని ప్రశ్నించారు.

ప్రజలపై దౌర్జన్యం చేసేలా న్యాయ చట్టాలు : సయ్యద్ అజీజ్ పాషా

కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన న్యాయచట్టాల్లో ప్రజలపై దౌర్జన్యం చేసేలా కొన్ని సెక్షన్లు ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. కొత్త న్యాయ చట్టాలను న్యాయ నిపుణులు, మేధావులు ఆమోదించడం లేదన్నారు. చట్టాలను రూపొందించే క్రమంలో మేధావులు, న్యాయ నిపుణులతో చర్చలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. జమ్మూకాశ్మీర్ ఎన్నికల నేపథ్యంలో భావసారూప్యత కలిగిన పార్టీలతో చర్చలు జరుగుతున్నామని చెప్పారు. పశ్యపద్మ మాట్లాడుతూ రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహిస్తున్నామని అన్నారు. ఎటువంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రామీణ క్రీడాకారుల్ని వెలికితీస్తాం

- జాతీయ క్రీడా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో


రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా గ్రామీణ క్రీడాకారుల్ని వెలికితీస్తామని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారంనాడాయన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి ఆగస్టు 29న ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవం పోస్టర్, టీ షర్ట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహిస్తు న్నట్టు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కొరియా దేశం వెళ్ళినప్పుడు అక్కడ క్రీడా సంస్థలు, క్రీడాకారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారనీ, ఆ మేరకు తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని సంకల్పించారని తెలిపారు. రాష్ట్రం క్రీడా రంగంలో ప్రథమస్థానంలో ఉండాలని తామంతా ఆకాంక్షిస్తున్నామన్నారు. పాఠశాల దశ నుంచే క్రీడల్లో రాణించేలా విద్యార్థుల్ని ప్రోత్సహించాలని సూచించారు. 29న జరిగే కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు పాల్గొనాలని కోరారు. అదేరోజు గచ్చిబౌలి స్టేడియంలో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటార ని చెప్పారు. ఆరోజు అన్ని జిల్లాల్లో క్రీడా దినోత్సవ కార్యక్రమాలు జరుగుతా యనీ,తల్లిదండ్రులు తమ పిల్లల్ని క్రీడలపట్ల ఆసక్తి చూపించేలా ప్రోత్సహిం చాలని అన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ సలహాదారుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్ ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూములపై 'రియల్' కన్ను

బఫర్‌జోన్‌లో బంగ్లాలు..

- కేసరి సముద్రంలో నిర్మించిన 33 ఇండ్ల గుర్తింపు
- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 64 అక్రమణలు
- కోర్టు ఆదేశాలు బేఖాతర్
- హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- రాష్ట్ర వ్యాప్తంగా విస్తరణకు డిమాండ్స్

శిఖం భూములపై కన్నేసిన రియల్ మాఫియా చేయని ఆగడాలంటూ లేవు. ముందుగా కొంత స్థలం కొనుగోలు చేశాక.. క్రమంగా మొత్తం కుంట/చెరువునే మాయం చేస్తున్నారు. మొదట బఫర్‌జోన్ సమీపంలో 500 గజాల జాగాను కొనుగోలు చేస్తారు.. ఆ తర్వాత చెరువులో నీరు నిల్వకుండా తూమును రాత్రిపూట మరోకంట పడకుండా జేసీబీలతో ధ్వంసం చేస్తారు.. చెరువులో నీరు నిల్వకుండా చేసి శిఖం భూమి మొత్తాన్ని ప్లాట్లుగా మార్చుతారు.. మొదట కొనుగోలు చేసిన సర్వే నంబరుకు బై నంబరు వేసి భూములను అమ్మేసి సొమ్ము చేసుకుంటారు. ఇలా చేసిన ప్లాట్ల నిర్మించినవే నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం బఫర్‌జోన్‌లో 33 ఇండ్లు. మహబూబ్‌నగర్ పెద్ద చెరువుల కబ్జా చేసి 64, వనపర్తి జిల్లా కేంద్రంలోని తాళ్ల చెరువులో 50 ప్రాంతాల్లో విలాసవంతమైన విల్లాలు, బంగ్లాలు, ఆవాసాలు, బేకరీలు, పాఠశాలలు నిర్మించారు. హైడ్రా ద్వారా హైదరాబాద్‌లో జరుగుతున్న కూల్చివేతల మాదిరిగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనూ హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేస్తే వేలాది ఎకరాల శిఖం భూములు అన్యాక్రాంతం నుంచి బయటపడతాయని ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి డిమాండ్లు ప్రభుత్వానికి వస్తున్నాయి. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ వంటి ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

నాగర్‌కర్నూల్ చెరువు శిఖం 2800 ఎకరాలు ఉంటుంది. స్థిరీకరించని ఆయకట్టు 5వేల ఎకరాలు. సుమారు 3వేల మంది రైతులు భూములను సాగు చేసుకుని జీవిస్తున్నారు. తాడూరు, మల్యాపూర్, ఎండబెట్ల, పుల్జాల, తాళ్లపల్లి, నడిగడ్డ, కార్వంగ, జమిస్తాపూర్, గగ్గలపల్లి గ్రామాల్లో ఈ సాగు భూములున్నాయి. చెరువు స్థలం ఆక్రమణకు గురవడం వల్ల నీరు నిల్వ ఉండటం లేదు. దాంతో ఆయకట్టు సాగుకు నీరందడం లేదు. కేసరి సముద్రంలో శిఖం భూముల్లో 33 ఆవాసాలు నిర్మించుకున్నట్టు అధికారులు సర్వే చేసి నిర్ధారించారు. ఇందులో ప్రధానంగా ఎండబెట్ల గ్రామ సమీపాన బఫర్‌జోన్‌లో విల్లాను నిర్మించారు.. దీనికి రూ.50 కోట్లకు పైగానే ఖర్చు చేశారు. ఇక్కడ స్విమింగ్‌పూల్, పార్కింగ్‌తో పాటు రహస్య కార్యక్రమాలు సైతం జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. వర్షాకాలంలో విల్లా చుట్టూ నీరు చేరుతుంది. అయితే, నీరు విల్లా సమీపానికి రాకుండా ఇనుప రాడ్లతో చుట్టూ సిమెంటు ప్రహరీ నిర్మించుకున్నారు. వరద ఎంత వచ్చినా.. ఇంటి వరకు చేరకుండా మట్టిపోశారు. దాంతోపాటు అలుగు తగ్గిస్తే శాశ్వతంగా నీటి సమస్య ఉండదని రాత్రిపూట జేసీబీలతో ఉయ్యాలవాడ దగ్గర ఉన్న అలుగును ధ్వంసం చేశారు. ఇలా ఎకరాల కొద్దీ శిఖం భూములను ఆక్రమించుకోవడం వల్ల చెరువులో నీరు నిల్వకుండా బయటికి పారి డిండిలో కలుస్తోంది. కేసరి సముద్రంలోని నిర్మాణాలపై కొందరు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలను మొత్తం కూల్చాలని ట్రిబ్యునల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. అయితే, నిర్మాణాల కూల్చివేతను ఆపడానికి కొందరు రియల్ వ్యాపారులు సామాన్య ప్రజానీకం చేత హైకోర్టులో కేసు వేయించారు. ఆక్రమణల వెనక మాజీ ఎమ్మెల్యే హస్తం ఉందన్న ఆరోపణలున్నాయి.

మహబూబ్‌నగర్ పెద్దచెరువు 96 ఎకరాల శిఖం ఉండగా.. ఇప్పుడు 50 ఎకరాలకు కుంచించుకపోయింది. నీరు బయటకు వెళ్లే కాల్వలు, అలుగులు పారే తూములు కబ్జాకు గురయ్యాయి. ఈ కారణంగా భారీ వర్షాలు వస్తే పట్టణానికి మునక తప్పదు. నెక్లెస్ పేరుతో మరో కట్ట నిర్మాణం చేయడంతో చెరువు విస్తీర్ణం మరింత తగ్గిపోయింది. ఫిర్యాదులు వచ్చినప్పుడల్లా అధికారులు హడావుడి చేసి నివేదికల పేరిట కాలయాపన చేస్తున్నారు. సర్వే నెంబరు 67లో ఉన్న చెరువు నేడు క్రమంగా కనుమరుగు అవుతోంది. చెరువు నుంచి వరద వచ్చి సమీపంలోని ఇండ్లను ముంచెత్తుతోంది. బఫర్‌జోన్‌లో 64 అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు అధికారులు నివేదికలు ఇచ్చినా.. మున్సిపల్ అధికారులు కూల్చేయాలంటున్నా.. పైఅధికారుల నుంచి స్పందన రావడం లేదన్న విమర్శలున్నాయి. కొందరు పెద్ద రియల్ మాఫియాకు చెందిన వారు బడానాయకుల చుట్టూ తిరుగుతూ నిర్మాణాలను కాపాడుకుంటున్నారు. ఇటీవల సుందరీకరణ పేరుతో ఆక్రమణలు సక్రమం చేసుకుంటున్నారు. ఇప్పటికీ కొందరు మట్టి, ఇసుక, సిమెంటుతో పాటు ఇండ్లను కూల్చిన మన్ను తెచ్చి చెరువులో పోసి ప్లాట్లుగా మార్చుకుంటున్నారు. ఇదంతా చూస్తూ అధికారులు నోరు మెదపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు శిఖం భూములను కాపాడాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.

ఆక్రమణదారులను నియంత్రించాలి

మహబూబ్‌నగర్ పెద్దచెరువు నామ రూపాలు లేకుండా పోయింది. పెద్దచెరువును ట్యాంకుబండ్ చేయడం మంచిదే అయినా.. ఆక్రమణలపై దృష్టి పెట్టలేదు. ఒకవైపు సుందరీకరణ పనులు జరుగుతుండగానే.. మరో వైపు ఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రకృతి విపత్తులకు కారణమవుతున్న అక్రమ కట్టడాలను కూల్చేయాలి. ముఖ్యంగా రియల్ మాఫియా అక్రమాలను కట్టడి చేయడం ద్వారానే ప్రకృతి వైపరీత్యాలను అరికట్టవచ్చు.

ఎ. రాములు, సీపీఐ(ఎం)
జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

కేటీఆర్ ట్వీట్ బాధ్యతారాహిత్యం

- ఘటనపై చర్యలు తీసుకున్న తర్వాత స్పందనా?
- నాసిరకం గుడ్లు సరఫరా చేస్తే కఠినంగా వ్యవహరిస్తున్నాం : మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేటీఆర్ ట్వీట్ బాధ్యతారాహిత్యంగా ఉందనీ, భువనగిరిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్ల సరఫరా విషయంలో చర్యలు తీసుకున్న తర్వాత ఆయన స్పందించడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) విమర్శించారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతి రోజు 18 లక్షలకుపైగా గుడ్లు సరఫరా అవుతున్నాయనీ, ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పొరపాటు జరిగితే విధుల్లో ఉదాసీనంగా వ్యవహరించిన సిబ్బందిపై, నాసిరకం గుడ్లు సరఫరా చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని మంత్రి మరోసారి హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్ వాడీ కేంద్రాల్లో పాడైపోయిన గుడ్లకు సంబంధించి ఎన్నో ఘటనలు వెలుగు చూసినా చర్యలు చేపట్టలేదని గుర్తు చేశారు. ఈ మేరకు సోమవారం మంత్రి సీతక్క ఒక ప్రకటన విడుదల చేశారు. భువనగిరిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు పాడైపోయాయని ఈ నెల 22న వార్త తెలిసిన వెంటనే మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన జిల్లా సంక్షేమ అధికారిణి విచారణ చేపట్టి సెక్టార్ సూపర్ వైజర్, టీచర్, హెల్పర్‌తో పాటు కోడిగుడ్ల కాంట్రాక్టర్‌కు మెమోలు జారీ చేస్తూ వివరణ కోరారని గుర్తు చేశారు. 23న సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.నర్మద, టీచర్ స్వరూపారాణి, హెల్పర్ అరుణ లిఖిత పూర్వక వివరణ ఇచ్చారని తెలిపారు. వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో బాధ్యులను సస్పెండ్ చేసేందుకు అవసరమైన ప్రక్రియను 24 గంటల్లోపే జిల్లా అధికారులు ప్రారంభించారని గుర్తుచేశారు.

టీచర్లకు, హెల్పర్లకు సైతం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి విధి నిర్వహణపై ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని ఆదేశించారని తెలిపారు. ఇవేమీ తెలుసుకోకుండా నాలుగు రోజుల తర్వాత కేటీఆర్ ట్వీట్ చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

పళ్లు, చిగుళ్ల ఆరోగ్యానికి...

పంటి సమస్యలు మనల్ని తరచూ వేధిస్తాయి. దీంతో అనేక ఇతర ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. అయితే, సమస్య వచ్చిన తర్వాత కంటే ముందస్తు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల పళ్లు, చిగుళ్ల ఆరోగ్యంగా ఉంటాయి. అవి ఏంటో తెలుసుకుందాం.

పండ్లు, కూరగాయల్లో విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి పంటిని చిగుళ్ళని బలంగా ఉంచుతాయి.

ఫ్యాటీ ఫిష్‌లో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చిగుళ్ళ వ్యాధుల బారిన పడకుండా కాపాడుతాయి. ఇవి పంటి ఆరోగ్యానికి ఎంతో లాభదాయకం.

రోజంతటికీ కావలసిన నీటిని తీసుకోవటం వల్ల పళ్ళు కూడా హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పంటిలో పేరుకున్న ఆహార పదార్థాలు, బ్యాక్టీరియాను తొలగిస్తుంది.

ముఖ్యంగా పాల ఉత్పత్తుల్లో కూడా పంటిని బలంగా మార్చే గుణం ఉంటుంది.



పాలు, పెరుగు, చీజ్ వంటివి కాల్షియం ఫాస్ఫరస్ కలిగి ఉంటాయి .కాబట్టి అవి ఆరోగ్యకరమైన పళ్లకు ఎంతో ముఖ్యం. ఈ ప్రొబయోటిక్స్ బ్యాక్టీరియాని తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ■

తన బాధను దిగమింగి...

ప్రకృతి కోపానికి కేరళ రాష్ట్రంలోని వాయినాడ్ అల్లాడిపోయింది. శవాల దిబ్బగా మారింది. కొండచరియలు ఆ ప్రాంతాన్ని అతలాకుతలం చేశాయి. మొత్తం 295 మందిని పొట్టన పెట్టుకున్నాయి. ఈ విషాద సంఘటనకు దేశం యావత్తు కంట తడిపెట్టుకుంది. మనుషుల్లోని మానవతను తట్టి లేపింది. ప్రముఖుల నుండి సామాన్యుల వరకు తమ వంతుగా సహాయసహకారాలు అందించారు. అలాంటి వారిలో దీపా జోసెఫ్ ఒకరు. తన బాధంతా దిగమింగి ప్రజలను కాపాడేందుకు ముందుకు వచ్చి అందరి ప్రశంసలు అందుకున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



కేరళ రాష్ట్రంలో తొలి మహిళా అంబులెన్స్ డ్రైవర్ దీపా జోసెఫ్. దారుణ వినాశనాన్ని చవి చూసిన వాయనాడ్‌లో తన అంబులెన్స్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించింది. ఈ విపత్కర పరిస్థితుల నుంచి బాధితలను రక్షించి నిస్వార్థంగా సహాయ సహకారాలు అందించింది. తమ ప్రియమైన వారిని పోగొట్టుకున్న వారికి తన వంతుగా సాయం అందించి ఆయా మృతదేహాలను వారికి చేరవేసింది. ఆ ఘటనలో బాధితుల మృతదేహాలను అందజేసేటప్పుడు కొన్ని దృశ్యాలు మెలితిప్పేసేవని ఆమె చెబుతోంది. ఒక్కోసారి తనకు కూడా కన్నీళ్లు ఆగేవి కావని చెబుతోంది.

ధైర్యంగా సాగిపోయింది

గతంలో దీపా కాలేజీ బస్సు డ్రైవర్‌గా పని చేసేది. కరోనా సమయంలో ఆమె ఉద్యోగం పోయింది. ఆ తర్వాత కుటుంబ జీవనాధారం కోసం అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేయడం ప్రారంభించింది. కేరళలో ఈ వృత్తిలో పని చేస్తున్న తొలి మహిళ దీపానే కావడం విశేషం. సవాళ్లతో కూడిన ఈ వృత్తిలో చాలా ధైర్యంగా సాగిపోయింది దీపా. అయితే తన కన్న కూతురు బ్లడ్ క్యాన్సర్‌తో మరణించడంతో దీప డిప్రెషన్‌కి వెళ్లిపోయింది. ఆ బాధతో ఉద్యోగం కూడా వదిలేసుకుంది.







తట్టుకోలేకపోయింది

వాయనాడ్ దుర్ఘటన గురించి విని మళ్లీ విధుల్లోకి వచ్చి బాధితులకు తన వంతుగా సాయం అందించాలని ఆమె నిర్ణయించుకుంది. తన బాధను దిగమింగి ప్రజలకు నిస్వార్థంగా సాయం అందించింది. నిరంతరం రోడ్లపై ప్రజలకు అందుబాటులో ఉంటూ... సహాయ సహకారాలు అందించి అందరిచేత ప్రశంసలందుకుంది. ఆమె నాటి విషాద దృశ్యాలను గుర్తు చేసుకుంటూ, బాగా కుళ్లిపోయిన మృతదేహాలను కూడా తరలించినట్లు తెలిపింది. కొన్ని ఘటనల్లో అయితే తెగిపోయిన అవయవాల ఆధారంగా తమ వాళ్లను గుర్తించాల్సిన పరిస్థితి చూసి తట్టుకోలేకపోయానని చెప్పుకొచ్చింది దీపా.

ఇక వృత్తిని కొనసాగిస్తా

వయనాడ్ ఘటన అనుభవాలను తనను తీవ్రంగా ప్రభావితం చేశాయని, అదే తన బాధను పక్కన పెట్టి సాయం చేయాలనే దిశగా పురిగొల్పిందని అంటోంది దీపా. ప్రస్తుతం ఆమె ఇంకా విధుల్లోకి వెళ్లడం లేదు కానీ ఇక నుంచి పూర్తి స్థాయిలో అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తానని తెలిపింది. నిజానికి ఆమె తన జీవనాధారం కోసం ఈ వృత్తిని ఎంచుకున్నా... వ్యక్తిగత విషాదంతో పనికి దూరమయ్యింది. కానీ ఆ బాధను కూడా పక్కనపెట్టి వాయనాడ్ విషాదంలోని బాధితులకు సాయం చేసేందుకు ముందుకు రావడం నిజంగా స్ఫూర్తిదాయకం. ■



మంచి ఉద్యోగం, చక్కటి సంపాదన, ఆర్థికంగా బాగా ఉన్నా ఇంకా ఏదో చేయాలనే తపన నిషా షా ను నిలవనీయలేదు. లండన్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా పని చేస్తున్న ఆమెకు ఏడాదికి రెండున్నర లక్షల డాలర్లకు పైనే జీతం. కానీ కార్పొరేటర్లకు ఉపయోగపడే ఆ పని ఆమెకు తృప్తినివ్వలేదు. అందుకే యూట్యూబర్‌గా సరికొత్త అడుగులు వేసింది. సామాన్యులకు ఆర్థిక పాఠాలు చెబుతూ ఏడాదికి ఎనిమిది కోట్లు సంపాదిస్తుంది.

ఆరంకెల జీతం వస్తున్నా, బ్యాంకింగ్‌లో చేస్తున్నది కార్పొరేషన్‌లు, సార్వభౌమ ప్రభుత్వాలకు సహాయం చేయడమే ఆమె పని. అయితే తనకున్న విజ్ఞానం ద్వారా నలుగురికి ప్రయోజనం చేకూరాలనుకుంది.

ఆర్థిక పాఠాలు చెబుతూ...

దానికోసం ఏదైనా చేయాలని నిర్ణయించుకుంది నిషా. అందుకే ఉద్యోగానికి రాజీనామా చేసి బిజినెస్ కంటెంట్ క్రియేటర్‌గా కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టింది. 2023 జనవరిలో ఉద్యోగం పూర్తిగా వదిలేసి యూట్యూబ్‌ను కొనసాగించాలని ధైర్యంగా ముందుకు సాగింది. ఒక్క ఏడాదిలోనే అనూహ్య విజయాన్నందుకుంది.

2021 డిసెంబర్‌లో తన పేరుతోనే ఓ యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించింది. తనకు ఆసక్తి, పట్టు ఉన్న పర్సనల్ ఫైనాన్స్, సెల్ఫ్ డెవలప్‌మెంట్, బిజినెస్‌కు సంబంధించిన అంశాలపై వీడియోలు చేయడం మొదలుపెట్టింది. అలా ప్రతి వారం రెండు వీడియోలు పోస్ట్ చేసేది. బిజినెస్ విషయాలు కావడంతో మొదట్లో ఆశించిన ఆదరణ లభించలేదు. వెయ్యి మంది సబ్‌స్క్రైబర్ల కోసం దాదాపు ఏడాది ఎదురు చూడాల్సి వచ్చింది. అయినా పట్టుదలగా ముందుకే సాగింది. 2022 సెప్టెంబర్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా తన అనుభవాలు వివరిస్తూ చేసిన వీడియో వైరల్ అయింది. 50 వేలకు పైగా సబ్‌స్క్రైబర్‌లు వచ్చారు. మూడు లక్షలు సంపాదించింది. అందరికంటే భిన్నంగా ఆర్థిక విషయాలపై అవగాహన కల్పిస్తూ తన అభిమానులను ఎడ్యుకేట్ చేస్తోంది. పర్సనల్ ఫైనాన్స్ గురించి సులభంగా, సరళంగా అర్థమయ్యేలా వీడియోలు షేర్ చేస్తుంది. ముఖ్యంగా మనీ హ్యాబిట్స్ కీపింగ్ యు పూర్ నుండి మీ తొలి పెట్టుబడి ఎలా పెట్టాలి వరకు అంశాలపై సలహాలను అందిస్తోంది. స్టాక్ మార్కెట్, రియల్ ఎస్టేట్ పెట్టుబడి వ్యూహాలను అందిస్తుంది. ఆమె కంటెంట్ విభిన్నంగా, బిజినెస్‌లో చక్కటి సూచనలు సలహాలతో ఫాలోవర్ల మనసు దోచుకుంది.

అలా 2024 మే నాటికి ఆమె సంపాదన రూ.8కోట్లను దాటేసింది. యూట్యూబ్ మానిటైజేషన్, కోర్సు విక్రయాలు, కార్పొరేట్ స్పీకింగ్ ఎంగేజ్‌మెంట్‌లు, బ్రాండ్స్ పార్టనర్‌షిప్ ఇందులో ఉన్నాయి. నచ్చిన పని చేయడంలో సంతోషం, విజయం ఉంటాయని చాటి చెప్పింది. సాధించాలన్న అభిరుచి, పట్టుదల, టాలెంట్ ఉంటే ఆర్థికంగా ఎలా ఉన్నత శిఖరాలకు చేరవచ్చో నిషా విజయ గాథ మనకు తెలియజేస్తుంది. లండన్‌కు చెందిన ఆమె నాటింగ్‌హామ్ విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్ విభాగంలో డిగ్రీ, ఆ తర్వాత ఛార్టర్డ్ అకౌంటెంట్ చదివారు. ■

సామాజిక మాధ్యమాల్లోనూ బీజేపీ దుష్ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో ముందుండాలని కోరారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) సోషల్ మీడియా రాష్ట్రస్థాయి శిక్షణా తరగతుల్లో తమ్మినేని ప్రారంభోపన్యాసం చేశారు. సోషల్‌మీడియా ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. పార్టీ రాజకీయ విధానాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఇదో ప్రధాన సాధనం అన్నారు. మతతత్వ విధానాలతో ముందుకొస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చర్యలకు వ్యతిరేకంగా పనిచేయాలని సూచించారు. మారుతున్న పరిస్థితుల్లో పత్రికలు, టీవీల కన్నా సోషల్ మీడియాపై ప్రజలు ఎక్కువగా ఆధారపడుతున్నారన్నారు. పెట్టుబడిదారుల ఆధీనంలో నడుస్తున్న మీడియా సంస్థలు అనేకం ఉన్నాయన్నారు. అటువంటి వాటిలో వస్తున్న వార్తలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిందన్నారు. శ్రామికవర్గ దృక్పథం, ప్రజా సమస్యలను వెలికి తీసుకురావడంలో ప్రధాన మీడియా దృష్టి సారించడం లేదన్నారు. ప్రజలే యజమానిగా ఉన్న సోషల్‌మీడియా వాస్తవాలను వెల్లడిస్తోందన్నారు. బీజేపీ.. సోషల్ మీడియాను సైతం పక్కదోవ పట్టిస్తుందని తెలిపారు. రూ.లక్షల్లో వేతనాలు ఇచ్చి దీని నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుందని చెప్పారు. బీజేపీ తర్వాత కాంగ్రెస్ పార్టీ కూడా దీనిని సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు చేపట్టిందన్నారు. స్థానిక సమస్యలపై సోషల్‌మీడియా ద్వారా చైతన్యం తీసుకురావాలని కోరారు. ప్రభుత్వాల్లోని లోపాలపై అవగాహన ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర రాజకీయాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సరైన పనిపద్ధతులతో ఆశించిన ఫలితాలు సాధించాలని సూచించారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సోషల్‌మీడియా వేదికగా భావ ప్రకటన దాడులు కొనసాగుతున్నాయని అన్నారు. బూర్జువాలు, మతోన్మాదులు సోషల్‌మీడియాను ఉపయోగించుకొని ప్రజాస్వామ్య శక్తులపై దాడులు కొనసాగిస్తున్నాయని తెలిపారు. శాస్త్రీయ భావాలు, సిద్ధాంతాలు, దేశభక్తులు, దేశభక్తి రాజకీయాలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ప్రజలపై మతోన్మాదుల దాడులు సోషల్ మీడియా వేదికగా అధికమయ్యాయని వివరించారు. ఈ దాడులను తిప్పికొట్టడంలో లౌకిక ప్రజాతంత్ర శక్తులు ముందుండాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు పిట్టల రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ శిక్షణా తరగతుల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, జగదీశ్, నాయకులు వై.విక్రమ్, సుందర్, శంకర్, నర్సిరెడ్డి, గొడుగు వెంకట్, యాటల సోమన్న తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాల విజృంభణ

(మొదటిపేజీ తరువాయి)

విషమించింది. అక్కడి నుంచి అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తీసుకెళు తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం హనుమాన్ తండాలో రాజేందర్, సంధ్య దంపతులు హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. వారి కూతురికి ఐదు రోజుల కిందట జ్వరం వచ్చి తగ్గింది. కాగా, స్వగ్రామంలో పని ఉందని కూతురుతో కలిసి వస్తుండగా.. దారిలో మళ్లీ జ్వరం ఎక్కువై ఫిట్స్ రావడంతో చికిత్స కోసం నర్సంపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

లద్దాక్‌లో ఐదు కొత్త జిల్లాలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించాలనే ప్రధాని మోడీ దార్శకతను అనుసరించి ఈ ఐదు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. లద్దాక్ ప్రజలకు సమృద్ధిగా అవకాశాలను కల్పించేందుకు మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మరోవైపు ప్రధానమంత్రి మోడీ కూడా లడక్‌లో ఐదు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం మెరుగైన పాలన, శ్రేయస్సు కోసం ఒక అడుగుగా ప్రశంసించారు. అయితే ఎన్నికల ముందు ఈ చర్య తీసుకోవటం రాజకీయం దుమారం రేపుతోంది.

విష జ్వరాలపై చర్యలు తీసుకోవాలి : తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విస్తరిస్తున్న విషజ్వరాలు, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్‌గున్యా తదితరాలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సోమవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్‌గున్యాతోపాటు విషజ్వరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో కుటుంబాలకు కుటుంబాలే మంచాన పడుతున్నాయని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఆదిలాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, కొమరంభీమ్, నిర్మల్, భూపాలపల్లి తదితర జిల్లాల్లో పరిస్థితి దారుణంగా ఉందని తెలిపారు. గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం లోపించడం వల్ల పరిస్థితి ఇంకా తీవ్రంగా మారిందని పేర్కొన్నారు. పది రోజుల నుంచి పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నదని తెలిపారు. ప్రతి ఏటా సీజనల్ వ్యాధులపై ప్రభుత్వం తాత్కాలిక ఉప శమన చర్యలు తీసుకోవడం తప్ప, శాశ్వత పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. అధికారికంగా నమోదైన కేసుల సంఖ్య కంటే వాస్తవంగా చాలా ఎక్కువగా ఉన్నాయని వివరించారు. డెంగ్యూ, విషజ్వరాల వల్ల అక్కడక్కడా మరణాలు సంభవిస్తున్నాయంటూ వార్తలొస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైనన్ని మందులు, బెడ్లు, డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్య పరికరాలు లేవని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోనూ ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయని తెలిపారు.

చాలా చోట్ల ప్లేట్‌లెట్లను నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేవని పేర్కొన్నారు. దీంతో పేద, మధ్య తరగతి రోగులు ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. అవసరంలేని వైద్య పరీక్షలు, బెడ్‌చార్జీలు, ఇతర చార్జీల పేరుతో ప్రయివేటు ఆస్పత్రులు రోగులను దోపిడీకి గురిచేస్తున్నాయని విమర్శించారు. ప్రజారోగ్యం క్షీణిస్తున్న ప్రస్తుత తరుణంలో తక్షణమే అన్ని గ్రామాలు, గిరిజన ప్రాంతాలు, గూడేల్లో మొబైల్ టీమ్‌ల ద్వారా వైద్య క్యాంపులను ఏర్పాటు చేసి వైద్య సహాయం అందించాలని సూచించారు. అవసరమైతే సంచార వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సౌకర్యాలు అందించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో దోమతెరలను పంపిణీ చేయాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలుకుని జిల్లా సెంటర్ల వరకు ప్లేట్‌లెట్ల కౌంట్ మిషన్లతోపాటు, హెల్త్ చెకప్, ఇతర వైద్య పరీక్షల పరికరాలు, మందులు, డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్లతో పాటు, ఇతర సిబ్బందిని సమకూర్చాలని డిమాండ్ చేశారు. వాటితోపాటు ఎమర్జెన్సీ పరికరాలను అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

యూపీఎస్ వద్దు..ఓపీఎస్ ముద్దు

(మొదటిపేజీ తరువాయి)

పెడతారని, అయితే వాటి నష్టాల చరిత్ర ఎవరికీ తెలియదని ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన డెమొక్రటిక్ టీచర్స్ ఫ్రంట్ (డీటీఎఫ్) తెలిపింది.

వచ్చే వడ్డీ కంటే పెన్షన్ చెల్లింపులు ఎక్కువైతే...

'ప్రస్తుత కార్పస్ నిధి నుండి వచ్చే వడ్డీ కంటే ఏ సంవత్సరంలో అయినా పెన్షన్ చెల్లింపుల మొత్తం ఎక్కువగా ఉంటే అనేక సమస్యలు వస్తాయి. అప్పుడు యూపీఎస్‌ను ఎంచుకున్న ఇన్-సర్వీస్ ఉద్యోగులు తమ వంతుగా మరింత వాటాను అందించాల్సి ఉంటుంది. లేదా యూపీఎస్ కార్పస్ దెబ్బతింటుంది. అంటే ఈ రోజు పెన్షన్ చెల్లించడానికి రేపటి పెన్షన్‌ను త్యాగం చేయాల్సి ఉంటుంది. లేకుంటే యూపీఎస్ కార్పస్‌ను మరింత రిస్క్‌తో కూడిన కంపెనీల్లో పెట్టుబడులకు మళ్లించాల్సి ఉంటుంది. ఫలితంగా మూలధనానికి నష్టం వాటిల్లుతుంది. అంటే యూపీఎస్ కార్పస్ తగ్గిపోతుంది. ఇవేవీ కాకుంటే పెన్షన్‌దారులకు పెన్షన్, డీఏల చెల్లింపులో అసాధారణ జాప్యం జరగవచ్చు. ఏది జరిగినా ఉద్యోగులు, పెన్షనర్లకు నష్టమే' అని డీటీఎఫ్ వివరించింది.

ఒరిగేదేముంది?

40 సంవత్సరాల వయసు దాటిన తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి యూపీఎస్ వల్ల ఒరిగేదేమీ లేదని, ఎందుకంటే వారు పాతిక సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకునే అవకాశమే ఉండదని 'ది అకడమిక్స్ ఫర్ యాక్షన్ అండ్ డెవలప్‌మెంట్ టీచర్స్ అసోసియేషన్' తెలిపింది. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం పొందే వయసు సాధారణంగా ఎక్కువగా ఉంటుందని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ టీచర్లు, ఉద్యోగుల విషయంలో వారి సర్వీసు కాలం చాలా తక్కువగా ఉంటుందని చెప్పింది. యూపీఎస్‌ను వేతన సంఘంతో అనుసంధానం చేస్తారా అనే దానిపై స్పష్టత లేదని అంటూ ఓపీఎస్ కింద పెన్షన్లను వేతన సంఘమే సమీక్షించేదని గుర్తు చేసింది.

స్పష్టత అవసరం

కాగా యూపీఎస్‌ను ఆహ్వానించే వారు సైతం పథకం నిధికి ఉద్యోగి తన జీతంలో పది శాతాన్ని అందజేయాలన్న నిబంధనను వ్యతిరేకిస్తున్నారు. నూతన పథకం వివరాలపై స్పష్టత రావాల్సి ఉన్నదని కొన్ని కార్మిక సంఘాలు తెలిపాయి. పదవీ విరమణ సమయంలో చెల్లించే మొత్తం, అదనపు పెన్షన్, ఆరోగ్య కార్డులు, భవిష్యత్తులో సవరణలు, పన్ను ప్రయోజనాలు వంటి అంశాలపై స్పష్టత కోసం ఎదురు చూస్తున్నామని వివరించాయి. ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య రాజీ కోసం ఏర్పడిన జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ (జేసీఎం) కార్యదర్శి శివ గోపాల్ మిశ్రా యూపీఎస్‌ను స్వాగతించారు. ఎన్‌పీఎస్ కింద 2004 జనవరి 1వ తేదీ తర్వాత ఉద్యోగంలో చేరిన వారు, పదవీ విరమణ చేసిన వారు యూపీఎస్ ప్రయోజనాలకు అర్హులని ఆయన చెప్పారు. సంఘ్ పరివార్ అనుబంధ భారతీయ మజ్దూర్ సంఘ్ కూడా యూపీఎస్‌పై హర్షం వ్యక్తం చేసింది.

మార్కెట్ గ్యాంబ్లింగ్ కొనసాగుతుంది

నూతన పెన్షన్ పథకం ఉద్యోగులను ఏమారుస్తోందని హింద్ మజ్దూర్ సభ మండిపడింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ వాటా చెల్లించకుండానే పెన్షన్ పొందుతున్నారని, అలాంటప్పుడు కేంద్రం తన ఉద్యోగులకు దానిని ఎందుకు నిరాకరిస్తోందని ప్రశ్నించింది. యూపీఎస్‌లో మార్కెట్ గ్యాంబ్లింగ్ కొనసాగుతుందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ తెలిపారు.

ఏడాదికే కూలిన శివాజీ విగ్రహం

ముంబయి: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ 35 అడుగుల విగ్రహం కుప్పకూలింది. రెండు రోజులుగా మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో పాటు నాణ్యతాలోపం వల్లే కూలినట్టు తెలుస్తోంది. ఈ ఘటనతో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. మహారాష్ట్ర రాష్ట్రంలోని సింధు దుర్గ్ జిల్లా రాజ్‌కోట్ కోటలో గతేడాది నేవీ డే సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ 35 అడుగుల శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అయితే.. రాష్ట్రంలో గత రెండూ మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతోపాటు ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈ క్రమంలోనే భారీ విగ్రహం కుప్పకూలింది. దీంతో పోలీసు సిబ్బంది, జిల్లా అధికారులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మరోపక్క ఈ ఘటనకు సరైన కారణాలు తెలుసుకునేందుకు నిపుణుల బృందం రంగంలోకి దిగింది.

నాణ్యతా లోపం వల్లే : ప్రతిపక్షాలు

శివాజీ విగ్రహం కుప్పకూలిన ఘటనపై ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. నాణ్యతా లోపం వల్లే కూలిపోయిందంటూ ఆరోపించాయి. "రాష్ట్ర ప్రభుత్వం విగ్రహావిష్కరణ కార్యక్రమంపై తప్ప.. నాణ్యతపై దృష్టి పెట్టలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ నష్టం వాటిల్లింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త టెండర్లు వేసి.. దాని ప్రకారం కమీషన్లు ఇస్తోంది" అని ఎన్సీపీ (ఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి జయంత్ పాటిల్ ఆరోపించారు. మరోవైపు ఈ ఘటనపై శివసేన (యూబీటీ) కూడా స్పందించింది. ప్రభుత్వం దీనికి బాధ్యత తీసుకోకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. దీనిపై మహారాష్ట్ర మంత్రి దీపక్ కేసర్కర్ స్పందించారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి : కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా ఐదుగురు చనిపోయారని వార్తలొచ్చాయి. సోమవారం మరో ముగ్గురు చనిపోయినట్టు వార్తాపత్రికల్లో వార్తలు చూస్తున్నాం. నిజాల్ని ప్రభుత్వం ఎందుకు దాస్తున్నట్టు?. ఆస్పత్రుల్లో సరిపడా మందులు కూడా లేవు. ఒకే బెడ్‌పై ముగ్గురు నుంచి నలుగురికి వైద్యం అందిస్తున్న పరిస్థితి నెలకొంది" అని కేటీఆర్ తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం డెంగ్యూ సమస్య తీవ్రంగా ఉందని అంగీకరించి వెంటనే రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన కోరారు.

బీజేపీ బలంగా లేకుంటే బంగ్లాదేశ్ పరిస్థితులే

(మొదటిపేజీ తరువాయి)

ఉండరని ఆమె తెలిపారు. ఇప్పటికీ ఆందోళనల పేరుతో వారు సరిహద్దుల్లో కూర్చుంటున్నారని అన్నారు. రైతుల ఆందోళనల కారణంగానే మహిళలపై దాడులు, లైంగికదాడులు జరుగుతున్నాయని అన్నారు. అయితే ఈ వివాదాస్పద వ్యాఖ్యలు బీజేపీకి తలనొప్పిగా మారాయి. కంగనా వ్యాఖ్యలతో తమ పార్టీకి ఎలాంటి సంబంధమూ లేదంటూ ఓ ప్రకటన ఇచ్చింది. పార్టీ విధాన సమస్యలపై బీజేపీ తరఫున కంగనా ప్రకటన చేసేందుకు ఎలాంటి అనుమతి లేదా అధికారం లేదని చెప్పి తప్పించుకునేందుకు యత్నించింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేయొద్దని కంగనాను ఆదేశించినట్టు సమాచారం. మరోపక్క కంగనా రనౌత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో కమలం పార్టీలోనూ భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.

ఏఐకేఎస్ ఖండన

రైతుల ఆందోళనలపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వ్యాఖ్యలను అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఖండించింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆమె వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించతగినవని ఏఐకేఎస్ అధ్యక్షులు డా.అశోక్ ధావలే తెలిపారు. వ్యవసాయాన్ని కబళించాలనుకునే అంతర్గత -బాహ్య యాజమాన్యాలను మెప్పించేందుకే కంగనా ఈ వ్యాఖ్యలు చేశారని అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని, ఆహార భద్రతను దెబ్బతీసేందుకు ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా కఠినమైన వాతావరణ పరిస్థితులు, కరోనా మహమ్మారి, ప్రభుత్వాల దౌర్జన్యాల మధ్య రైతుల ఉద్యమం సాగిందని ఏఐకేఎస్ పేర్కొంది. 736 మంది రైతులు ప్రాణత్యాగం చేశారని తెలిపింది. స్వాతంత్ర్య పోరాటానికి ద్రోహం చేసి బ్రిటీష్ శక్తులకు తలవంచిన పచ్చి మితవాద మత శక్తులకు రైతాంగాన్ని, కార్మిక ప్రజలను ప్రశ్నించే నైతిక అధికారం లేదని ధావలే మండిపడ్డారు. కంగనా వ్యాఖ్యలు రైతుల మధ్య విభేదాలను సృష్టించే లక్ష్యంతో ఉన్నందున ఈ వ్యాఖ్యలపై బేషరతుగా ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని అన్నారు.

డ్రైవర్ లేకుండానే..

(మొదటిపేజీ తరువాయి)

అభినందించారు. మరిన్ని సరికొత్త పరిశోధనలను ఐఐటీ హైదరాబాద్ వేదికగా ముందుకు తీసుకొస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ మూర్తి, జపాన్ సుజుకీ మోటార్స్ కంపెనీ ప్రతినిధి, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి జాబితాతోనే బీజేపీలో చిచ్చు

(మొదటిపేజీ తరువాయి)

ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఒక మహిళా అభ్యర్థి ఉన్నారు. పాంపోర్, షోపియాన్, అనంత్‌నాగ్ వెస్ట్, అనంత్‌నాగ్ వంటి స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. ఇక్కడ మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉండగా సెప్టెంబరు 18న తొలి దశ ఎన్నికలు జరగనున్నాయి.

కుదిరిన పొత్తు

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్‌లో కూటమి కింద నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై రాజీ కుదిరింది. రెండు పార్టీలు 85 స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దించనున్నాయి. ఇందులో ఫరూక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ 51 స్థానాల్లో, కాంగ్రెస్ 32 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. అదే సమయంలో సీపీఐ (ఎం), పాంథర్స్‌కు ఒక్కో సీటు ఇచ్చేందుకు అంగీకారం కుదిరిందని, సీట్ల పంపకం కోసం కాంగ్రెస్‌తో చర్చలు పూర్తయ్యాయని ఫరూక్ అబ్దుల్లా పొత్తును ప్రకటించారు. 90 స్థానాల్లో ఎన్సీ 51 స్థానాల్లో, కాంగ్రెస్ 32 స్థానాల్లో పోటీ చేయనుండగా, ఐదు సీట్లు స్నేహపూర్వక పోరుకు మిగిలాయని అంగీకారం కుదిరింది. జమ్మూ కాశ్మీర్‌ను కాపాడటమే ఇండియా బ్లాక్ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అన్నారు. కలిసికట్టుగా పోరాడి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్రమశిక్షణ, సహృదయంతో పోటీ జరుగుతుందని జమ్మూ కాశ్మీర్ కాంగ్రెస్ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా తెలిపారు. ప్రతి పార్టీ పోటీ చేసే స్థానాల జాబితా, అభ్యర్థుల పేర్లను తగిన సమయంలో విడుదల చేస్తామన్నారు.

భయం.. భయంగా..

మహిళలపై పెరుగుతున్న హింస

- సఖీ, భరోసా కేంద్రాల్లో బాధితుల మొర
- గృహ హింస, పోక్సో కేసులే అధికం
- రాష్ట్రంలో 2023లో 2284 లైంగికవేధింపుల కేసులు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'ఏ కండ్లు చెడు దృష్టితో చూస్తాయో..? ఏ చేతులు ఎక్కడ తాకి చిదిమేస్తాయో..? ఏ మగ మృగం కర్కశత్వంతో కాటు వేస్తుందో..? అని నిత్యం భయం.. భయంగా.. భద్రతలేని జీవితంతో మహిళలు క్షణ క్షణం నరకయాతన అనుభవిస్తున్నారు. మహిళా సమాజం కలతచెందని రోజంటూ లేదు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా.. ఎన్ని చర్యలు చేపడుతున్నా లైంగికదాడులు, హత్యలు, గృహహింస, ఆత్మహత్యలు, కించపర్చడం, అపహరణ, పోక్సో ఇలా అనేక రూపాల్లో మహిళలపై హింస పెరుగుతూనే ఉన్నాయి.

ఎన్సీఆర్బీ నివేదికను పరిశీలిస్తే.. రాష్ట్రంలో 2022లో కోర్టుల్లో విచారణ పూర్తయి 609 లైంగికదాడి కేసుల్లో శిక్షలు పడగా 4486 కేసులు కొట్టేయబడ్డాయి. 2022లో 2293 కేసులు, 2023లో 2284 లైంగికదాడి కేసులు నమోదైనట్టు రాష్ట్రంలోని క్రైమ్ రిపోర్టు వెల్లడిస్తుంది. 2023లో నమోదైన లైంగికదాడి కేసుల విషయంలో 69.18 శాతం కేసుల్లో పెండ్లి చేసుకుంటామని మభ్యపెట్టి లైంగిక చర్యకు పాల్పడినట్టు తేలింది. 13.14 శాతం కేసుల్లో ఇంటి చుట్టుపక్కల వారే ఘాతుకానికి పాల్పడినట్టు కేసుల విచారణలో తేలింది. ఇంకా దారణమేమిటంటే 6.44 శాతం కేసుల్లో బంధువులే ఘాతుకానికి ఒడిగడుతున్న పరిస్థితి. 10.68 శాతం కేసుల్లో ఇతరులు నేరాలకు పాల్పడుతున్నట్టు కేసుల విచారణలో తేలినట్టు సమాచారం. ఇంట్లో గృహ హింస, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులపై ఫిర్యాదులు పోలీసులకు అందుతున్నాయి.

కేసులు నమోదవుతున్నా ఆగని నేరాలు

పెరుగుతున్న ఫిర్యాదులు

హింసకు గురవుతున్న మహిళల నుంచి ఫిర్యాదులు పెరుగుతున్నాయి. అయినా ఇంకా చాలా మంది కేసు పెట్టేందుకు జంకుతున్న పరిస్థితి. రాష్ట్రంలో 331 షీ టీమ్స్ మహిళల రక్షణ కోసం పని చేస్తున్నాయి. ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్ విభాగం పనిచేస్తుంది. రాష్ట్రంలో వివిధ రకాలుగా జరుగుతున్న నేరాలు, వస్తున్న ఫిర్యాదులు, నమోదవుతున్న కేసులు, నిందితుల వివరాల ప్రకారం.. మహిళలపై జరుగుతున్న హింసకు సంబంధించి ఫోన్ ద్వారా వేధింపులు 986, వ్యక్తిగతంగా వేధింపులు 2861, మాటల ద్వారా 236, శారీరకంగా తాకడం ద్వారా 500, సోషల్ మీడియా ద్వారా 432, ఇతర రకాలుగా లైంగిక వేధింపులకు గురి చేసినవి 710 కేసులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. తమపై జరుగుతున్న లైంగిక హింసపై మహిళలు డయల్ 100, వాట్సప్, ఈ మెయిల్, ఎక్స్, హాక్‌ఐ, వ్యక్తిగతంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పరిస్థితి ఉంది. నేరాలకు పాల్పడుతున్న నిందితుల వయసును గమనిస్తే ఈ ఏడాది కాలంలో 18 ఏండ్లలోపు ఉన్న వాళ్లు 938 మంది ఉన్నారు. 19 నుంచి 25 వరకు 2630 మంది ఉన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 81 పోలీస్ స్టేషన్లున్నాయి. వీటిలో ఈ ఏడాది కాలంలో 9945 వివిధ రకాల కేసులు నమోదయ్యాయి. కేవలం మహిళలపై లైంగికదాడి, హత్య, ఆత్మహత్యలు, గృహహింస, అపహరణ, లైంగిక వేధింపులు, పోక్సో వంటి కేసులు 900 వరకు నమోదయ్యాయి. ఇందులో 110 లైంగికదాడి, హత్య కేసులు, 125 పోక్సో కేసులున్నాయి. 85 అపహరణ, 15 హత్యలు, 30 గృహహింస వంటి కేసులు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని సఖీ కేంద్రంలో 2017 నుంచి ఇప్పటి వరకు మహిళలపై నమోదైన లైంగిక వేధింపులు, హింసకు సంబంధించి 3058 కేసులు ఉన్నాయి. వీటిల్లో 2484 గృహహింస, 60 లైంగికదాడి, హత్య, 104 బాల్యవివాహాలు, 182 పోక్సో, 184 అపహరణ కేసులున్నాయి.

బతుకుకు భద్రతనివ్వని చట్టాలు

ఎన్నో చట్టాలు వచ్చినా అమలు చేసే విషయంలో పాలకులు అనుసరించే వైఖరి వల్ల మహిళల బతుకులకు ఏ చట్టాలూ భద్రత ఇవ్వని పరిస్థితి ఉంది. రాష్ట్రంలో వినూత్నంగా షీ టీమ్స్‌ను పెట్టారు. మహిళల రక్షణ, చట్టాలు, వేధింపులకు సంబంధించి అవగహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 100కు కాల్ చేస్తే రక్షణగా వస్తున్న పరిస్థితి ఉంది. అయినా నేరాలు జరుగుతూనే ఉన్నాయి. మహిళా స్త్రీ సంక్షేమ శాఖ ద్వారా సఖీ కేంద్రాలు నడుపుతున్నారు. గృహ హింస, బాల్య వివాహాలు, లైంగికదాడులు, హత్యలకు సంబంధించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ముఖ్యంగా భార్యభర్తలకు సంబంధించిన కేసుల్లో రాజీ కుదిర్చి కౌన్సెలింగ్ ఇస్తున్నప్పటికీ నేరాల్ని అదుపు చేసే పరిస్థితిలేదు. అలాగే భరోసా సెంటర్లు కూడా పెట్టి మహిళలకు సంబంధించిన భద్రత, రక్షణ విషయంలో పనిచేస్తున్నారు. అయినా ఇంకా చాలా మంది తమపై జరుగుతున్న హింసను చెప్పుకునేందుకు ముందుకు రావట్లేదు. కొంత వరకు అవగాహన పెరిగినా ఇంకా కేసులంటే న్యాయం జరగదని, నిందితుని నుంచి మరింత ముప్పు ఉంటుందన్న భయంతో ఫిర్యాదు కూడా చేయట్లేదు. చాలా కేసుల్లో పెద్దమనుషుల జోక్యంతో రాజీ కుదిర్చి వినకపోతే బెదిరింపులకు పాల్పడుతున్నారు.

భద్రత కల్పించేందుకు అన్ని విధాల చర్యలు: రూపేష్, ఎస్పీ సంగారెడ్డి

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు అనేక విధాలా చర్యలు తీసుకుంటున్నాం. భరోసా, సఖీ, షీ టీమ్స్‌తో పాటు సంగారెడ్డిలో మహిళా పోలీస్ స్టేషన్ ద్వారా కూడా అనేక విషయాల్లో అవగాహన కల్పించడం, రక్షణ, భద్రత కల్పించడం ద్వారా మంచి ఫలితాలున్నాయి. డయల్ 100కు వచ్చే కాల్స్‌కు వెంటనే స్పందించడం ద్వారా అనేక సందర్భాల్లో నేరాలు జరగకుండా అరికట్టగలిగాం. కళాశాలలు, స్కూల్స్, విద్యా సంస్థల్లో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. కఠిన చట్టాలు ఉన్నాయి.

ఆదిభట్ల పీఎస్‌లో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి ?

నవతెలంగాణ-ఆదిభట్ల

రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీసుస్టేషన్‌లో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాదర్‌గుల్ గ్రామ ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించారు. గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆదిభట్ల పోలీసులు..వారిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. వారిని విచారిస్తుండగా అందులోని ఓ వ్యక్తి గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు.వెంటనే పోలీసులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇదే విషయంపై ఆదిభట్ల సీఐ రాఘవేంద్రరెడ్డిని సమాచారం అడగ్గా మాట దాటవేసే ప్రయత్నం చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మహిళా అథ్లెట్లు గత రికార్డును బ్రేక్ చేసేనా..?

- 32మందితో భారత మహిళల బృందం

పారిస్ పారా ఒలింపిక్స్ రేపటి నుంచే..





పారిస్: 17వ పారా ఒలింపిక్స్‌లో భారత మహిళా అథ్లెట్లు అత్యధిక పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. 1968నుంచి భారత మహిళా అథ్లెట్లు పారా ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నా.. ఇప్పటివరకు దక్కింది కేవలం నాలుగు పతకాలే. ఇందులో ఒక్క 2021 టోక్యోలోనే మూడు పతకాలు లభించగా.. అందులో అవని లేఖరే షూటింగ్ విభాగంలో ఏకంగా రెండు పతకాలు సాధించడం మరో విశేషం. 2024 పారిస్ పారా ఒలింపిక్స్‌లో భారత్‌నుంచి మొత్తం 84మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. వీరిలో 32మంది మహిళా అథ్లెట్లు ఉన్నారు. 1968లో మెక్సికో వేదికగా జరిగిన 3వ పారా ఒలింపిక్స్‌లో భారత్‌నుంచి తొలిసారి 10మంది మహిళా అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించారు. ఆ ఒలింపిక్స్‌లో ఒక్క మహిళా అథ్లెట్ కూడా పతకాన్ని సాధించలేదు. ఆ తర్వాత 1972(పశ్చిమ జర్మనీ), 1976(కెనడా), 1980(నెదర్లాండ్స్).. ఇలా వరుస పారా ఒలింపిక్స్‌లో భారత్‌నుంచి మహిళా అథ్లెట్ల ప్రాతినిధ్యం పెరుగుతున్నా.. పతకాల వేటలో వెనుకబడిపోయారు.

2024 పారా ఒలింపిక్స్‌లో భారత్ ప్రాతినిధ్యం..

క్రీడాంశం	పురుషులు	మహిళలు	మొత్తం
ఆర్చరీ	3	3	6
అథ్లెటిక్స్	28	10	38
బ్యాడ్మింటన్	7	6	13
సైక్లింగ్	1	1	2
జూడో	1	1	2
పారాకనోయింగ్	1	2	3
పవర్‌లిఫ్టింగ్	2	2	4
రోయింగ్	1	1	2
షూటింగ్	7	3	10
స్విమ్మింగ్	1	0	1
టేబుల్‌టెన్నిస్	0	2	2
తైక్వాండో	0	1	1
మొత్తం	52	32	84

2016 రియోలో తొలిసారి..

2016 రియో పారా ఒలింపిక్స్‌లో మహిళా విభాగంలోభారత్‌కు తొలిసారి ఒక పతకం దక్కింది. షాట్‌పుట్‌లో దీపా మాలిక్ సుదీర్ఘ పతకాల సాధన నిరీక్షణకు తెర దించింది. ఆ పారా ఒలింపిక్స్‌లో దీపా మాలిక్ షాట్‌పుట్ ఎఫ్-53 విభాగంలో రజత పతకంతో మెరిసింది. దీంతో పారా ఒలింపిక్స్‌లో భారత్‌కు మహిళల కేటగిరీలో తొలి పతకం అందించిన మహిళా అథ్లెట్‌గా ఆమె రికార్డుపుటల్లోకెక్కింది.

టోక్యోలో మరో మూడు...

రియో ఒలింపిక్స్‌లో ఒక పతకం సాధించిన జోష్‌తో 2021 టోక్యో పారా ఒలింపిక్స్‌లో భారత మహిళల బృందం ఏకంగా మూడు పతకాలతో మెరిసారు. ఆ ఒలింపిక్స్‌లో షూటింగ్ విభాగంలో అవని లేఖరే ఏకంగా రెండు పతకాలు కైవసం చేసుకోగా.. టేబుల్ టెన్నిస్ విభాగంలో భావినా పటేల్ మరో పతకం అందించింది. అవని లేఖరే 10మీ. ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్-1 విభాగంలో స్వర్ణం, 50మీ. రైఫిల్-3 పొజిషన్‌లో కాంస్య పతకం కైవసం చేసుకుంది. దీంతో ఒక పారా ఒలింపిక్స్‌లో రెండు పతకాలు అందించిన భారత మహిళా షూటర్‌గా అవని రికార్డుల్లోకెక్కింది. ఇక భావినా పటేల్ టేబుల్ టెన్నిస్ సింగిల్స్ సి-4 విభాగంలో రజత పతకం ముద్దాడింది.

2024 పారా ఒలింపిక్స్ పారిస్ వేదికగా ఆగస్టు 28నుంచి సెప్టెంబర్ 8వరకు జరగనున్నాయి.

పారా ఒలింపిక్స్‌లో మహిళా అథ్లెట్లకు దక్కిన పతకాలు..

2016(రియో) : దీపా మాలిక (రజత పతకం) షాట్‌పుట్ ఎఫ్-53
2021(టోక్యో) : అవని లేఖరే (స్వర్ణం) 10మీ. ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్-1
భావినా పటేల్ (రజతం) టేబుల్ టెన్నిస్ సింగిల్స్ సి-4
అవని లేఖరే (కాంస్యం) 50మీ. రైఫిల్-3పొజిషన్ ఎస్‌హెచ్-1


షకీబ్‌కు జరిమానా

రావల్పిండి: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్-అల్-హసన్ జరిమానాకు గురయ్యాడు. రావల్పిండి టెస్టులో అతడు ఐసిసి నియమావళిని ఉల్లంఘించడంతో మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత పడింది. పాకిస్తాన్‌తో జరిగిన తొలి టెస్ట్ ఐదోరోజు ఆటలో భాగంగా షకీబ్ బంతిని పాక్ ఆటగాడు మహ్మద్ రిజ్వాన్ పైకి విసిరాడు. ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న మ్యాచ్ రిఫరీ ఐసిసికి ఫిర్యాదు చేశాడు. రావల్పిండి టెస్టులో బంగ్లాదేశ్ విజయానికి ఆరు వికెట్లు అవసరమైన దశలో షకీబ్ బంతి అందుకున్నాడు. అప్పటికీ పాక్ స్కోర్ 103-4. ఆ సమయంలో క్రీజులో మహ్మద్ రిజ్వాన్(18), నాన్ స్ట్రయికింగ్‌లో అబ్దుల్లా(37) ఉన్నారు. ఇక రనప్ పూర్తి చేసి షకీబ్ బంతిని విసిరేందుకు సిద్ధమయ్యాడు. అయితే బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేని పక్కకు జరిగాడు. దాంతో, చిర్రెత్తుకొచ్చిన షకీబ్ బంతిని రిజ్వాన్ తల మీదుగా వికెట్ కీపర్ వైపు విసిరాడు. ఊహించని పరిణామంతో షాక్ తిన్న అంపైర్ ఇదేంటీ.. ఏం చేస్తున్నావ్ అంటూ షకీబ్ తీరును తప్పు పట్టాడు. అంతేకాదు ఆ బంతిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించాడు. మ్యాచ్ అనంతరం షకీబ్ దురుసు ప్రవర్తనను ఐసీసీ దృష్టికి తీసుకెళ్లాడు. షకీబ్ వీడియో పరిశీలించిన ఐసీసీ క్రమశిక్షణ కమిటీ అతడు నియమాలను ఉల్లంఘించినట్టు తేల్చింది. అందుకు శిక్షగా అతడికి మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించింది.

International Cricket Council

నవచిత్రం

కథలో అసలు ట్విస్ట్ అదే..


కుష్బూ చౌదరి, తేజస్ కంచర్ల

'హుషారు' వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యువ కథానాయకుడు తేజస్ కంచెర్ల. ఆయన తాజాగా నటిస్తున్న చిత్రం 'ఉరుకు పటేల'. 'గెట్ ఉరికిఫైడ్' సినిమా ట్యాగ్ లైన్.

లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను ఈ సినిమాను నిర్మించారు. సెప్టెంబర్ 7న ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, 'పట్నం పిల్లా..', 'ఓరి మాయలోడా..' సాంగ్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. లేటెస్ట్‌గా సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'హీరోకి పెళ్లి వయసు వచ్చినా పెళ్లి కావటం లేదని బాధ ఎక్కువ అవుతుంటుంది. అందుకు కారణం.. తనేమీ చదువుకోడు. కానీ బాగా చదువుకున్న పిల్లనే పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. అతని ఆశలకు తగ్గట్టే హీరోయిన్ అతన్ని ప్రేమిస్తుంది. చాలా మంది చదువుకున్న అమ్మాయిలకు నచ్చని హీరోని హీరోయిన్ మాత్రం ఎందుకు ప్రేమించిందా! అనేది చాలా మందిలో ఉండే ప్రశ్న. కానీ.. కథలో అసలు ట్విస్ట్ అదే. మన హీరోయిన్‌లో మరో కోణం బయటకు వస్తుంది. దెబ్బకు హీరో భయపడతాడు. హీరో ఎందుకు భయపడ్డాడు?, చివరకు ఏమైందనేది ఈ చిత్ర కథ అని దర్శక, నిర్మాతలు చెప్పారు.

మహేష్ వాయిస్ ప్రత్యేక ఆకర్షణగా..


మహేష్‌బాబు

2019లో విడుదలైన లైవ్-యాక్షన్ 'ది లయన్ కింగ్' బ్లాక్‌బస్టర్ విజయాన్ని కొనసాగిస్తూ 'ముఫాసా: ది లయన్ కింగ్' విజువల్ వండర్‌గా ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసేందుకు రిలీజ్‌కి రెడీగా ఉంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'ముఫాసా'కి హీరో మహేష్ బాబు వాయిస్ ఓవర్ ఇచ్చారు. అలాగే పుంబాకి బ్రహ్మానందం, టిమోన్ పాత్రకి అలీ వాయిస్ ఇచ్చారు. రాజుకి సంబంధించిన పురాణ గాథను రఫీకి వివరిస్తున్నట్లు ట్రైలర్‌లో ప్రజెంట్ చేశారు. ఈ కథ ముఫాసా అనే ఆర్ఫన్ కబ్‌ని, రాజ వారసత్వం కలిగిన దయగల సింహం టాకాను పరిచయం చేస్తుంది. బారీ జెంకిన్స్ డైరెక్షన్‌లో వాల్ట్ డిస్నీ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 20న ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో భారతీయ థియేటర్లలో విడుదల కానుంది.


అందరూ చూడాల్సిన సినిమా



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'రేవు'. సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పారుపల్లి ప్రొడక్షన్ పై నిర్మాత డా.మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించారు. నిర్మాణ సూపర్ విజన్‌గా జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు వ్యవహరించారు. హరినాథ్ పులి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈనెల 23న రిలీజై, సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది.

సెలబ్రిటీ షోలో సినిమాను వీక్షించిన హీరో శ్రీకాంత్, దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి, హీరో తరుణ్, జబర్దస్త్ రాకేష్ తదితరులు సినిమా చాలా బాగుందని ప్రశంసల వర్షం కురిపించారు. అందరూ చూడాల్సిన సినిమా అంటూ కొనియాడారు. ఇందులోని కాన్సెప్ట్ ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందని తెలిపారు. అలాగే ఈ సినిమాకు వస్తున్న మౌత్ టాక్, పాజిటివ్ రివ్యూలపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ స్పందిస్తూ, సోషల్ మీడియా ద్వారా ఈ సినిమా గురించి ప్రత్యేకంగా పోస్ట్ చేయటం విశేషం.

తిన్నడుగా మంచు అవ్రామ్


అవ్రామ్ భక్త మంచు

విష్ణు మంచు నటిస్తూ నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం ఈ చిత్రంలోని స్పెషల్ క్యారెక్టర్ పోషించిన మంచు వారి మూడో తరం నుంచి అవ్రామ్ భక్త మంచు లుక్‌ను రిలీజ్ చేశారు.

విష్ణు మంచు తనయుడు అవ్రామ్ భక్త మంచు ఈ సినిమాతో వెండితెరకు పరిచయం అవుతున్నారు. ఇందులో అవ్రామ్ క్యారెక్టర్‌కి సంబంధించిన పోస్టర్‌ను మోహన్ బాబు రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో అవ్రామ్ ఎంతో పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కాళీమాత విగ్రహం డిజైన్ కూడా అదిరిపోయింది. తిన్నడు బాల్యానికి సంబంధించిన లుక్‌లో అవ్రామ్ ప్రేక్షకులను అలరించబోతున్నారు.

అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్‌లో ఈ సినిమా పాన్ ఇండియా వైడ్‌గా విడుదల కానుంది.

రొటీన్‌కి భిన్నంగా కళింగ



'కిరోసిన్' సినిమాతో మంచి పేరు తెచ్చుకున్న ధ్రువ వాయు ఇప్పుడు 'కళింగ' అంటూ కొత్త కాన్సెప్ట్‌తో హీరోగా, దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వస్తున్నారు. బిగ్ హిట్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ నిర్మిస్తున్న ఈ సినిమాని సెప్టెంబర్ 13న విడుదల చేయబోతున్నారు.

హీరో, దర్శకుడు ధ్రువ వాయు మాట్లాడుతూ, 'టీజర్, పోస్టర్ వీటితోనే సినిమా మీద హైప్ పెరిగింది. ఆల్రెడీ అన్ని చోట్లా బిజినెస్ అయింది. కంటెంట్ అందరికీ నచ్చడంతో అన్ని చోట్లా డీల్స్ అయిపోయాయి. ఇది కచ్చితంగా రెగ్యులర్ మూవీలా మాత్రం ఉండదు. అన్ని రకాల అంశాలు ఇందులో ఉంటాయి. ఇంత వరకు ఇలాంటి కాన్సెప్ట్‌తో తెలుగులో రాలేదు' అని తెలిపారు.

సినిమాను చూసిన తరువాత ఓ మంచి ఫీలింగ్‌తో ప్రేక్షకులు థియేటర్ల నుంచి బయటకు వస్తారు' అని నిర్మాత దీప్తి కొండవీటి చెప్పారు. మరో నిర్మాత పృథ్వీయాదవ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా అద్భుతంగా వచ్చింది. చాలా వరకు అవుట్ డోర్‌లో, ఫారెస్టులో తీశాం. ధ్రువ వాయు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాను తీశారు' అని అన్నారు.

తల్లి మనసుకు ప్రతిబింబం


సాహిత్య, సాత్విక్

ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మాతగా తొలిసారి సినీరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులు. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం కొద్ది రోజుల క్రితం ప్రారంభమై, శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. హైదరాబాద్, బి.హెచ్.ఈ.ఎల్.లో హీరోయిన్ ఇంటికి సంబంధించిన సన్నివేశాల్ని చిత్రీకరించారు. ఇందులో భాగంగా రచిత మహాలక్ష్మి, సాత్విక్, సాహిత్య, దేవీప్రసాద్, శుభలేఖ సుధాకర్ తదితరులపై కీలక సన్నివేశాలు షూట్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత ముత్యాల అనంత కిషోర్ మాట్లాడుతూ, '30 శాతం షూటింగ్ పూర్తయ్యింది. సింగిల్ షెడ్యూల్‌లోనే చిత్రీకరణ పార్ట్ పూర్తి చేస్తాం. అలాగే మరోవైపు ఎడిటింగ్ కూడా జరుగుతోంది' అని తెలిపారు.

'వాస్తవిక కుటుంబ అంశాలకు దగ్గరగా తల్లి మనసుకు అద్దం పట్టే చిత్రమిది' అని సమర్పకులు ముత్యాల సుబ్బయ్య చెప్పారు. 'ఓ మధ్య తరగతి తల్లి మనోవేదన, సంఘర్షణనే ఈ చిత్రం' అని దర్శకుడు తెలిపారు.

అరుదైన ప్రేమకథ


వృత్తి వాఘని, నారా రోహిత్, శ్రీదేవి


హీరో నారా రోహిత్ నటిస్తున్న తన 20వ చిత్రం 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు.

సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్ పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. టీజర్ లాంచ్‌తో మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా హీరో నారా రోహిత్ మాట్లాడుతూ, 'ఇదొక పెక్యులర్ లవ్ స్టోరీ. నా కమ్ బ్యాక్ మూవీగా ఈ స్క్రిప్ట్‌నే లాక్ చేశాం. ఈ సినిమా జర్నీ చాలా స్పెషల్. వెంకీ బ్రిలియంట్‌గా కథ రాశారు. టీజర్ మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. లియాన్ జేమ్స్ మంచి ఆల్బమ్ ఇచ్చాడు. మంచి పాటలు కుదిరాయి' అని అన్నారు.

'ఈ కథని ఓకే చేసిన రోహిత్‌కి థ్యాంక్స్. ఆయనే దీన్ని ముందుంచి నడిపించారు. వెంకీ పెద్ద డైరెక్టర్ అవుతారు' అని నిర్మాత సంతోష్ చిన్నపొల్ల చెప్పారు. డైరెక్టర్ వెంకటేష్ నిమ్మలపూడి,'ఇది నా ఫస్ట్ స్టేజ్. ఈ అవకాశం ఇచ్చిన రోహిత్‌కి థ్యాంక్స్. టీజర్ మాదిరిగానే ఇంతే క్లీన్, నీట్‌గా సినిమా ఉంటుంది. సినిమా చూసి నవ్వుకుని, కొన్ని మంచి మెమరీస్ ఇంటికి తీసుకెళతారు' అని తెలిపారు. 'ఇంతమంచి అవకాశం ఇచ్చిన రోహిత్‌కి థ్యాంక్స్. ఈ సినిమా మాకు ఎక్సలెంట్ ఎక్స్‌పీరియన్స్' అని సహ నిర్మాతలు రాకేష్ మహంకాళి, గౌతమ్ రెడ్డి తెలిపారు.

థ్రిల్ చేసే కొటేషన్ గ్యాంగ్


ఎన్టీఆర్ శ్రీను, దామోదర ప్రసాద్, వేణుగోపాల్

జాకీ ష్రాఫ్, ప్రియమణి, సన్నీలియోన్, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో నటించిన మూవీ 'క్యూజీ గ్యాంగ్ వార్'. ఎన్టీఆర్ శ్రీను సమర్పణలో వస్తున్న ఈ మూవీకి సంబంధించి తెలుగు వరల్డ్ వైడ్ రిలీజ్ హక్కులను రుషికేశ్వర్ ఫిల్మ్స్ బ్యానర్ తరపున నిర్మాత వేణుగోపాల్ సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ సోమవారం ఘనంగా జరిగింది.

ఈ ఈవెంట్‌లో ముఖ్య అతిథులుగా శ్రీను, శివనాగు, నిర్మాత వేణుగోపాల్, ఎన్టీఆర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు. ప్రసన్న కుమార్, దామోదర్ ప్రసాద్ చేతుల మీదుగా బిగ్ టికెట్ లాంచ్ చేశారు. ఈనెల 30న ఈ సినిమాని ఐదు భాషల్లో విడుదల చేయడానికి సిద్ధమయ్యారు.

ఈ సందర్భంగా నిర్మాత వేణుగోపాల్ మాట్లాడుతూ, 'ఇదొక మంచి మాస్ మసాలా కమర్షియల్ ఎంటర్టైనర్ సినిమా' అని చెప్పారు. 'ఫారెన్‌లో షూట్ చేసిన ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాం' అని ఎన్టీఆర్ శ్రీను చెప్పారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.